ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

సజల శ్రద్ధ


**సంకల్పం - సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి

**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం

**డా॥ యం.రామకృష్ణ**

**డా॥ తుమ్మూరి**

**కందర్ప రామచంద్ర రావు**

**కె.బి.సోమయాజులు**

**జి.సత్యవాణి**

**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 4 సంచిక 7**

**అక్టోబర్ 2003**

**విడిప్రతి రూ॥ 8.00**

**సం॥ చందా రూ॥ 85**

**3సం॥ చందా రూ॥ 250**

**10 సం॥ చందా రూ॥ 750**


## లో వెలుగు

గాలి తాకిడికి ప్రమిదలోని దీపం ఆరిపోయింది. ఎన్నెన్నో దీపాలు ఆరిపోయాయి. అలా ఆరిపోయిన దీపాలలో ఇది ఒకటి. వెలుగు లేకపోతే జీవితం కారు చీకటిలో మునిగిపోతుంది. ఈ చీకటి ఎప్పుడూ భయపెడుతూ ఉంటుంది. చీకటిలో ప్రాణం వణుకుతుంది. ఊపిరి తీసుకోవడం కూడ కష్టమవుతుంది.

జీవితమే కాక జగత్తు కూడ చీకటితో చుట్టుముట్టబడి ఉంది. చీకటిని పూర్తిగా తొలగించే దీపం ఈ జగత్తులో లేదు. ఉన్న దీపాలు గాలి తాకిడికి ఆరిపోయి చీకటిలో మునిగిపోతాయి. దీపాలు వెలుగుతాయి, ఆరిపోతాయి. అయినా చీకటి దట్టంగా మిగిలే ఉంటుంది. జగత్తులో వ్యాపించి ఉన్న చీకటి శాశ్వతమైనది. ఈ జగత్తులోని దీపాలను నమ్ముకునేవారు అమాయకులు. ఎందుకంటే ఈ దీపాలన్నీ చివరికి చీకటి దాడికి ఓడిపోయి ఆరిపోయేవే.

చీకటితో నిండిన ఈ జగత్తుకు ఆవల మరో లోకం ఉంది. అక్కడ వెలుగే వెలుగు. మన ఈ జగత్తులో వెలుగు క్షణికమైనది, తాత్కాలిక మైనది. కానీ, ఆ అంతరిక జగత్తులో చీకటి క్షణికమైనది, తాత్కాలికమైనది; వెలుగు శాశ్వతమైనది. ఆశ్చర్యమేమంటే - ఈ వెలుగుల లోకం మనకు చాలా దగ్గరగా ఉంది. చీకటి బయట ఉంది. వెలుగు మన లోపల ఉంది.

ఆంతరికలోకపు వెలుగు, లో వెలుగు, మేలుకోనంతవరకు ఏ దీపమూ మనకు నిర్భయత్వాన్ని ఇవ్వజాలదు. కనుక - మట్టి దీపాలపై, మృణ్మయ దీపాలపై నమ్మకాన్ని వదులుకోవాలి. చిన్మయ జ్యోతిని అన్వేషించాలి. ఎందుకంటే ఆ జ్యోతియే నిర్భయత్వానికీ, ఆనందానికీ పుట్టిల్లు. మనం చీకటిని చూచి గాబరాపడతాం. వెలుగును కోరుకుంటాం. మన అసలు అస్తిత్వం వెలుగేనని దీనివల్ల స్పష్ట మవుతోంది. ఎందుకంటే - వెలుగే వెలుగు కోసం ఆరాటపడగలుగుతుంది. వెలుగు కోసం తపన ఎక్కడ పుడుతోందో అక్కడే వెదుకు. ఆంతరిక లోకపు వెలుగుకు, లో వెలుగుకు, చిన్మయ జ్యోతికి జన్మస్థలం అక్కడే దాగి ఉంది.

**వినాశనం అనే వేదిక మీదనే నిర్మాణానికి పునాదిరాయి పడుతుంది.**

# విషయ సూచిక


ముఖ చిత్రం : **విజయవాడ కనక దుర్గ అమ్మవారు.**

1. వేదమంత్రం 3
2. గురుదేవుల దివ్యజీవనం
జన్మ జన్మల మార్గదర్శకులు మన గురుదేవులు 4
3. మనం - మన ఆరోగ్యం
రోగం మొదలయ్యేది మనస్సులో 6
4. వ్యక్తి నిర్మాణం
వ్యక్తిత్వం ఎదగాలంటే .... 9
5. బోధ కథ
స్వాతంత్ర్యం ఆయన ఊపిరి 13
6. యుగపరివర్తన ప్రక్రియ
యుగనిర్మాణ యోజనలోని శతసూత్ర కార్యక్రమం 16
7. దానం ఒక ఆధ్యాత్మిక ప్రక్రియ
సమర్పించడంలో సాత్వికానందం 18
8. జీవన విలువలు
మనిషి విలువకు గీటురాయి ఏది? 20
9. భాగవత బోధ
కర్మఫల వ్యవస్థ తిరుగులేనిది - 1 22
10. వందేమాతరం
ఆధ్యాత్మికతకు ఆటపట్టు భారతవర్షం 25
11. కుటుంబ నిర్మాణం
ఆస్తికతను పెంచితే భవిష్యత్తు ఉజ్వలం 28
12. దీర్ఘజీవన రహస్యం
బ్రహ్మచర్యం, ప్రాణాయామం 30
13. బోధ కథ
వజ్జీ పుత్త పశ్చాత్తాపం 33
14. సమాజ నిర్మాణం
సాంఘిక సంస్కరణ తప్పనిసరి 35
15. యుగగీత
యజ్ఞకర్మయే నిజమైన సన్యాసం 37
16. బోధకథ
ప్రార్థన చూపిన మహిమ 38
17. కృష్ణావతారం-11
కంస వధ 40
18. నావారితో నామాట 43
19. శాంతికుంజ్ సమాచారం 46
20. వార్తలు 47


## అహంకారం గొప్ప అవరోధం

ఆధ్యాత్మిక వికాసానికి అన్నిటినీ మించిన అవరోధం మనిషిలోని అహంకార ప్రవృత్తి. ఈ ప్రపంచం క్షణభంగురం అనే వాస్తవాన్ని నిరంతరం గుర్తు చేసుకుంటూ ఉండడం ద్వారా మనిషి ఈ దుష్ట ప్రవృత్తిని అదుపు చేయ గలుగుతాడు.

## అక్టోబర్ నెలలో పర్వదినాలు

2 గాంధీ జయంతి.
5 మధ్వాచార్య జయంతి.
విజయదశమి.
11 అట్లతద్ది.
25 స్వామి దయానంద నిర్యాణం, దీపావళి.
28 సోదరి నివేదిత జయంతి.
29 నాగులచవితి.

## నవంబర్ నెలలో పర్వదినాలు

1 ఆంధ్ర రాష్ట్ర అవతరణ.
5 గురునానక్ జయంతి.
14 ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి.
29 సుబ్రహ్మణ్య షష్ఠి.
30 జగదీష్‌చంద్ర బోస్ జయంతి.
గురు తేగ్ బహదూర్ బలిదానం

## రెండు రకాల దారిద్ర్యం

తనకు తానుగా స్వీకరించిన దారిద్ర్యం మనిషిని మహామానవుడుగా మలచుతుంది. కానీ సోమరితనంవల్ల దాపురించిన దారిద్ర్యం మనిషిలోని ఆకర్మణ్యత కలిగించే సహజ హరిణామం.

**అన్యాయానికి జనని అసమర్థత.**

# వేద మంత్రం

నిరాహావాన్కృణోతన సం వరత్రా దధాతమ ।
సిఙ్చా హా అవత ముద్రిణం వయం సుషేకమను పక్షితమ్ ॥

(ఋగ్వేద 10/101/5)

**భావార్థం :** భూమి మీద ఉదరపోషణ చేసేవారు రైతులు. వారికి సమాజంలో గౌరవ స్థానం లభించాలి. చదువుకొన్న వ్యక్తులే మంచి రైతులు కాగలరు.

**సందేశం :** పరమేశ్వరుడు ప్రతి ప్రాణికి పుట్టటానికి ముందే పొట్టనింపటానికి ఏర్పాటు చేసి ఉంచాడు. మొట్టమొదట తల్లిపాలు లభిస్తాయి. జీవితాంతం మనుష్యుని పొట్ట నింపటానికి అన్నం పండించటానికి భగవంతుడు తన ప్రతినిధిగా రైతును నియమించాడు. ఈ రైతే మన అన్నదాత, పరమేశ్వరుడు. గోధుమ, శనగలు, బియ్యం, పప్పులు మాత్రమే కాక పుష్టికరమైన పండ్లు, వనస్పతులు, ఔషధాలకు పనికివచ్చే వేళ్లు-మూలికలు ఉత్పత్తి చేస్తున్నాడు. రైతుశ్రమ వలననే పశువులకు మేత - మనకు నెయ్యి, పాలు నదులుగా ప్రవహిస్తున్నాయి. రైతు తన తపస్సు సాధనల ద్వారా మనకోసం అన్నం, ఔషధాలు, జలము, వాయువు, పశువులు, ధనము, సుఖసంపత్తుల దానము భూమాత నుండి ప్రాప్తించుకుంటున్నాడు. అతడే మన ప్రాణశక్తి, జీవనాధారము, ప్రజాపాలకుడు. అతడి స్థానము ఏ విధంగానూ భగవంతుడి కంటే తక్కువ కాదు. అతడి సహకారము లేకుండా ప్రపంచంలో ఏ పనీ నెఱవేరదు. 'భూఖే భజన్ నహోయ్ గోపాలా'.

అటువంటి రైతుకు సమాజంలో సర్వశ్రేష్ఠ స్థానం లభించాలి. జనక మహారాజు స్వయంగా పొలంలో నాగలి దున్ని రైతును గౌరవించాడు. కానీ నేటి వ్యవస్థలో అందరికంటే అధికంగా రైతు దోపిడి చేయబడుతున్నాడు. నడుం విరిగేంత శ్రమ చేసినా రైతు తన పొట్టకూడా నింపుకోలేకపోతున్నాడు. ఇలా ఎందుకు జరుగుతున్నది? మనం మర్యాదలను, నాగరిక కర్తవ్యాలను నెరవేర్చుటలో అయిష్టత చూపిస్తున్నాము. నిజం ఏమిటంటే నేడు మన ఆలోచనలు కలుషితమైనాయి. స్వార్థం, మాయ, మోహం, లోభం తెఱలను దాటి మనం ఏమీ చేయలేకపోతున్నాము.

బ్రాహ్మణుడు స్వయంగా స్వార్థంతో అంధుడై పతితుడవుతున్నాడు. ప్రజలను జాగృతం చేసే, కర్తవ్య నిష్ఠులను చేసే మహత్తర కర్తవ్యాన్ని అతడు మరచిపోయాడు. దీనితో రైతుకు కూడా దుర్దశ కలుగుతున్నది. అతడు నలువైపులా వ్యాపించిన భౌతిక సాధనాల మిరుమిట్లలో భ్రమితుడై గుడ్డివాళ్ల ఊరేగింపులో చేరేందుకు తాపత్రయపడుతున్నాడు. పని నుండి తప్పించుకుంటూ పనిదొంగ అవుతున్నాడు. తన ప్రతిభను దిగజార్చుకుంటున్నాడు. తన వివేకాన్ని సముచిత రీతిలో ఉపయోగించకపోవుట వలన శరీరము, మనస్సు, బుద్ధి యొక్క సక్రియత, తీక్షణత క్షీణిస్తాయి. తన అనుచిత ఆలోచనలు, అసంగతమైన నిర్ణయాలతో అన్నివైపులా హాని, నిరాశను ఎదుర్కొనవలసి వస్తున్నది.

దీనికి మూలము రైతులలో విద్యలేకపోవడము. ఒకరి కొకరు సహకరించుకొనుట, ఎదుటివారి అనుభవాలనుండి లాభం పొందుట, ప్రాకృతిక వనరుల సముచిత సదుపయోగము - ఇవన్నీ మంచి వ్యవసాయానికి అవసరము. వర్ష జలాన్ని వృధాగా పోనివ్వకుండా కాపాడి, తగిన విధంగా నిల్వ ఉంచితే, భూమి పచ్చదనాన్ని కాపాడుకోవచ్చు.

బ్రాహ్మణుల, విద్వాంసుల కర్తవ్యమేమంటే వారు రైతులకు తగిన మార్గదర్శకత్వం చేయాలి.

☆ ☆ ☆

**మనిషి సంపదలకల్లా గొప్పది బుద్ధి సంపద.**

# జన్మ జన్మల మార్గదర్శకులు మన గురుదేవులు

ఆషాఢమాసపు చిరుజల్లులు అంతరంగాన్ని సునాయాసంగా తడుపుతున్నాయి. వినీల ఆకాశంలో దోబూచులాడుతున్న మేఘాలనుండి వర్షపు చినుకులు ఒక్కొక్కటే రాలుతున్నాయి. అలాగే- అంతరంగంలో పరమపూజ్య గురుదేవుల జ్ఞాపకాలనే మేఘమాలలు కదలాడుతున్నాయి. వాటినుండి రాలిపడుతున్న ప్రేరణల చినుకులు ఆంతరిక చేతనను తడుపుతున్నాయి. ఆషాఢ పూర్ణిమ వచ్చింది. మనిషి అసంపూర్ణుడు; గురువు మాత్రమే అతడికి పూర్ణత్వం అనే వరాన్ని ప్రదానం చేస్తాడు - అనే సందేశాన్ని తెచ్చింది. కనుకనే ఆషాఢ పూర్ణిమ గురుపూర్ణిమ అయింది. గురువు ఏమి చేసినా శిష్యుడు పూర్ణత్వాన్ని పొందడంకోసమే చేస్తాడు. అతడు ఆ పనిని ఒకోసారి శిష్యుని కోరికను పూర్తిచేయడంద్వారా చేస్తాడు, ఒకోసారి ఆ కోరికను తిరస్కరించడంద్వారా చేస్తాడు. గురుదేవుల శిష్య వాత్సల్యం జ్ఞాపకం ఒకటి మనసులో తారాడుతోంది.

ఆరోజునకూడా ఆయన ఎప్పటివలె ప్రసన్నంగా కనిపించారు. పూర్తిగా విచ్చుకున్న అరుణ కమలంలా ఆయన ముఖమండలం తపోదీప్తితో వెలిగిపోతోంది. తేజస్సు నిండిన ఆయన నేత్రాలు వాతావరణ మంతటిలో ఆధ్యాత్మిక ప్రకాశాన్ని విరజిమ్ముతున్నాయి. శాంతికుంజ్‌లోని అణువణువూ, అక్కడి ప్రతి సాధకుని అంతరంగమూ ఆ కాంతితో వెలిగిపోతున్నాయి. ఆయన పలికే ప్రతి పలుకూ శిష్యులకు ఒక అమృత బిందువు. ఆయన కృపామయులు. శిష్యుల పాలిటి కల్పతరువు. ఏ కోరికనైనా పూర్తిచేసే సామర్థ్యం ఆయనకు ఉన్నదన్నది అందరి విశ్వాసం.

ఈ విశ్వాసంనుండి ఎరువూ, నీరూ పొంది, మనసులో ఏవో కోరికలు అంకురిస్తూ ఉంటాయి. ఆ రోజున ఆయన సన్నిధిలో ఒక శిష్యుని మనస్సులో ఒక ఆలోచన కలిగింది. కైవల్యం, నిర్వాణం, బ్రహ్మజ్ఞానం అనే వివిధ పదాలతో వర్ణించబడే పూర్ణత్వాన్ని సర్వసమర్థులైన గురుదేవులు తనకు వరంగా ఇవ్వకూడదా అన్నదే ఆ ఆలోచన. పరమపూజ్య గురుదేవులు తమ మంచంపై కూర్చొని ఉన్నారు. వారి చరణాలవద్ద నేలమీద ఒక చిన్నపట్టాపైన అతడు కూర్చున్నాడు. ఈ ఆలోచనను ఎలా వ్యక్తపరచాలా అని అతడు మథనపడుతున్నాడు. సంకోచిస్తున్నాడు. వెనుకాడుతున్నాడు. జంకుతున్నాడు. అంతా తెలుసుకునే అంతర్యామి అయిన గురుదేవులు అతడి మనసులోని భావాన్ని తెలుసుకుని చిరునవ్వు నవ్వుతున్నారు. చివరికి నవ్వుతూనే ఇలా అన్నారు - "చెప్పదలుచుకున్నది నిస్సంకోచంగా చెప్పు."

ఈ మాటతో అతడికి కాస్త ధైర్యం వచ్చింది. "గురుదేవా! నాకు మీరు బ్రహ్మజ్ఞానం ఇస్తారా?" - అని అతడు నెమ్మదిగా అడిగాడు.

ఈ ప్రశ్నకు గురుదేవులు మొదట బిగ్గరగా నవ్వారు. ఆ తర్వాత మౌనం వహించారు. పిల్లవాడు ఆటబొమ్మ అడిగితే, మిఠాయి అడిగితే తండ్రి నవ్వినట్లు ఉన్నది ఆ నవ్వు. అయితే ఆ మౌనంలో రహస్యం ఇమిడి ఉంది. అదేమిటో తెలియడం లేదు. ఇలా కొద్ది క్షణాలు గడిచాయి. గదిలో పరచుకొని ఉన్న నీరవతను ఛేదిస్తూ వారిలా అన్నారు - "నీకు బ్రహ్మజ్ఞానం కావాలికదా. నేను ఇపుడే ఈ క్షణంలోనే నీకు బ్రహ్మజ్ఞానం ఇవ్వగలను. అందులో నాకు ఇబ్బంది ఏమీ లేదు. ఆ సామర్థ్యం నాకు పూర్తిగా ఉంది."

ఈ మాట చెప్పి వారు మళ్లీ ఆగారు. వారి కళ్లలో కరుణ మెరిసింది. అర్భకుడైన తన పిల్లవాణ్ణి చూచినప్పుడు తల్లి కళ్లలో కనిపించే కరుణ అది.

"ఇపుడు నేను నీకు బ్రహ్మజ్ఞానం ఇస్తే నీవు ఏమయిపోతావో తెలుసా? నాయనా, నీ మతి చెడిపోతుంది. నీవు పిచ్చివాడివయి నగ్నంగా నాట్యం చేస్తావు. చిన్నపిల్లలు నీమీద రాళ్లు విసురుతారు."

అతడికి ఈ విషయం వింతగా తోచింది. దాని అర్థం అతడికి బోధపడలేదు. కరుణామూర్తి అయిన గురుదేవులు ఇలా వివరించారు -

"నాయనా, నీవు దీన్ని ఇలా అర్థం చేసుకో. 220 వోల్టుల సన్నటి తీగెలోకి 11,000 వోల్టుల విద్యుచ్ఛక్తి పంపితే ఏమవుతుందో తెలుసా?" ఆ ప్రశ్నకు తామే జవాబు చెపుతూ వారిలా అన్నారు - "ఆ సన్నటి తీగ తెగిపోవడమే కాదు. గోడలు సైతం పగిలిపోతాయి."

**ఆలోచన, వివేకములే మనిషిని ఉత్తమ ప్రాణిగా చేశాయి.**

"బ్రహ్మచేతన 11,000 వోల్టుల ప్రచండ విద్యుత్ ప్రవాహంవంటిది. సాధారణంగా మానవ చేతన 220 వోల్టులవలె బలహీనమైనది. కనుకనే - బ్రహ్మజ్ఞానాన్ని పొందాలంటే, ముందుగా తపస్సుచేసి శరీరాన్నీ, మనస్సునూ అత్యంత బలీయంగా రూపొందించవలసి ఉంటుంది. బ్రహ్మచేతన అనుభూతియొక్క మహావేగాన్ని సాధకుడు అప్పుడు మాత్రమే తట్టుకోగలుగుతాడు. అంతటి బలం లేకపోతే అంతా తలక్రిందులు అయిపోతుంది. బలవంతాన బ్రహ్మజ్ఞానాన్ని ఇచ్చే ప్రయత్నంలో సాధకుని శరీరమూ, మనస్సూ చెల్లాచెదరు అయిపోతాయి.''

శిష్యుని కోరికను తిరస్కరిస్తున్న గురుదేవ భగవానుని మనస్సు నుండి నిష్కల్మషమైన, నిర్మలమైన కరుణా ప్రవాహమే జాలువారుతోంది. ఎల్లపుడూ వరాలిచ్చే ప్రభువు వరం ఇవ్వకపోవడంలో తన కృపను వర్షిస్తున్నాడు.

ఈ స్థితిని వివరిస్తూ గురుదేవులు ఒక వాస్తవిక సంఘటనను వర్ణించారు.

అరవింద మహర్షికీ, వారి శిష్యుడు దిలీప్‌కుమార్ రాయ్‌కీ సంబంధించిన సంఘటన అది. విశ్వ విఖ్యాత సంగీత విద్వాంసుడు దిలీప్‌కుమార్ రాయ్ ఆరోజుల్లో శ్రీ అరవిందులనుండి దీక్ష పొందడానికి ఒత్తిడి చేస్తున్నాడు. దీక్షతో పాటు శ్రీఅరవిందులు శక్తిపాతం జరపాలన్నది ఆయన కోరిక. మహర్షి దాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. పలుమారులు అలా జరిగింది. శ్రీ అరవిందులవల్ల పని జరిగేది లేదని దిలీప్ భావించాడు. మరో గురువును శరణు పొందుదామని అనుకున్నాడు. ఒక గురువుగారిని కనుగొన్నాడు. ఆ గురువు పాండిచేరీకి బాగా దూరాన ఒక నిర్జన స్థలంలో నివసిస్తున్నాడు.

దిలీప్ రాయ్ ఆయనవద్దకు వెళ్లి దీక్ష ఇమ్మని ఆయనను ప్రార్థించాడు. ఆ గురువు అలా నవ్వుతూ ఉండిపోయారు. చివరికి, "నేను శ్రీ అరవిందులకన్న గొప్ప యోగినని నీవు అనుకుంటున్నావన్నమాట. నీపై శక్తిపాతం చేయకపోవడం కూడా ఆయన కృపయే"- అని అన్నారు. ఆయన దాన్ని ఇలా వివరించారు - "నీ కడుపులో భయంకరమైన వ్రణం ఉంది. ఒక్కసారిగా శక్తిపాతం జరిగితే ఆ వ్రణం పగిలి నీ ప్రాణాలు పోవచ్చు. కనుకనే నీ గురువు మొదట ఈ వ్రణాన్ని నయం చేస్తున్నారు. అది నయమైన తర్వాత వారు నీకు దీక్ష, శక్తిపాతం ఇస్తారు''. తన వివరణను పూర్తిచేస్తూ ఆ సంత్ దిలీప్‌తో ఇలా చెప్పారు - "నీ సంగతులన్నీ నాకెలా తెలిశాయో చెప్పనా. అరే! ఇప్పుడే నీవు వచ్చే ముందే అరవింద మహర్షి సూక్ష్మ శరీరంలో స్వయంగా ఇక్కడికి వచ్చారు. వారే నాకు నీ సంగతంతా వివరంగా చెప్పారు.''

ఆ మాటలు విని దిలీప్ అవాక్కు అయినాడు. శిష్యవత్సలుడైన గురువుగారి కరుణను అనుభూతి పొందిన ఆయన హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఈ విషయం మహర్షి స్వయంగా తనతోనే చెప్పవచ్చుకదా. మరి ఎందుకు చెప్పలేదు? పాండిచేరీ తిరిగివచ్చి తన గురువుగారినే ఈ ప్రశ్న అడిగాడు. శ్రీ అరవిందులు నవ్వుతూ - "ఈ ప్రశ్న నీకు నీవే వేసుకో. నీవు అంత తేలికగా నా మాట నమ్ముతావా?'' అన్నారు. ఆ మాటకూడా నిజమేనని దిలీప్ తనలో అనుకున్నాడు. తానా మాట అసలు నమ్మేవాడు కాడు. కానీ ఇపుడు నమ్మకం కుదిరింది. ఆ నమ్మకానికి ఫలితం కూడా ఆయనకు అందింది. నిర్ణీత సమయంలో శ్రీ అరవిందులు ఆయన కోరిక తీర్చారు.

ఈ వాస్తవిక సంఘటన వినిపించి గురుదేవులు ఇలా అన్నారు - "నాయనా! గురువుకు తన శిష్యులలో ప్రతి ఒక్కరి విషయం పూర్తిగా తెలిసి ఉంటుంది. గురువు ప్రతి శిష్యునికీ జన్మజన్మల సాక్షి, జన్మజన్మల సహచరుడు. ఏ శిష్యునికోసం ఏమి చేయాలో ఎప్పుడు చేయాలో గురువుకు పూర్తిగా తెలిసి ఉంటుంది. నిజమైన శిష్యుడు దేనికీ విచారించవలసిన పని లేదు. గురువుకు తనను తాను సంపూర్ణంగా సమర్పించుకోవడం, ఆయనపై నమ్మకం కలిగి ఉండడం - ఇదే అతడు చేయవలసిన పని.''

ఈ మాట చెప్పి వారు నవ్వసాగారు. వారింకా ఇలా అన్నారు - "నీవు ఆ పని చేయి. తగు సమయంలో నేను నీ కోసం అంతా చేసివేస్తాను. నీవు ఆశించినదానికన్న ఎంతో హెచ్చుగా చేస్తాను. నాకు నా పిల్లలలో ప్రతి ఒక్కరి మీదా దృష్టి ఉంది.''

తమ మాట మధ్యలో ఆపి తన శరీరం వైపు చూపుతూ వారిలా అన్నారు - "నాయనా! నా ఈ శరీరం ఉన్నా లేకున్నా, నేను నా శిష్యులలో ప్రతిఒక్కరినీ పూర్ణత్వానికి చేర్చుతాను. సమయానికి అనుగుణంగా అందరికీ అన్నీ చేస్తాను. ఏ ఒక్కరూ ఆందోళన చెందవలసిన పని లేదు.''

గురుదేవుల ఈ వచనం ప్రతి శిష్యునికీ ఒక మహామంత్రం. తన గురువు ఆశ్రమంలో కూర్చున్న శిష్యునకు ఎలాంటి చింతా, ఎలాంటి భయమూ ఉండకూడదు.

☆☆☆

**సత్కర్మలవల్ల సంతోషం, దుష్కర్మలవల్ల దుఃఖం కలుగుతాయి.**

మనం - మన ఆరోగ్యం

# రోగం మొదలయ్యేది మనస్సులో

మనిషి శరీరం అతడి మెదడుకు ప్రతిబింబమని చెప్పవచ్చు. ఆలోచన, మననం, సంవేదనలకు అనుగుణంగానే శారీరికమైన కార్యకలాపాల నిర్ణయం జరుగుతుంది. భావ సంవేదనల, హృదయ స్పందనల, ఆలోచనల ఉత్కృష్టత, నికృష్టతలు ఆధారంగానే మన ఆంతరిక వ్యవస్థ, ప్రాణశక్తి నిర్మాణం అవుతాయి.

ఆలోచనలు, భావనల అదృశ్య శక్తిని మన భారతీయ శాస్త్రాలు లోతుగా అధ్యయనం చేశాయి. మనిషి బాహ్య జీవితం అతడి భావనల ఫలితమేనని ఆ శాస్త్రాలు నిర్ణయించాయి. వాటికి ఈ జన్మతో సంబంధం ఉండకపోవచ్చు. కష్టం కాని, దుఃఖం కాని, రోగం కాని, శోకం కాని మనం పూర్వం చేసిన కర్మల ఫలితాలు. ఆ కర్మలు అంతకుముందు మనసులో జనించిన దుష్ట భావాల ఫలితాలు. ఈ కారణం వల్లనే - ప్రజల మనస్సులు నీచ స్థాయికి దిగజారకుండా ఉండేందుకై మన మహర్షులూ, మనీషులూ నిరంతరంగా కృషి చేస్తూ వచ్చారు. కష్టసాధ్యమైన సాధనలు, తీర్థయాత్రలు, సత్సంగాలు, నిత్య స్వాధ్యాయం వంటి కార్యక్రమాలద్వారా మెదడులో ఆధ్యాత్మిక, ధార్మిక, వైరాగ్య భావాలు నిరంతరం ప్రవహిస్తూ ఉండేటట్లు చేశారు. ఫలితంగా ప్రజలంతా కొద్దిపాటి సాధనాలతో అపారమైన సుఖశాంతుల అనుభూతి పొందేవారు.

యోగవాశిష్ఠం (6/1/81/30-37) ఇలా చెపుతోంది - "చిత్తంలో జనించిన వికారాలవల్లనే శరీరంలో దోషాలు జనిస్తాయి. శరీరంలో క్షోభ, దోషం జనించడంవల్ల ప్రాణాల ప్రసారంలో విషమత ఏర్పడుతుంది. ప్రాణాల చలనంలో వికృతి ఏర్పడడంవల్ల నాడుల పరస్పర సంబంధం చెడిపోతుంది. కొన్ని నాడులలో శక్తి లోపిస్తుంది. కొన్ని నాడులలో శక్తి జమ అవుతుంది.

"ప్రాణాల చలనం చెడిపోవడంవల్ల ఆహారం సరిగా జీర్ణం కాదు. ఒకోసారి మితిమీరి జీర్ణం అవుతుంది. ప్రాణముల సూక్ష్మ యంత్రాలలోకి స్థూలమైన ఆహార కణాలు చేరతాయి. అక్కడ పేరుకుపోయి కుళ్లిపోతాయి. అందువల్ల రోగాలు వస్తాయి. ఈ విధంగా మానసిక రోగం 'ఆధి' వల్లనే శారీరిక రోగం 'వ్యాధి' జనిస్తుంది. ఆ రోగాన్ని నయం చేయడానికి ఔషధాలకన్న మనిషి తన చెడు స్వభావాన్నీ, మనోవికారాలనూ సరిచేసుకోవడం మరింత అవసరం."

పైన పేర్కొన్న వాస్తవాన్ని నేడు వైద్య పరిశోధనలు ధృవపరచాయి. శాస్త్రవేత్తలూ, మనస్తత్వ వేత్తలూ, వైద్య నిపుణులూ నేడీ సత్యాన్ని లోతుగా అవగాహన చేసుకుంటున్నారు. ప్రముఖ వైద్య నిపుణుడు సర్ బి. డబ్లియు. రిచర్డ్సన్ తన 'ది ఫీల్డ్ ఆఫ్ డిసీజెస్' అనే గ్రంథంలో ఇలా వ్రాశారు - మానసిక ఉద్వేగంవల్లా, చింతలవల్లా చర్మం ఎలర్జీ వస్తుంది. కేన్సరు, హిస్టీరియా వంటి రోగాలలోకూడ మొట్టమొదట మానసిక జగత్తులో వికృతి ఏర్పడుతుంది.

వ్యక్తులు అలసిపోవడానికి కారణం శారీరిక పరిశ్రమ కాదనీ, ఉద్విగ్నత, గాబరా, చింత, విషమ మనఃస్థితి, మితిమీరిన భావుకత అనీ సుదీర్ఘ పరిశోధన తర్వాత నిపుణులు నిర్ణయించారు. నిరాశవల్ల కలిగిన గాబరా, ఆశాభంగం, శక్తిని మించిన కోరికలు, పరస్పర వ్యతిరేక భావనలమధ్య మనస్సులో కల్లోలం రేగడంకూడ వ్యక్తులు అలసిపోవడానికి కారణాలు. తాను తక్కువవాడిననే భావనవల్లకూడ శరీరం దెబ్బతింటుంది. అలసిపోకుండా ఉండాలంటే మనస్సు ఎప్పుడూ ప్రసన్నంగా ఉండాలి. ఆశావాదాన్ని మనస్సులో నింపుకోవాలి. ఆలోచనలు క్రమబద్ధంగా, నిర్మలంగా ఉంటే మెదడు చక్కగా పనిచేస్తుంది.

చెడు ఆలోచనలవల్ల రక్తంలో వికృతులు కలుగుతాయని మనస్తత్వ వైద్య నిపుణులు చెపుతున్నారు. ఆ వికృతులవల్ల రోగాణువులూ, విషాణువులూ వృద్ధి చెందుతాయి. మంచి ఆలోచనలు రక్త కణాలను బలపరుస్తాయి. చెడు ఆలోచనలు వాటిని బలహీనపరుస్తాయి. అయితే ఇలా ఆలోచనలు స్థూలరూపం ధరించడానికి సమయం పడుతుంది.

మన మహర్షులు మనస్సుయొక్క శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పారు. పాశ్చాత్య శాస్త్రవేత్తలూ, వైద్యనిపుణులూ కూడ ఈ విషయమై ఎన్నెన్నో పరిశోధనలు జరిపారు. 'ఇన్ఫ్లూయన్స్ ఆఫ్ ది మైండ్ అపాన్ ది బాడీ' అనే పరిశోధన గ్రంథంలో గ్రంథకర్త ఇలా వ్రాశారు - ఉన్మాదం, మూఢత్వం, పక్షవాతం, ఎక్కువగా చెమట పట్టడం,

ప్రసన్నతయే గొప్ప మానసిక ఆహారం.

పాండురోగం, జుట్టు ఊడిపోవడం, రక్తహీనత, గాబరా, గర్భాశయంలో శిశువుకు అంగవైకల్యం కలగడం,చర్మ రోగాలు, ఎగ్జిమా మున్నగు అనేక రోగాలు మనఃక్షోభవల్లనే వస్తాయి. అమెరికాలోని మనస్తత్వవైద్యుల బృందం జరిపిన పరిశోధనలు ఈ వాస్తవాన్ని ధృవపరచాయి. ఆ పరిశోధనల నివేదిక ప్రకారం - అలసట రోగులు నూటికి 90 మందిలో శారీరికమైన రోగమేదీ లేదు. వారి మానసిక స్థితి వికృతం కావడమే అందుకు కారణం. అజీర్ణ రోగులలో 70 శాతం, గొంతునొప్పి రోగులలో 75 శాతం, తలనొప్పి కళ్లుతిరగడం రోగులలో 80 శాతం, కడుపులో వాయు వికారం (గ్యాస్) రోగులలో 99 శాతం కేవలం భావనల దుష్ప్రభావం వల్లనే బాధపడుతున్నారు. కడుపులో అల్సరు, మూత్రాశయం ఉబ్బడంవంటి రోగాలలో 50 శాతం వ్యక్తిలోని దుర్గుణాలవల్లనే వస్తాయి.

రోగం శరీరంలో కాక మొదట మనస్సులో వస్తుందన్నది ఒక వాస్తవం. మానసిక స్థితిలో వికృతి ఏర్పడగానే శరీర వ్యవస్థ ఊగిసలాడుతుంది. శరీరమంతటిపైనా మనస్సుయొక్క అదుపు ఉన్నదన్నది స్పష్టం. మనస్సులోని అచేతన విభాగం రక్తప్రసరణ, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, ముడుచుకోవడం-యథాస్థితికి రావడం, నిద్ర, రెప్పలు అల్లార్చడం, జీర్ణక్రియ, మలవిసర్జన మున్నగు స్వాభావిక ప్రక్రియలను అదుపుచేస్తుంది. మనస్సులోని సచేతన విభాగం పది ఇంద్రియాలను, అవయవాలను క్రియాశీలం చేస్తుంది. శరీరానికీ మనస్సుకూ విడదీయరాని సంబంధం ఉంది. మనస్సు గతి తప్పితే శరీరం రోగగ్రస్తం అవుతుంది.

ఇంతవరకూ జలుబుకు సరైన మందు కనుగొనబడలేదు. జలుబుకు కూడ వైరస్ క్రిములు ఉంటాయి. అయితే వాటి స్వభావం ఇతర క్రిములకన్నా భిన్నంగా ఉంటుంది. మశూచి రోగం ఒకసారి వస్తే శరీరంలో ఆ రోగంతో పోరాడే శక్తి జనిస్తుంది. కనుక మరోసారి ఆ రోగం వచ్చే ప్రమాదం ఉండదు. కానీ, జలుబు విషయం అలా కాదు. అది మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటుంది. ఒకసారి ఒక మందు వాడితే నయం కాదు.

కెనడాకు చెందిన జీవశాస్త్ర నిపుణుడు, మనస్తత్వ నిపుణుడు డా॥ డేనియల్ కోసాన్ జలుబు గురించి ఇలా చెప్పారు- జలుబు శారీరిక రోగం కన్నా హెచ్చుగా మానసిక రోగం. ఓడిపోయిన మనిషి తన వైఫల్యాలను మరింత స్పష్టంగా గుర్తిస్తాడు. దానినుండి బయటపడడానికి క్షీణించిన మనోబలం జలుబును ఆహ్వానిస్తుంది. తన ఓటమిని కప్పిపుచ్చుకోవడానికి. వాస్తవానికి ఈ రోగం అంతా మనస్సు ఇచ్చే దానం. జలుబు అనే ఆపద దురదృష్టంవల్ల వచ్చిపడి, తాను ఓడిపోయాడు, తనలో కార్యశూరత, యోగ్యత తగ్గలేదు- అని అనుకోవడంవల్ల అతడికి కొంత ఓదార్పు లభిస్తుంది. ఓదార్పు కోసమే అంతశ్చేతన జలుబును కలిగిస్తుంది.

డా॥కోసాన్ తన అభిప్రాయాన్ని బలపరచడానికై ఎన్నెన్నో ప్రమాణాలు చూపాడు. క్రీడాకారులు పోటీ సమయంలో, విద్యార్థులు పరీక్షల సమయంలో, అభ్యర్థులు ఎన్నికల సమయంలో తరచు జలుబుతో బాధపడుతూ ఉంటారు. ఇలా బాధపడేవారిలో హెచ్చుమందికి తమ విజయం అనుమానాస్పదంగా కనిపిస్తుంది. ఓటమి అనే భయానక దృశ్యం వారి మనస్సులను బలహీనపరుస్తుంది.

చలివల్లా, విషక్రిములవల్లా జలుబు వస్తుందని చెపుతారు. అది ఆధారంగా వైద్యం చేస్తారు. అయితే అంతమాత్రాన రోగం మొదలంటా నిర్మూలం కాదు. ఎందుకంటే, జలుబు ఒక మానసిక రోగం.

పెక్కు రోగాలకు మూలం మానసిక వికృతులని నేడు తేలుతోంది. శరీరంలోని లోపలి అవయవాలు దెబ్బతినడంవల్ల కలిగే బాధలను తేలికగా తొలగించవచ్చు. శరీరం తనకుతానుగా వాటిని బయటికి నెట్టుతుంది. కానీ, అసాధ్య రోగాలలో చాలా భాగం మనో వికారాల ఫలితాలే. హిస్టీరియా రోగాన్నే తీసుకోండి. హిస్టీరియా 'ఫిట్' వచ్చిన వ్యక్తి శరీరం మెలికలు తిరిగిపోయి, చూచేవాళ్లకు గాబరా పుట్టిస్తుంది. భద్రతకు తగు ఏర్పాటు లేని సందర్భాలలో 'ఫిట్' వస్తే ప్రమాదం జరగవచ్చు కూడా. రోడ్డు ప్రమాదంలో గాయపడడం, మంట దగ్గర ఉన్నపుడు శరీరం కాలిపోయి ప్రాణం పోవడం జరగవచ్చు. మెదడు మొద్దుబారడం వల్ల బుద్ధి మందగిస్తుంది. కార్యకుశలత క్షీణిస్తుంది. హిస్టీరియాకూ, ఆర్గానిక్ ఎపిలెప్సీకీ తేడా ఉంది. అయితే వీటి లక్షణాలు ఒకేవిధంగా ఉంటాయి. 'ఫిట్' తర్వాత స్పృహ వచ్చినపుడు ఎన్నో రోజులు జబ్బుపడినంత నీరసం వస్తుంది.

అచేతన మనస్సులోని ఒక గ్రంథిలో అవరోధం ఏర్పడడంవల్ల హిస్టీరియా వ్యాధి వస్తుందని పరిశోధనల ద్వారా కనుగొన్నారు.

మానసిక వికారం ఎన్నెన్నో రోగాలకు దారితీస్తుంది. అమెరికాలోని ప్రముఖ మానసికవైద్య నిపుణుడు డా॥ రాబర్ట్ డి.రామ్ విస్తృతంగా సర్వేలు జరిపి, వాటి ఫలితాలను ఇలా పేర్కొన్నారు-కేన్సరు, గుండె జబ్బు, క్షయ వంటి జబ్బులు రావడంలో మానసిక వికృతులు కూడా ప్రముఖ పాత్ర వహిస్తాయి. మానసిక వికృతులవల్ల పీడించబడే వ్యక్తులు

**ప్రతి వైఫల్యం భావి సాఫల్యానికి మెట్టు.**

చాలామంది ఉన్నారు. వీరిలో మూడవవంతు వ్యక్తులు మాత్రమే చికిత్సకోసం వస్తారు. మిగిలిన వారికి తమకు అలాంటి జబ్బు ఉన్నదని తెలియదు. అలాంటి అస్తవ్యస్త స్థితిలోనే తాము బాధపడుతూ ఇతరులను బాధపెడుతూ బ్రతుకు వెళ్లదీస్తారు.

జీన్ మైనోల్ తన "ది ఫిలాసఫీ ఆఫ్ లాంగ్ లైఫ్" గ్రంథంలో ఇలా వ్రాశాడు - మనిషి అర్ధాయుష్షుగా చనిపోవడానికి ఒక ప్రముఖ కారణం మరణ భయం. ముసలితనం రాగానే, చిన్న చిన్న జబ్బులు రాగానే చనిపోతామని భయపడతారు. ఈ భయం మెదడు పై పొరలలోకి ప్రవేశిస్తుంది. ఫలితంగా హెచ్చు సమయం జీవించడం కష్టమవుతుంది. ఆ భయం మృత్యువుని దగ్గరకు లాగుకొనివస్తుంది.

కొన్ని శతాబ్దాల క్రితం అరబ్ దేశాలలో హకీమ్ ఇబ్నెసీన అనే వైద్యుడు పేరు ప్రఖ్యాతులు పొందాడు. 'కానూన్' అనే గ్రంథంలో ఆయన వైద్యంలో తన అనుభవాలను వర్ణించాడు. ఫలానా మానసిక వికృతివల్ల ఫలానా తరహా రోగం వస్తుందని ఆయన ఆ గ్రంథంలో పేర్కొన్నాడు. చికిత్సలో ఆయన మందులు ఇవ్వడానికి బదులు రోగి మనఃస్థితిని మార్చే చర్యలు తీసుకున్నాడు. అసాధ్య రోగాలుగా పరిగణించబడిన రోగాలు ఆ చర్యలవల్ల నయమయినాయి.

వాస్తవానికి మన ఆంతరిక చైతన్యం, ఆలోచన, భావనల స్థాయికి అనుగుణంగా మన మనస్సు, మెదడు, నాడీ మండలం, అవయవాల కార్యపద్ధతి నిర్మాణం అవుతూ ఉంటాయి. వానికి అనుగుణంగా అవి పనిచేస్తూ ఉంటాయి. ఆంతరిక ఉద్వేగపు వేడి మొత్తం వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఫలితంగా జీవనతత్వం సహజమైన తన కోమలత్వాన్నీ, సారళ్యాన్నీ కోల్పోతుంది. మానసిక వికృతి ఇలాంటి వేడిని లోలోపల రగిలించి ఉంచుతుంది. ఫలితంగా ఆరోగ్యాన్ని రక్షించే తత్వాలు నశించిపోతూ ఉంటాయి. ఇంద్రియ భోగముల కాంక్ష, కూడబెట్టాలనే కోర్కె, సంపదకు యజమాని కావాలనే లాలస - ఇవన్నీ వాసనలు, తృష్ణలు, ఎన్నడూ చల్లారని ఈ అగ్నిశిఖలు. మనిషిలోని మనశ్శాంతినీ, సమతౌల్యాన్నీ ఇవి దహించివేస్తాయి.

చింత, భయం, క్రోధం, అసంతృప్తి, నిరాశ, అసూయ, ద్వేషం, ప్రతీకారం, కాపట్యం, మాత్సర్యం మున్నగు దుష్టప్రవృత్తులు మనిషిపై పెత్తనం చెలాయిస్తే అతడి అంతఃకరణం నిరంతరం ఉద్విగ్నంగా ఉంటుంది. అతడి మనస్సులో సంతృప్తి, సంతోషం ఏమాత్రం ఉండవు. ఆ ఉద్విగ్నత అతడి అంతరాంతరాలను విపరీతమైన ఆటుపోటులకు గురిచేస్తుంది. అతడి అంతరంగాన్ని విపరీతంగా మథిస్తుంది. అలాంటి విషమస్థితిలో చిక్కుకున్న వ్యక్తి ఆరోగ్యం దెబ్బతినడం ఖాయం. అనవసరమైన ఈ వేడిని జనింపజేసే ఆ మనో వికారాలనుండి, విక్షేపాలనుండి మనిషి బయటపడడం అన్నివిధాలా మంచిది. శాంతి, సమతౌల్యం, సంతృప్తి, నవ్వుతూ నవ్విస్తూ ఉండే ధోరణి నిండిన జీవన సరళిని అవలంబించడం శ్రేయస్కరం.

☆☆☆

## ధర్మదేవత దయ

18వ శతాబ్దంలో గుజరాత్‌లో భయంకరమైన క్షామం ఏర్పడింది. నాల్గుదిక్కులా హాహాకారాలు వ్యాపించాయి. మానవులు పశుపక్ష్యాదులు కూడా ఆకలితో అలమటించి, మరణించటం గుజరాత్ ప్రభువు చూడలేకపోయాడు. ఈ విపత్తు నుండి కాపాడమని సాధుసత్పురుషుల్ని ఆహ్వానించి యాజ్ఞానుష్ఠానం చేయమని ప్రార్థించాడు. ఆయనకూడా స్వయంగా అనేక యజ్ఞాలు చేశాడు. కానీ బొట్టు వర్షం పడలేదు. ప్రజల బాధల్ని చూడలేక రాజు వ్యాకులుడై, కన్నీళ్లతో దైవాన్ని ప్రార్థించసాగేడు.

ఒకరోజు హఠాత్తుగా ఒక సన్యాసి ప్రత్యక్షమై "రాజా! నీ రాజ్యంలో బోలెడు మంది వ్యాపారస్థులున్నారు. వారు తలచుకొంటే వర్షం కురుస్తుంది" అని పలికాడు. రాజు తక్షణం వ్యాపారస్థుల ఇళ్లకు వెళ్లి వర్షం కురిసే ఏర్పాట్లు చేయమని ప్రార్థించాడు. వారు రాజు వినయానికి, వేదనకు ద్రవించి ప్రయత్నిస్తామని రాజుకు మాట ఇచ్చారు. తక్షణం తమ త్రాసు, తక్కెడలను చేత ధరించి ఆకాశం వంక చూస్తూ "ఓ ఇంద్రదేవా! మేము వీటితో ఏనాడూ ఎక్కువ తక్కువలు తూచి, ప్రజలను మోసగించలేదు. నిజాయితీతో మా వైశ్యధర్మాన్ని నిర్వర్తించామని నీకు నివేదిస్తున్నాము. కాబట్టి మా ధర్మానికి ప్రసన్నుడవై వర్షాన్ని ప్రసాదించు" మని ప్రార్థించారు. మరుక్షణం ఆకాశం మేఘావృతమైంది. బ్రహ్మాండమైన వర్షం కురిసింది. ఎక్కడ చూచినా నీరు. ప్రజలు ఆనందపులకితులై హర్షధ్వానాలు చేశారు. వైశ్యులచే పూజింపబడే ధర్మదేవత అనుగ్రహం ఈ విధంగా కాలపు అవసరాన్ని తీరుస్తూ ఉంటుంది.

– ప్రజ్ఞాపురాణం నుండి

**సాధనలో సాఫల్యానికి కీలకం నియమపాలన.**

## వ్యక్తి నిర్మాణం

# వ్యక్తిత్వం ఎదగాలంటే.....

మనుష్యుడు తన విలువ తనకు తెలియక ఇతరులను తన గురించి అడుగుతూ ఉంటాడు. ఇతరుల అభిప్రాయం తెలుసుకోవాలనుకుంటాడు. ఇతరులు ప్రశంసిస్తే బాగు అన్పిస్తుంది. దీని అర్థమేమిటంటే తన గురించి తనకంటూ అభిప్రాయం లేదు, తనకంటూ విలువ లేదు. ఇతరులు అతని విషయంలో వినికిడిపై ఆధారపడి అభిప్రాయాలు పెంచుకుంటారు. అది అంత సరియైనది, ప్రాముఖ్యమైనది కాదు. ఎవరో తొందరలో చెప్పిన దానిని సరియైనదని సంతోషపడుట లేదా దుఃఖపడుట, దానికి విలువ ఇచ్చుట సరియైనది కాదు.

**నీగురించి నీవు తెలుసుకో**

దానిని సరియైనది, విలువైనదిగా భావించాలి. ఒక వేళ మనం మంచివాళ్లమైతే, నిజాయితీపరులమైతే, సరియైన దారిలో నడుస్తూ ఉంటే ఎవరో అజ్ఞాత వ్యక్తి లేదా ఇతరులు అవగాహనా లోపంతో చేసిన నిందకు బాధపడుటలో అర్థము లేదు. అదేవిధంగా ఒకవేళ మనం చెడ్డవారమైతే, దురాలోచనతో నిండి ఉంటే, ఎవరో పనికిమాలిన వాళ్లు భట్రాజుల వంటి వారు ఎంత ప్రశంసించినా దానికి విలువ ఏమిటి? అటువంటి ప్రశంసలు దుమ్ము - ధూళి విలువ కూడా చేయవు. ఎవరైనా భ్రమలో మన వాస్తవికత తెలుసుకోలేకపోతే, ఏదో దురుద్దేశ్యంతో సిరాను తెల్లగా ఉందని చెప్పే ధూర్తత్వం చేస్తే అటువంటివారి ప్రశంసలకు విలువ ఏముంది? వాస్తవం తెలుసుకోకుండానే వారు తమ ఇచ్ఛవచ్చినట్లు భావిస్తే, అంటూ ఉంటే మనం ఏమి చేయగలం? స్వయంగా విలువైన వ్యక్తి మాటలకే విలువ ఉంటుంది. వందమంది మూర్ఖుల ప్రశంస కంటే ఒక వివేకవంతుడి విమర్శ మంచిది. ఎందుకంటే అతడు లోతుగా తరచి చూసి తన అభిప్రాయం చెప్తుతాడు. వందమంది మూర్ఖుల నిందను నిర్లక్ష్యం చేసి, వివేకవంతుడి ప్రశంసలకు విలువ ఇవ్వాలి. వాస్తవికతను తెలుసుకొని న్యాయము, సత్యమును గుర్తుంచుకొని ఏదైనా నిష్కర్షకు రావాలి. ఇటువంటివారు ప్రపంచంలో ఎంతమంది ఉంటారు? విరోధం ఎందుకు తెచ్చుకోవాలి అనే పిరికితనము, భయంతో నిజం చెప్పటానికి భయపడతారు. చెడును చెడు అని చెప్పటానికి తయారు కాలేరు. కానీ అసమర్థ వ్యక్తిని ఎవరైనా ఎగతాళి చేస్తారు, మూర్ఖుణ్ణి చేస్తారు. ఒక వేళ ఆ అసఫలత అతని పొరపాటువలన కాక, పరిస్థితుల వలన ఉత్పన్నమై ఉండవచ్చు. లేదా ప్రజల నిందించే స్వభావం వలన అయి ఉండవచ్చు. దాన్ని అబద్ధమని చెప్పేవాళ్లు తక్కువ. తమ పని చక్కపెట్టుకోవటానికి ప్రజలు నిజాన్ని అబద్ధమని, అబద్ధాన్ని నిజమని చెప్పటానికి వెనుకాడరు. అటువంటి బలహీనులు ఎక్కువగా ఉన్నప్పుడు ఎవరి అభిప్రాయానికైనా ఎంత విలువ ఉంటుంది? మనం ఇతరుల నోటి నుండి మన ప్రశంస వినటానికి ఆత్రత పడకూడదు. అలాగే ఇతరుల నిందకు దుఃఖపడకూడదు. మనను గురించి మనకు తెలిసినంత ఇతరులకు ఎలా తెలుస్తుంది. మనం చేసిన మంచి - చెడుల గురించి మనకే తెలుస్తుంది. ఒకరి గురించి పూర్తిగా తెలుసుకునే సమయం మరొకరికి ఎక్కడ ఉన్నది? తన గురించి పూర్తిగా మరొకరికి తెలిపేందుకు ఎవరు బుర్ర బద్దలుకొట్టుకుంటారు? ఒక వేళ చెడుగా అనిపించే విషయం మంచి ఉద్దేశ్యంతో చేసి ఉంటే దానిని ఇతరులు సరిగ్గా అంచనా వేయుట సాధ్యం కాదు. వారి మాటలకు విలువ ఎందుకు ఇవ్వాలి?

ప్రపంచం సగం సగం సమాచారంతో తన అభిప్రాయాలు ఏర్పరుచుకుంటుంది అని తెలుసుకొని మనం నడవాలి. కనీసం తెలిసినంతవరకైనా చెప్పే సాహసం ఎంతమందికి ఉంది? ఈ వాస్తవాలను దృష్టిలో పెట్టుకొని ఇతరుల నిందా స్తుతులను వినాలనే కోరికను పసితనంగా భావించి, దాని నుండి మనస్సును మళ్లించుకోవాలి. మనం స్వయంగా ఏమిటనేది మన కళ్లతో చూడటానికి ప్రయత్నించాలి. ఆత్మ అనే న్యాయ స్థానంలో న్యాయమనే తరాజులో తూచాలి. మనసెక్కడ చెడువైపు మొగ్గినా, మంచివైపు మొగ్గినా గీటురాయిపై మనం నిక్కచ్చి అని తేలితే, నిలకడలేని మనుష్యులు చెప్పదలచుకొన్నదేదో చెప్పనివ్వండి. మనం దీనిని ఏ మాత్రం లెక్కచేయకూడదు. కానీ మన ఆత్మ ఎదుట చెల్లని నాణాలమైతే, సమస్త ప్రపంచం మనలను ప్రశంసించినా మనం సంతోషించకూడదు.

మనలను తెలుసుకోవటానికి, బాగు చేసుకోవటానికి ప్రయత్నించాలి. ఎక్కువ మంది జనులు ఇతరుల లోటుపాట్లు, తప్పులు తొందరగా పట్టుకుంటారు, చిన్నదానిని పెద్దగా చెప్పి ఆనందిస్తారు. తమను తాము పరీక్షించుకొనేందుకు అరుదుగా

**శీలం శంకించబడడాన్ని మించిన పరాజయం లేదు.**

సిద్ధపడతారు. మన తప్పులు పొరపాట్లు వెదికి వాటిని అంగీకరించుట అనేది చాలా ధైర్యవంతమైన పని. మన మనసు సహజంగా పక్షపాతం వహించుట వలన తప్పు తప్పుగా కన్పించదు. పక్షపాతియైన మనస్సు ఎల్లప్పుడూ తనను నిర్దోషిగా భావిస్తుంది. తాను చేసే తప్పులకు కారణం ఇతరుల మీద నెడుతుంది. ఇటువంటి పక్షపాతియైన మనస్సు ఉండగా ఎవరైనా తమ తప్పులు తాము తెలుసుకోగలరా? ఏదైతే తెలుసుకోలేమో దానిని సరిచేసేదెట్లా? తనను తాను రోజురోజుకు మెరుగుపరుచుకుంటూ, భావన, క్రియ రెండింటి విషయంలో, ఆత్మ సంతోషము, ఆంతరంగిక ఉల్లాసము పొందే స్థాయికి ఎదగటమే వాస్తవికమైన ప్రశంస పొందుటకు సరియైన మార్గము. సమస్త ప్రపంచము నోటితో గానం చేసే ప్రశంస కంటే తన దృష్టిలో తాను ప్రశంసిచబడుట ఎక్కు ఉత్తమం.

### ఆలోచనల ప్రచండ శక్తి

మనుష్యుని లోపలి శక్తులలో ఆలోచనల శక్తి మహత్తరమైనది. ఈ శక్తి మనుష్యునిలో నవజీవనాన్ని, నిరంతర ప్రేరణను సంచరింపచేస్తుంది. అభిప్రాయాలు లేని మనుష్యుడు మృతునితో సమానం. అతని చైతన్యం అంతమైపోతుంది. అభిప్రాయాలే మనుష్యుని ప్రాణము, జీవన శక్తి. అభిప్రాయాలతో మనుష్యుని వ్యక్తిత్వం రూపుదిద్దుకొంటుంది.

### పరిష్కృత అభిప్రాయాల మహిమ

ఎందరు మనుష్యులు మహోన్నతి పొందారో వారందరి మనస్సులలో ఉన్నతాదర్శాల వైపు పురోగమించాలనే పట్టుదల ఉన్నది. వారు సమాజంలో శ్రేష్ఠ ఆదర్శాలను నెలకొల్పుటకు తమ ఆలోచనలను ఏకం చేసి ఒకే దిశలో వినియోగించారు, సాఫల్యం చేజింక్కించు కున్నారు. మనం కూడా గొప్పవారి జీవిత కథలు చదవాలి. జ్ఞానార్జన ద్వారా ఆలోచనలను పరిష్కరించుకోవాలి. పరిష్కరించబడిన ఆలోచనలలో జీవితాన్ని మార్చివేసే అమోఘశక్తి సూక్ష్మరూపంలో దాగి ఉన్నది.

ఆలోచనల పరివర్తనతో మనుష్యుడు లఘువునుండి విభుడు అవుతాడు. ఆలోచనలలో చాలా చమత్కారము ఉన్నది. అవి మనలను పైకి లేపుతాయి లేదా క్రిందకు పడవేస్తాయి. దుఃఖము నిరాశల ఘాతుక ఆలోచనలను మనస్సులోనికి చొరబడనివ్వవద్దు. కేవలము హితకరమైన ఆలోచనలనే మనస్సులో ఉంచుకొనండి. ఆశాజనక ఆలోచనలకు అద్భుతశక్తి ఉన్నది. మీకు ఉజ్జ్వల భవిష్యత్తు కలుగుతుందని ఆలోచించండి. చూడండి, సంతోషపు వాతావరణం ఉరకలెత్తుతూ వస్తుంది. జీవితంలోని ప్రతి రంగంలో దాని విలక్షణ ప్రభావం పడుతుంది. మీరు మిమ్ములను సమీక్షించుకొనుట నేర్చుకొనండి. మీ తప్పులను తెలుసుకోండి, అంగీకరించండి. మిమ్ము బాగుచేసుకొనుటకు మీ అలవాట్లతో పోరాడండి, వాటిని తొలగించుటకు తర్వాత అడుగు ముందుకు వేయండి. ఈ మాత్రం ధైర్యం తెచ్చుకొంటే నెమ్మది నెమ్మదిగా సంస్కారపు బాటలో నడుస్తూ, ఒక రోజుకు ఎంత బుద్ధిమంతులవుతారంటే మిమ్మల్ని మీరు నిండుగా ప్రశంసించుకోగలరు. ఈ ప్రశంస నిజమైన ప్రశంస అనవచ్చు, దానితో అంతఃకరణలో శాంతి, సంతోషము అనుభవమవుతాయి. ఈ విధంగా ప్రశంసించేందుకు బయట మనిషి ఒక్కరూ ముందుకు రాకపోయినా, సమస్త ప్రపంచం మిమ్ము ప్రశంసిస్తున్నట్లు అనుభవమవుతుంది.

ఇతరుల కళ్లలో దుమ్ము చల్లి తాము చెడ్డవారైనా మంచివారనే ముద్ర వేయించుకోవడం తెలివి అని అనిపించుకోవచ్చు. ఈ రోజుల్లో జనులు ఇదే చేస్తున్నారు. అబద్ధము, మోసపు విషయాలు పుకార్ల రూపంలోఎంతగా వ్యాపిస్తాయంటే జనులు మోసపోతారు. చెడును మంచి అంటూ ఉంటారు. ఇటువంటి నిలకడలేని మనుషుల నిలకడ లేని మాటలు విని కొద్దిసేపు ఆనందించవచ్చు. కాని దీనితో శాంతి మాత్రం ఎన్నటికీ లభించదు. ఆత్మకు అసలు సంగతి తెలుసు. అది ధిక్కరిస్తూ ఉంటుంది.

మన సంతోషం - దుఃఖం అమ్మబడకూడదు. ఎవరైనా ప్రశంసిస్తే మనం ప్రసన్నులు కావటం, నిందిస్తుంటే దుఃఖించుట- ఇది పూర్తిగా పరాధీనత. మన దృష్టిలో నీచమని అన్పించే పనులు, నిందించబడే పనులు మనం చేయకుండా జాగ్రత్త వహించాలి. ప్రశంసించబడాలని కోరుకుంటే ప్రశంసించదగిన పనులు చేయాలి.

### ఆలోచనల అపారశక్తి

మనిషి ఆలోచనలలో సుఖ దుఃఖాలు, స్వర్గ నరకాలు, మంచి చెడు అన్నీ దాగి ఉన్నాయి. ఎటువైపు ఆలోచనలు మళ్లిస్తే మన చుట్టుప్రక్కల అటువంటి వాతావరణమే కన్పించుట ఉన్నది. మన లోపలి సుఖ శాంతులే ప్రపంచంలోని సుఖ శాంతుల రూపంలో ప్రత్యక్షమవుతాయి. ఒకవేళ ప్రపంచంలో అశాంతి దుఃఖము కనిపిస్తూ ఉంటే దానికి కారణము మన మనస్సు అశాంతి దుఃఖపు ఆలోచనలకు ఆలవాలము కావటమే. సుఖ దుఃఖాలు మరేమీ కాదు. మన లోపల లేచిపడే ఆలోచనల ప్రతిక్రియా ఫలితమే. ఆకుపచ్చని కళ్లద్దాలు ధరిస్తే మనకు అంతా ఆకుపచ్చగా కనపడిన విధంగా వ్యక్తిలోపలి ఆలోచనల

**స్వాధ్యాయం, సత్సంగం మానసిక క్షాళనకు మార్గాలు.**

బాహుళ్యమే అన్ని చోట్లా ప్రత్యక్షమవుతుంది.

### ఆలోచనల దృఢత్వం

దృశ్యాదృశ్యముల జ్ఞానము ఆలోచనల వలననే కలుగుతుంది. ప్రపంచంలోని మంచి - చెడు అన్నీ ఆలోచనల పరిణామములే. ప్రపంచంలో వాస్తవిక జ్ఞానము సృష్టించుటకు శ్రేష్ఠమైన ఆలోచనలు మానవ మస్తిష్కములో తలెత్తుతూ ఉంటాయి. ఆలోచనలే మనుష్యుని జీవిత దిశను మార్చుతాయా? అనేది ప్రశ్న. అవును. ఉన్నత లక్ష్యము కొరకు ఉత్పన్నమైన, స్థిరము దృఢమైన ఆలోచనలలో అనుపమానమైన శక్తి ఉంటుంది. వాటివలననే కొత్త స్ఫూర్తి, కొత్త మార్గము లభిస్తాయి.

### ఆలోచనల శ్రేష్ఠత

ఒక వ్యక్తి తన ఆలోచనలతో కొన్ని వేల, లక్షల వ్యక్తులకు మార్గదర్శకుడై ఆలోచనా సంపద చేత గొప్ప ఉన్నత వ్యక్తియై ప్రగతిని సాధించుచున్నాడు. వ్యావహారిక జీవితంలో మనిషికి ధనము అవసరమని భావించుచున్నాడు. కాని మనిషి చెడు ఆలోచన వలన సుఖమును పొందలేడు. మనిషి సుఖమును శాంతిని పొందగోరినచో ఆలోచనాశక్తిని సంపాదించవలసి ఉన్నది. కాని శాంతి, సుఖము ప్రపంచములో ఏ వస్తువులోను, ఏ వ్యక్తిలోనూ లేవు. దాని నివాసము మనిషి అంతఃకరణలోనే గలదు. ఆస్థిపాస్తుల వలన కొద్ది కాలమే సుఖము పొందగలవు. మనము శ్రేష్ఠ ఆలోచనా శక్తిని గ్రహించవలసి ఉన్నది. మంచి అలవాటును పొందవలసి ఉన్నది. అదియే పరమానందము.

### ఆలోచన-వ్యక్తిత్వం

వ్యక్తి మూస వలె తన వ్యక్తిత్వముతో పలు విధములుగా అభివృద్ధి పొందుచున్నాడు. వ్యక్తి యొక్క వ్యక్తిత్వము అతని ఆలోచన వలన తెలియుచున్నది. మనిషి మనస్సులో మంచి - చెడు ఆలోచనలు గలవు. మనిషి నిరాశ, అంధకారపూరితమైన ఆలోచనలో చిక్కుకొనిన యెడల అతని సుఖము, శాంతి అందులో విలీనమగును. అతనికి ప్రపంచము నరకమగును. మనిషి తన చెడు ఆలోచనలను త్యాగము చేయుట వలనను, మంచి ఆలోచనలను గ్రహించుట వలనను అతడి జీవితము ఉత్కృష్టమైన స్థాయిని పొందగలదు.

మనిషి తన ఆదర్శ జీవితము వలన నిజమైన జీవితమును పొందగలడు. మనిషి ఉన్నతమైన జీవితము పొందుటకు ఆదర్శమైన ఆలోచనలను గ్రహించవలెను. మనిషి అంతఃహృదయములో ఆలోచన అనెడి పవిత్ర జ్యోతి అతనికి ఆలోచనా మార్గమును చూపును. ఎందుకనగా వ్యక్తి మనస్సులో అనేక ఆలోచనలు చెలరేగి సతమతమగుచుండును. ఆదర్శమైన ఆలోచన మనిషిని శక్తివంతుడుగా తయారు చేయును. మనిషి జీవిత దిశ మారిన యెడల అతడు పవిత్రతను పొందగలడు.

### ఆలోచనల సద్వినియోగం

మనిషి ఆదర్శమైన ఆలోచనలను చేరుకొనువరకు తన ప్రయత్నములోనే ఉండవలెను. మనిషి తన లక్ష్యసాధన కొరకు తన మనస్సును కర్మకు సమన్వయము చేయుచు పురోభివృద్ధి పొందవలెను. అప్పుడే మంచి ఫలితము లభించగలదు.

మనిషి ప్రత్యేకమైన కార్యాచరణ, ఆలోచన వలన ముందుకు సాగగలడు. విమానము ఆకాశ మార్గములో ఎగురుచున్నది. ఆ విషయము టెలిస్కోపు సాధనము ద్వారా తెలియుచున్నది. ఆ విమానము ఏ దిశలో పోవుచున్నది, ఎన్ని వేల మైళ్ల దూరము పోవుచున్నది తెలియుచున్నది. మనిషి ఇంగిత జ్ఞానము ద్వారా దానిని నడుపుచున్నాడు. పరమాత్ముడు మనిషికి ఇంగితజ్ఞానమును, ఆలోచనా సంపదను ఇచ్చి పంపించి ఉన్నాడు. మనిషికి ఆలోచన లేని యెడల అతడు ఎలుగుబంటు, కోతివలె తిరుగుచు ఉండెడివాడు. ప్రస్తుతము ప్రపంచములో అందమైన, సుందరమైన ప్రకృతి ఏదైతే మనకు గోచరించుచున్నదో, అది మానవుని ఆలోచనల సమూహాముగా హద్దులేనిది, తూచుటకు, అంచనా వేయుటకు వీలులేనిది.

మానవునికి ఏ దిశ నుండి ఆలోచన లభించుచున్నదో, ఆ దిశలో ఉన్నత మార్గమును పొందుచున్నాడు. మంచి మార్గము ప్రశంస పొందుచున్నది. ఆ ఆలోచనలలో ద్వేషము, శత్రుత్వము నిరాశ కలిగిన యెడల ఆలోచనా శక్తి వ్యర్థమగును. దానివలన మానవుడు హితమును కోల్పోయి నష్టమును పొందును.

### పశుప్రాయుడవు కావద్దు

మానవుని పశు - పక్షులతో పోలుస్తూ శాస్త్రకారులు ఈ విధంగా వ్రాసిరి. "జ్ఞానం హి తేషామధికో విశేషః."

అనగా ఆహార విహారములు,భయము, నిద్ర, కామము కోరికల దృష్టితో పరిశీలించిన మానవునికి, పశుపక్షులకు తేడా ఏమియు కనిపించదు. కాని శరీర నిర్మాణంలో మాత్రమే భేదము గోచరించును. తినుట, త్రాగుట, నడుచుట, లేచుట, కూర్చొనుట మలమూత్రములను విసర్జించుట ఒకే విధముగా ఉండును. కాని మనిషిలో కొన్ని ప్రత్యేకమైన లక్షణములు గలవు. మానవుడు వాతావరణము, రుచి, అభిరుచి, జ్ఞానము, భాష, భావము మొదలగు ప్రత్యేక గుణములతో వశము

**ఆలోచన అనే వెలుగు ఆరిపోతే ఆచరణ గ్రుడ్డిది అవుతుంది.**

తప్పుచున్నాడు. కారణము సృష్టిలో మానవుడు శ్రేష్ఠప్రాణి యగుటయే. తన ఆలోచన మరియొక దాని మీద ఆధారపడి ఉంటుంది. ఇందుకు ప్రత్యేక కారణము మానవుని జ్ఞానమే. సాధారణముగా పశు - పక్షులు కూడా జీవిస్తున్నవి. ఆనందాన్ని అనుభవిస్తున్నవి.కాని వానికి ఆలోచనంటూ లేదు. వానికా పని అంతఃప్రేరణ వలన జరుగుచున్నది. పశు - పక్షుల జీవితములో ఒడిదుడుకులు కనిపిస్తూ ఉంటాయి. కారణము వాటికి ఆలోచనా పరిజ్ఞానము లేకపోవుటయే.

### ఆలోచన మహిమ

మానవుడు ప్రత్యేకముగా తన ఆలోచనా సరళితోనే ప్రేరేపించబడుచున్నాడు.విశాలమైన ప్రకృతి యొక్క సృష్టిని మానవుడు ఉచిత అనుచిత రీతిలో వ్యవస్థీకరించి యున్నాడు. మానవుని ఆలోచనా శక్తి ప్రకృతి నిర్మాణమున కుపయోగపడినది. మనుష్యులు తినుట, త్రాగుట ఆనందములను అనుభవించే విషయములకు పరిమితమై, అదియే తమ జీవిత పరమార్థమని భావించుచున్నారు. ఆ పనులన్నియు మానవేతర ప్రాణులు చేయగలుగుచున్నవి.

### ఆలోచనలోని బలం

ప్రపంచములో ఆలోచనా శక్తి సర్వశ్రేష్ఠమైనదిగా పరిగణింపబడుచున్నది. పశువులు ఆలోచన లేని జీవులు. అందువలన అవి పరస్పర సహకారమును పొందలేవు. మానవుని వలె వానికి లిపికాని, భాష కాని లేదు గదా! అందువలన అవి ఐకమత్యముతో సంఘటితమై అత్యాచారములను ఎలా ఖండించగలవు? వాని శారీరిక పరిమితుల వలన అవి జీవన సాధనలో హద్దును దాటలేకున్నవి.

ఈ భూమి హద్దు లేనిదై ఎత్తు పల్లములతో కూడి యున్నది. దీనిని క్రమబద్ధము చేయునది మానవుని ఆలోచనా శక్తియే. మానవుడు తన చాకచక్యంతో ఈ భూమిని దేశముగానో, పట్టణముగానో, గ్రామముగానో లేక గృహముగానో దర్శించగలుగుతున్నాడు. మనిషి తన కోరికలను, బాధలను ఇతరులకు తన లిపిద్వారా, భాష ద్వారా, సాహిత్యము ద్వారా తెలియపరచగలడు. ప్రస్తుత కాలములో ఆధ్యాత్మిక అభివ్యక్తి, కుటుంబానందములు పొందుటకు కళా కౌశలము, లేఖనము, అచ్చు మున్నగు సాధనములు లభించుచున్నవి. ఇవన్నియు మనిషి ఆలోచనా శక్తి వల్లనే లభించుచున్నవి. మనిషి విజ్ఞానము సాధింపలేని యెడల ఎలుగుబంటు, కోతులవలె అడవులలో తిరుగుచూ ఉండెడివాడు. సృష్టికి సౌందర్యము ప్రాప్తించినది. ఈ భూమి అందమైన ప్రకృతితో నాట్యమాడుచున్నది. అది మానవుని ఆలోచనా శక్తి ఫలితమే. ఆలోచనాశక్తి ఉపయోగము అనంతము.

☆☆☆

## సోమరికి శాస్తి

సాంసారిక సుఖదుఃఖాలు, రోగాలు, శోకాలు, ఇవన్నీ సోమరులకు, పనులు ఎగవేసేవారికి మాత్రమే ఎదురవుతూ ఉంటాయి. అలాంటపుడు వీరికి నిందలు, అవమానాలు లభిస్తే ఆశ్చర్యం దేనికి? సహజం కదా!

ఇద్దరు సోమరులు ఎప్పుడూ ఇతరులను సహాయం కోరుదామని ఎదురుచూస్తూ ఒక తోటలో పడిఉండేవారు. ఒకరోజు ఒక వ్యక్తి గుర్రపు సవారీ చేస్తూ అటు రాగా ఒక సోమరి అతడిని దగ్గరకు పిలిచి, "సోదరా! పైన చెట్టునుండి ఒక మామిడి పండు రాలి నా ఛాతీమీద ఉన్నది. తీసి దానిని నా నోటి దగ్గర పెట్టి పుణ్యం కట్టుకో"మని ప్రాధేపడ్డాడు. ఆ మాటలకు వ్యక్తి మండిపడి ఇంతటి బద్ధకస్తుల్ని ఏమి చేసినా పాపంలేదని భావించి నాల్గు దెబ్బలు తగిలిస్తాడు. ప్రక్కనే పడి ఉన్న రెండవ సోమరి అతన్ని పిలిచి "సోదరా! నా బదులు కూడా మరో నాల్గు దెబ్బలు వాడికి తగిలించు. ఎందుకంటే నా చిన్న పని చేసిపెట్టడానికి పిలిచినా రాడు" అని ఫిర్యాదు చేశాడు. ఆ పనేదో నాకు చెప్పండి చేస్తానన్నాడు గుర్రం మీద వ్యక్తి. "అది నిన్నటి మాటలే. ఒక కుక్క నా మూతి నాకుతోంది. వచ్చి కాస్త కుక్కను తరిమివేయమని ఎంతగానో పిలిచాను. కానీ రాలేదు "– అని తెలియజేశాడు. వ్యక్తి గుర్రం దిగి వచ్చి పరమ కోపంతో మొదటి సోమరిని కొట్టినదానికంటే నాల్గురెట్లు ఎక్కువ దెబ్బలు కొట్టి, తన సమయాన్ని వృథా చేసినందుకు తిట్టుకుంటూ వెళ్లిపోయాడు.

మనం భగవంతుడికి చేస్తున్న పూజులు, ప్రార్థనలు కూడా ఇలాంటివే. దైవాన్ని మనం కోరే కోర్కెలన్నీ మనం మన పురుషార్థంతోను, మనో యోగంతోను అవలీలగా పొందవచ్చు. పదిమందికి మేలుచేయవచ్చు కూడా. అలాంటిది ఆ సోమరులను మించిన పరమసోమరుల్లా ప్రవర్తిస్తూ దైవానికే పనులు చెప్పేసి, ఆయనచేత చేయించుకోవాలని చూస్తూ ఉంటాము. అందుకే మనకు లభించవలసినవి కూడా నాల్గు దెబ్బలు, పదితిట్లేగాని, అనుగ్రహాలు, వరాలు మాత్రం కారాదు. ఈ సత్యాన్ని మనం గుర్తించేదెప్పుడో.

– ప్రజ్ఞాపురాణం నుండి

**ప్రాపంచిక వాంఛ ఒక భయంకర రోగం. సంయమనం దానికి ఔషధం.**

బోధకథ

# స్వాతంత్ర్యం ఆయన ఊపిరి

గంగానదీ తీరం. సాయం సంధ్యలోని ఎరుపు గంగా తరంగాలపై నాట్యం చేస్తోంది. గంగాజలపు సిందూరపు రంగు ఎరుపు రంగుగా మారుతోంది. ఆ దృశ్యాన్ని తదేకంగా చూస్తున్నారు ఒక సన్యాసి. ఆయన తెల్లగా ఉన్నారు. ఎత్తైన విగ్రహం. ఆయన తనతో పాటు నడుస్తూన్న యువ శిష్యునితో ఇలా చెపుతున్నారు– "శ్యామ్! ప్రాచ్య సంస్కృతి అనే సూర్యుడుకూడా పాశ్చాత్యుల సిందూరపు రంగులో మునిగిపోతూ ఈ విధంగా నలుపులో కలసి అదృశ్యం కాదు కదా."

"కాదు స్వామీజీ. అలా జరగదు. మీ వంటి సమర్థులు ఉండగా ఆ అనర్థం జరగదు." – అన్నాడు శ్యామ్ గౌరవంతో.

స్వామీజీ తన అంతరంగంలోని వ్యధను ఇలా వ్యక్తం చేశారు – "నేను ఒంటరిగా ఏమి చేయగలను? ఇది ఎంతవరకు సాధ్యపడుతుంది? నేడు మన సంస్కృతిని దాస్యం, నీచత్వం అనే రోగాలు పట్టి పీడిస్తున్నాయి. అది రోజురోజుకూ క్రుంగి క్రుశించిపోతోంది. విదేశాలకు వెళ్లి మన సంస్కృతి సూర్యుని కాంతితో ఇతర దేశాల ప్రజలకు వెలుగును వెదజల్లే వీరపురుషుడు నాకు కానరావడం లేదు."

యువకుడు మౌనం వహించాడు. అయితే అతడి అంతరంగంలో ఓ వెలుగు వెలుగుతోంది. ఆ సన్యాసి భారతీయ సంస్కృతి ప్రాభవానికీ, రక్షణకూ యతిగా, యోధుడుగా పాత్రలు నిర్వహించి ఉన్న మహనీయుడు. ఆయన ఆ యువకునికి ఏదో సందేశం ఇస్తున్నారు. తేజోమూర్తి అయిన ఆ సన్యాసి స్వామి దయానంద. ఆ ఆదేశాన్ని శిరసావహించి, శ్యామ్ సర్వసమర్పణ భావంతో లండన్ వెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నాడు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో సంస్కృత ఆధ్యాపకుని ఉద్యోగం అపుడు ఖాళీగా ఉంది. విశ్వవిద్యాలయం అధికారులు ఆ అధ్యాపకుని నియామకంలో స్వామి దయానందుని సహకారం కోరారు. సంస్కృత పండితులకు కొదువ లేదు. అయితే అక్కడికి వెళ్లే పండితుడు భారతీయ సంస్కృతికి నిజమైన ప్రతినిధిగా ఉండాలని స్వామీజీ వాంఛించారు.

స్వామీజీ తన శిష్యుడు శ్యామకృష్ణ వర్మలో ఆ ప్రత్యేకతను కనుగొన్నారు. ఆయన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి అతడి పేరు పంపారు. అతడికి మొదటి విదేశ యాత్ర అదే.

భారతీయ సంస్కృతిపట్ల, వైదిక ధర్మంపట్ల అతడి అభిరుచి పుట్టుకతో వచ్చినది. సంస్కృతికి సేవ చేయాలనే అభిలాష అతడి నరనరాలలో జీర్ణించి ఉంది. అతడు విద్యార్థి దశలోనే దానిని తన జీవన లక్ష్యంగా స్వీకరించాడు. అతడి తండ్రి బొంబాయిలో ఉద్యోగం చేస్తున్నాడు. కనుక అతడి చదువు సంధ్యలు అక్కడే జరిగాయి. అతడి తండ్రికూడ భారతీయ సంస్కృతీ ఆరాధకుడే. అయితే ఉద్యోగం కారణంగా ఆయన దానికి తగినంత సమయం ఇవ్వలేకపోతున్నారు.

శ్యామ్ విద్యాలయం చదువుతోపాటు స్వతంత్రంగా సాంస్కృతిక విషయాలను అధ్యయనం చేస్తూవచ్చాడు. విద్యాలయంలో కూడ ధర్మ సంస్కృతులపై పరిశోధనకు ఉపకరించే పాఠ్య విషయాలనే ఎన్నుకున్నాడు. ఇలా అంకితభావంతో లోతుగా అధ్యయనం చేయడంతో అతడి ప్రతిభకు పదును వచ్చింది. ఈ ప్రతిభకు గుర్తింపుకూడ వచ్చింది. అతనిని ప్రవచనాలు చేయడానికి వివిధసంస్థలు ఆహ్వానించాయి. అతడి పాండితీ ప్రకర్ష, వక్తృత్వ నైపుణి విద్వాంసుల ప్రశంసలు అందుకున్నాయి. స్వామి దయానంద వంటి పరీక్షకులు అతడి ప్రతిభను ఎంతో ముందే గుర్తించారు. అతడి పాండిత్యం కన్నా అతడి సరళ వ్యక్తిత్వం స్వామీజీని మరింతగా ఆకర్షించింది. ఆయన తరచు అతడిని తనవద్దకు పిలిపించుకుని సమాజ సేవలో అతడికి మార్గదర్శనం చేస్తూ వచ్చారు.

శ్యామ్ తన జీవన లక్ష్యాన్ని తన తండ్రిగారికి తెలియజేశాడు. ఆయన దానికి తన ఆమోదం తెలిపారు. సిరి సంపదలు వైభవాన్ని ఇస్తాయి. కానీ మానసిక శాంతి దానికి ఆమడ దూరంలో ఉంటుంది. ఆ వైభవంవల్ల కీర్తి ప్రతిష్ఠలు లభించవచ్చు. కానీ, అది ఎన్నటికీ జీవన లక్ష్యం కాజాలదు. కనుక – సంస్కృతి సేవ అనే ముళ్ల బాటలో నడవడానికి ఆయన అతడికి ఆమోదం ఇవ్వడం నిజంగా అభినందనీయమైన విషయం.

స్వామి దయానంద ప్రేరణతో శ్యామ్ లండన్ చేరుకుని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడుగా చేరాడు. అందరూ అతడి వేషం చూచి ముక్కుమీద వ్రేలు వేసుకున్నారు. పంచ, లాల్చీ ధరించి అతడు భారతీయ సంస్కృతికి ప్రతినిధిగా నిలిచాడు.

**సోమరితనాన్ని పోషించడాన్ని మించిన పాపం లేదు.**

అతడు సూటూబూటూ వేసుకుని నెక్ టై కట్టుకుని వస్తాడని అక్కడి ఆంగ్లేయ అధికారులు అనుకున్నారు. బానిసత్వంలో ఉన్న దేశానికి తన వ్యక్తిత్వం పట్ల గర్వం ఎలా ఉంటుంది? బానిస జాతికి తన సంస్కృతి గురించి ఏమి తెలుస్తుంది? ఇలా ఆలోచించిన ఆ అధికారులు అతడి వేషానికి విస్మయం చెందారు. భారతదేశం రాజకీయంగా పరాధీనమై ఉన్నప్పటికీ, సంస్కృతిని ఆరాధించే వ్యక్తులు ఇంకా ఉన్నారని వారికి అర్థమయింది.

అక్కడ జరిగిన చర్చల సందర్భంలో ఒకసారి శ్యామ్ జీ ఈ సత్యాన్ని ఇలా వ్యక్తం చేశారు – "భారతదేశం రాజకీయంగా పరాధీనమై ఉండవచ్చు. కానీ, దాని ఆత్మ నేటికీ స్వతంత్రంగా ఉంది. భారతదేశం ఇప్పుడు నిద్రిస్తోంది. కానీ, అది మేలుకున్న రోజున దాస్య శృంఖలాలు వాటికవే తెగిపోతాయి. భారతమాత దివ్యవాణి ప్రపంచమంతటా మారుమ్రోగుతుంది. అపుడు విశ్వమంతా ఆమె చరణాలపై వ్రాలుతుంది. భారతీయ సంస్కృతి అమర పతాకం తిరిగి రెపరెపలాడుతుంది."

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో సంస్కృత అధ్యాపకుడుగా శ్యామ్‌జీ తన బాధ్యతలను నిర్వహిస్తూ వచ్చారు. అయితే ఆయన అధ్యాపక కార్యానికి పరిమితం కాలేదు. ఆయన పాశ్చాత్య సాహిత్యాన్నీ, సంస్కృతినీ, మతాన్నీ, సామాజిక ప్రవృత్తులనూ లోతుగా అధ్యయనం చేశారు. ఐరోపా ప్రజలలో దేశభక్తి, ప్రగతిశీలత, శ్రమపట్ల గౌరవం, కర్తవ్య పరాయణత్వం సమృద్ధిగా ఉన్నాయనీ, భారతీయులు ఈ లక్షణాలను విస్మరించారనీ ఆయన తెలుసుకున్నారు. ఈ దివ్య గుణాలను వికసింపజేసుకుంటే భారతీయ సమాజం తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందగలదని ఆయన నిర్ణయించారు.

లండన్‌లో నివసించే సమయంలోనే మాక్స్‌ముల్లర్‌తో పరిచయం అయింది. మాక్స్‌ముల్లర్ దృక్పథం విశాలం కాదనీ, ఆయన ముందుగానే ఏర్పరుచుకున్న అభిప్రాయాలవల్ల ఆ దృక్పథం ప్రభావితం అయిందనీ వర్మాజీ గుర్తించారు. మాక్స్‌ముల్లర్ సంస్కృతం ఆధారంగాకాక విదేశీ భాషలు, ప్రామాణికం కాని వ్యాఖ్యలు ఆధారంగా అధ్యయనం జరపడం అందుకు కారణం. వర్మాజీ ఆయనతో సాన్నిహిత్యం పెంచుకున్నారు. మూలభాష అయిన సంస్కృతంలో వేదాన్ని అధ్యయనం చేయాలనే ప్రేరణను ఆయనలో కలిగించారు. సంస్కృతం నేర్చుకోవడంలో ఆయనకు సహకారం అందించారు. భారతీయ ధర్మాన్ని వస్తు పరంగా ఎలా అధ్యయనం చేయాలో ఆయనకు వివరించారు. ఈ సాన్నిహిత్యం మరికొంత కాలం కొనసాగి ఉంటే మాక్స్‌ముల్లర్ భాష్యాలలో వైరుధ్యాలు ఉండేవి కావేమో.

ఏది ఏమయినా – పరాధీనత నీలినీడలు వర్మాజీని వెన్నాడుతూనే ఉండేవి. ఆంగ్ల పండితులు ఆయనను ద్వేషించేవారు. ఆ సంగతి ఆయనకు తెలుసు. అయినా ఆయన తన సంస్కృతి నిష్ఠకు ఆచరణ రూపం ఇవ్వడానికి పథకాలు రూపొందిస్తూ ఉండేవారు. ఆ విశ్వవిద్యాలయంలో పదవీ కాలం పూర్తికాగానే ఆయన స్వదేశానికి తిరిగివచ్చారు.

స్వదేశంలో ఆయనకు ఆర్థిక వనరుల కొరత సమస్య అయింది. విప్లవ పంథాను అనుసరించడం నిప్పుకణాలపై పయనించడమని ఆయనకు అనుభవం అయింది. తన కుటుంబాన్ని సహాయం అడగడానికి ఆయనకు ఆత్మగౌరవం అడ్డు వచ్చింది. ఆయన బొంబాయి, అజ్మీరులలో న్యాయవాదిగా పనిచేశారు. స్వదేశ సంస్థానాలలో ఉన్నతాధికారిగా పని చేశారు.

అయితే – విదేశాలలో ఉండి స్వరాజ్య సమరాన్ని మరింత సమర్థవంతంగా కొనసాగించగలుగుతానని ఆయన చివరికి నిర్ణయించుకున్నారు. ఆయన తిరిగి లండన్ వెళ్లారు. అక్కడ 'ఇండియా హౌస్'ను స్థాపించారు. ఆ సంస్థద్వారా అక్కడి భారతీయ విద్యార్థులను సమీకరించి, వారికి భారతీయ సంస్కృతి పట్ల నిష్ఠ కలిగించారు. అందుకోసం ఇండియా హౌస్‌లో అంతర్భాగంగా ఒక విద్యార్థి వసతి గృహాన్ని స్థాపించారు. అందులో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. నవయువకులలో స్వరాజ్య సమర జ్వాలను రగిలించే మహత్కార్యాన్ని ఆయన దిగ్విజయంగా నిర్వహించారు.

లండన్‌కు వచ్చిన దాదాభాయ్ నౌరోజీని, కాంగ్రెస్ సంస్థాపకుడు సర్ ఏ.ఓ.హ్యూమ్‌ను వర్మాజీ కలుసుకున్నారు. కానీ– విప్లవ జ్వాలకూ రాజీవాదానికీ పొంతన ఎలా కుదురుతుంది? వర్మాజీ నాయకత్వంలో యువశక్తి తన విప్లవోద్యమాన్ని మరింత తీవ్రస్థాయిలో కొనసాగించింది.

విద్యార్థులకు ప్రేరణ ఇవ్వడానికై వర్మాజీ స్వామి దయానంద, ఛత్రపతి శివాజీ, మహారాణా ప్రతాప్‌ల పేరిట మూడు ఉపకార వేతనాలను ఏర్పరచారు. ఆంగ్ల ప్రభుత్వంలో ఉద్యోగాలు చేయం అనీ, స్వరాజ్య సాధన కోసం ప్రాణాలు ఒడ్డి పోరాడతామనీ ఆ ఉపకార వేతనాలను పొందే విద్యార్థులు ప్రతిజ్ఞ చేయాలి.

వర్మాజీ లండన్‌లో నివసిస్తూ హోమ్ రూల్ లీగ్ అనే సంస్థను స్థాపించారు. ఇండియన్ సోషియాలజిస్ట్ అనే మాసపత్రికను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం 1857 స్వరాజ్య సమర జయంతి జరిపారు. వర్మాజీ చేస్తున్న ఈ కృషి బ్రిటిషు ప్రభుత్వానికి కలవరం కలిగించింది. ఆయనను ఖైదు చేయడానికి

**ఆత్మగౌరవంతో జీవించడమే ఆనందదాయకం.**

బ్రిటిషు ప్రభుత్వం కుట్ర పన్నింది. ఆ సంగతి తెలుసుకున్న వర్మాజీ తన కార్యరంగాన్ని ఫ్రాన్సుకు మార్చారు. వీర సావర్కర్ ఇంగ్లీష్ చానల్ ఈది ఈయన ఆశ్రయం పొందడానికి ప్రయత్నించారు. కానీ, ఫ్రెంచి ప్రభుత్వం ఆయనను బ్రిటిషు ప్రభుత్వానికి అప్పగించింది.

ఫ్రెంచి ప్రభుత్వంకూడ ఏదో కుట్రలో ఇరికించి ఆయనను ఖైదు చేయాలని ఆలోచిస్తోంది. ఈలోగా –1930 మార్చి 31న జెనీవాలో వర్మాజీ తనువు చాలించారు.

తన జీవితమంతా జాతికి సమర్పించిన ఈ అమరజీవి మరణ సమయంలో సైతం తన వీరవ్రతాన్ని వదులుకోలేదు. ఆయన తన వీలునామాలో ఇలా వ్రాశారు – "నా యావదాస్తీ సదుపయోగం కావడానికై దానిని సంస్కృతికి అంకితమైన ఏదైనా విశ్వవిద్యాలయానికి సమర్పించాలి."

ఆయన ఆస్తి అంతా – ఎంతో విలువైన గ్రంథాలు కలిగిన ఒక గ్రంథాలయం. ఆయన మరణం తర్వాత అది పారిస్ విశ్వవిద్యాలయ గ్రంథాలయ విభాగానికి అప్పగించబడింది. నేడు సైతం విద్యార్థులు వేలాదిగా ఆ గ్రంథాలయంలోని గ్రంథాల అధ్యయనం ద్వారా భారతీయ ధర్మ సంస్కృతుల వైభవాన్ని ఆకళింపు చేసుకుంటున్నారు.

శ్రీ శ్యామకృష్ణ వర్మ మౌన దేశభక్తుడుగా, సంస్కృతి సేనానిగా చరిత్ర పుటలలో వెలుగొందుతూ ఉంటారు.

☆☆☆

## వయసును మించిన ప్రతిభ

స్కాట్‌లాండ్‌లో జేమ్సు ఈస్టన్ అనే బాలుడు 12 సం॥ వయస్సులోనే అరబ్, గ్రీకు, హిబ్రూ, ఫ్లెమిష్ మొ॥న 12 భాషలను బ్రహ్మాండంగా నేర్చుకొన్నాడు.

ఫ్రాన్సులో జన్మించిన లూమాన్ అనే బాలుడు 12 సం॥ వయస్సుకే ఇంగ్లీషు, జర్మన్, ఫ్రెంచి, ఇతర యూరోపియన్ భాషలన్నీ అనర్గళంగా మాట్లాడ గలిగేవాడు. అతి ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఈ బాలుడు 6 నెలల వయసులో బైబిల్ చదివేవాడు. 2 సం॥ల వయస్సు వచ్చేసరికి ఈ బాలునితో పెద్ద పెద్ద ప్రొఫెసర్లు లెక్కలు, చరిత్ర, సైన్సు మొ॥పాఠ్యాంశాల గురించి మాట్లాడటానికి సాహసించలేకపోయేవారు.

బ్లేయిస్ తన 12వ యేట ధ్వనిశాస్త్రం మీద వ్యాసం వ్రాసి మొత్తం ఫ్రాన్సుని ఆశ్చర్యంలో ముంచి వేశాడు. జీన్ ఫిలిప్ బెరోటియర్‌కు 14 సం॥ వయస్సుకి ఫిలాసఫీలో డాక్టరేటు లభించింది. ఆయన ధారణశక్తి ఎంత గొప్పదంటే ఆనాటి వ్యక్తిగత, జాతీయ, అంతర్ జాతీయ సంఘటనలు మొత్తము టేపు చేసిపెట్టినంత యథాతథంగా తిరిగి చెప్పగల్గేవాడు.

జానీ అనే పేరుగల 3 సం॥ల ఆస్ట్రేలియా బాలుడు స్కూల్లో చేరిన మొదటిరోజు 8వ తరగతి పిల్లల పుస్తకాలను అవలీలగా చదవటమేగాక వారి సందేహాలు గూడా తీర్చేవాడు.

డాంటే 9 సం॥ వయస్సులో బ్రహ్మాండమైన కవిత్వాన్ని వ్రాసేవాడు. కాంట్ 10 సం॥కే వేదాంత పరమైన ప్రతిపాదనలతో పండితులను చకితుల్ని చేసేవాడు. గెటే 10వ ఏట కథ వ్రాయగా అది 7 భాషల్లోకి అనువదించబడి ఖ్యాతి నొందింది. బయసర్ 8 ఏళ్ల వయస్సులో ఉద్దండ పండితుల పంక్తిని కూర్చుని వారితో సమంగా సత్కారాలు అందుకొనేవాడు. భారతేందు హరిశ్చంద్ర 9 ఏళ్ల వయస్సులో సమస్యా పూరణం చేయటంలో బ్రహ్మాండమైన ప్రతిభను చూపించేవాడు. మహాకవి తులసీదాస్ రామరామ అంటూ పుట్టాడు.

వీటినిబట్టి మనకు అర్థమయ్యేదేమంటే ప్రతిభా, సాఫల్యంవంటి వాటికి వయస్సు ఏనాడూ ఆటంకం కాజాలదు. శ్రద్ధ, పట్టుదల ఈ రెండింటితో అతి చిన్న వయసులోనే సంచిత సంస్కారాలను జాగృతం చేసికొని ఆశ్చర్యకరమైన లాభాలను అవలీలగా హస్తగతం చేసికోవచ్చు. కానీ ఈ రెండూ లోపిస్తే సంచిత సంస్కారాలు పనికిరాకుండా జీవితాలు గడిచిపోతాయి.

- ప్రజ్ఞాపురాణం నుండి

**లోభగుణం వివేకాన్ని కుప్పకూల్చుతుంది.**

## యుగపరివర్తన ప్రక్రియ

# యుగనిర్మాణ యోజనలోని శతసూత్ర కార్యక్రమం

యుగ నిర్మాణ యోజన అనే ఆధ్యాత్మిక ప్రక్రియ 1962 జూన్‌లో అఖండజ్యోతి సభ్యులద్వారా ప్రారంభమయింది. వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణం దీని లక్ష్యం. ఇది యుగం ఇస్తున్న పిలుపు. అందుకొనితీరవలసిన పిలుపు. ఆరోగ్యవంతమైన శరీరం, నిర్మలమైన మనస్సు, సభ్య సమాజాల అభినవ నిర్మాణం అనే ఈ ఆశయాన్ని పూర్తిచేయడానికై ఈ ఉద్యమం నాటినుండి శరవేగంతో పురోగమిస్తోంది. ఈ వంద సూత్రాల యోజనను లక్షలాది సభ్యులు దేశవిదేశాలలో ఉత్సాహంగా అమలు జరుపుతున్నారు. రానున్న రోజులలో యుగ నిర్మాణం ఒక వాస్తవం కాబోతున్నది.

ఆలోచనాపరుడైన ప్రతివ్యక్తీ అమలు చేయదగిన యోజన ఇది. ఎందుకంటే – నేడు మానవాళి ఉద్ధరణ జరుగుతూన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, అది వాస్తవానికి పతనమే. పై మెరుగులు, అలంకారాలు పెరుగుతున్నాయి. కాని లోలోపల అంతా గుల్లగా మారుతోంది. మెదడు పెరుగుతోంది. కాని గుండె రోజు రోజుకూ కుంచించుకుపోతోంది. చదువుతోపాటు ఔదార్యరాహిత్యం, స్వార్థపరత్వం, విలాసాలు, అహంకారం పెచ్చుపెరుగుతున్నాయి. వేషభూషలు, రుచికరమైన భోజనం, వినోదాల స్థాయి పెరుగుతోంది. సంయమనం కొరవడడంవల్ల ఆరోగ్యం దిగజారిపోతోంది. జనం డాక్టర్ల చుట్టూ ప్రదక్షిణాలు చేసి అలసిపోతున్నారు. ఆరోగ్యం అందే సందర్భాలు మాత్రం అపురూపంగా ఉంటున్నాయి.

ధనంతోపాటు ధరలూ, అవసరాలూ విపరీతంగా పెరిగిపోతున్నాయి. మనుషులమధ్య సంబంధాలు క్షీణిస్తున్నాయి. అవిశ్వాసం, అనుమానం పెరుగుతున్నాయి. శీలం, నిజాయితీ ఘోరంగా పతనమై, ఎవరూ ఎవరినీ నమ్మలేని స్థితి దాపురిస్తోంది. పోలీసు సిబ్బందీ, జైళ్లూ, న్యాయ స్థానాలూ, కేసులతో పాటు నేర ప్రవృత్తి పెచ్చుపెరుగుతోంది.

జీవితంలో సంఘర్షణ పెరిగి, సుఖశాంతులు కరవవుతున్నాయి. ప్రతి వ్యక్తీ సమస్యల విష వలయంలో చిక్కుకుని ఉన్నాడు. చింత, భయం, క్షోభ, మనిషిలో అశాంతిని సృష్టిస్తున్నాయి. ఫలితంగా ఆత్మహత్యల సంఖ్యా, ఉన్మాదుల సంఖ్యా రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి.

రాజకీయ రంగంలో పాలకుల దుశ్చర్యల వల్ల ప్రజా శ్రేయస్సు మంటగలుస్తోంది. అణు యుద్ధంవల్ల ఒకటిరెండు గంటలలో మానవ సభ్యత మొత్తం నాశనమయ్యే ప్రమాదం కంఠంమీద కత్తిలా భయానకంగా తయారవుతోంది.

ఈ దారుణ దుర్భర పరిస్థితి మారడం అనివార్య అవసరం అనేది నగ్న సత్యం. మార్పు జరగడం ఆలస్యం అయితే పరిస్థితి చేయిదాటిపోవచ్చు. అంత వేగంగా పతనం జరుగుతోంది. ఇది వేగ యుగం కదా. కనుక పరివర్తన ప్రక్రియ ఈ రోజే ప్రారంభం కావాలి.

ఈ పరివర్తనకు ప్రాతిపదిక మనిషి ఆత్మపరంగా ఉన్నతిని సాధించడం. మనిషిలోని నిజమైన పరాక్రమం అతడి సద్గుణాలలో వెలికివస్తుంది. ఉదాత్త అంతఃకరణ, విశాల హృదయం, దూరదృష్టి, సౌశీల్యం కలిగిన వ్యక్తులే ఇతరులకు దారి చూపగలుగుతారు. ఇలాంటి వ్యక్తుల సంఖ్య పెరిగినపుడే ఏ జాతి అయినా నిజమైన సామర్థ్యాన్నీ, సమృద్ధినీ సాధించగలుగుతుంది.

నేడు ఆర్థిక ప్రగతికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యా విధానాన్ని ఈ దృష్టితోనే రూపొందిస్తున్నారు. నైతికత, ధార్మిక భావన, కర్తవ్య పరాయణత్వం, సదాచరణల వికాసాన్ని పూర్తిగా ఉపేక్షిస్తున్నారు. ఆర్థిక ప్రగతి సజ్జనులకు జరిగినపుడే దానికి విలువ ఉంటుంది. దుష్టులూ, దుర్జనులూ సంపన్నులు అయితే, దానివల్ల సమాజానికి నష్టమే జరుగుతుంది. కనుక ధనానికి కన్నా నైతిక వికాసానికి విలువ ఎన్నోరెట్లు హెచ్చు. కానీ, నైతిక వికాసమే దారుణమైన ఉపేక్షకు గురవుతూ ఉండడం దురదృష్టకరం.

వ్యక్తిలో మార్పు వస్తేనే సమాజం, విశ్వం, యుగం మారడం సాధ్యపడుతుంది. ఈ పృథివిపై స్వర్గ వాతావరణాన్ని సృష్టించాలంటే మనం జన మానస స్థాయిని మార్చవలసి ఉంటుంది. స్వార్థపరత్వం, సంకుచితత్వం, సంయమరాహిత్యం, అవినీతి మున్నగు అవలక్షణాల స్థానంలో సద్భావనలనూ, సత్ ప్రవృత్తులనూ నెలకొల్పవలసి ఉంటుంది. మాటలవల్ల,

**మనస్సు ఐశ్వర్యం వల్ల దుర్బలమౌతుంది. లేమివల్ల బలపడుతుంది.**

వ్రాతలవల్ల జరిగే పని కాదిది. వాటి ద్వారా ప్రచారం జరుగుతుంది. వాటి ప్రభావం బహుకొద్దిగా ఉంటుంది. ఒకరిని మరొకరు అనుకరించే ప్రవృత్తి మనిషిలో హెచ్చుగా ఉంది. కనుక – ఆధ్యాత్మిక దృక్పథానికి అనుగుణంగా ప్రజలు తమ జీవన విధానాన్ని రూపొందించుకునేటట్లు చేయడానికి నిరంతరం కృషి జరగాలి.

జాతీయ నాయకత్వం భారీ యెత్తున సూత్రబద్ధంగా ఈ కార్యాన్ని నిర్వహిస్తే బాగుండేది. కానీ, నేడు మన నాయకుల దృక్పథం మరోవిధంగా ఉంది. ఆర్థిక వికాసమే అన్నిటికన్న మిన్న అని వారు భావిస్తున్నారు. వారు సదాచారం గురించి మాట్లాడతారు. కాని, ఆ సదాచారాన్ని రూపొందించే పనిపట్ల ఆసక్తి వారిలో కానరావడం లేదు. ఈ నిరాశాజనక పరిస్థితులలో మనం మనకు చేతనైనది చేయాలి. చేస్తున్నాం కూడా.

యుగ నిర్మాణ పరివార్ ఈ మార్గంలో పయనిస్తున్న కోట్లాది వ్యక్తులతో కూడిన ఒక ఆధ్యాత్మిక సంస్థ. భావనలతో, ఆత్మీయతతో సూత్రబద్ధం చేయబడిన సంస్థ. పరమపూజ్య గురుదేవులు ఈ విశాల కుటుంబాన్ని నిర్మాణం చేసి దీని ద్వారా జీవన నిర్మాణ కార్యాన్ని చేపట్టారు. వారు శతసూత్ర కార్యక్రమాన్ని ఈ కుటుంబ సభ్యుల ముందుంచారు. ఆదర్శవాదాన్నీ, ఉత్కృష్టతనూ జీవన విధానంలో రంగరించే ప్రక్రియను వారిచేత అభ్యాసం చేయిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని లక్షలాది వ్యక్తులు అమలుచేస్తూ ఉండడంవల్ల నవ సమాజ నిర్మాణం సాధ్యపడుతోంది. బౌద్ధిక, సామాజిక విప్లవం ఊపందుకుంటోంది. ఇందువల్ల పాపతాపాలను భస్మంచేసే అగ్నిజ్వాల రగులుతోంది. ఇందులో ఆత్మకళ్యాణం, జీవన్ముక్తి అనే లక్ష్యం కూడ ఇమిడి ఉంది. ఇది ఒక ఆధ్యాత్మిక సాధన. కనుక దీనిని ఒక విధమైన యోగ సాధనగా, తపశ్చర్యగా, నర – నారాయణ భక్తిగా, భావోపాసనగా పరిగణించవచ్చు.

ఈ మార్గంలో పురోగమిస్తూ శతసూత్ర కార్యక్రమంలో తమకు అనుకూలమైన సూత్రాన్ని అమలుచేయడంలో వ్యక్తులు సాహసాన్నీ, మనోబలాన్నీ చూపవలసి ఉంటుంది. దీన్ని పలువురు పరిహాసం చేయవచ్చు. పలువురు వ్యతిరేకించవచ్చు. అయినా, ఆ వ్యక్తులు తమ స్వార్థాన్ని అదుపుచేసుకోవలసి వస్తుంది. ఆర్థికమైన ఇబ్బందులను ఎదుర్కొనవలసివస్తుంది. తమ పూర్వ సంచిత కుసంస్కారాలతో పోరాడవలసివస్తుంది. ఈ సాహసం చేయగలిగిన వ్యక్తిని నిజమైన సాధన సమర వీరునిగా పరిగణించాలి. ఒక వ్యక్తి ఆధ్యాత్మిక భావనలను జీర్ణించుకున్నాడా, చిలక పలుకులుగా వల్లె వేస్తున్నాడా అని తెల్సుకోవడానికి గీటురాయి ఈ సాహసం. ఈ యుగ నిర్మాణ యోజన ఒక విశుద్ధ సాధన. నవ సమాజ నిర్మాణమనే లక్ష్యాన్ని చేరడానికి ఇతర జపతప సాధనలకన్నా మరింత సరళమైన సాధన ఇది. 1962 జూన్‌లో గురు పూర్ణిమ రోజున ఈ మహోద్యమం ప్రారంభమయింది. తమ సాహసం, మనోబలం పెరిగేకొలదీ సభ్యులు మరింత వేగంగా ఈ కృషిలో ముందంజ వేయగలుగుతారు.

ఉద్యమ లక్ష్యాలతో ఏకీభవించే పదిమందితో ఒక శాఖ ప్రారంభించబడుతోంది. ఒక సంచాలకుడు, మరి అయిదుగురు వ్యక్తులతో దీనికి కార్యసమితి ఎన్నుకోబడుతుంది. ఈ శాఖను యుగ నిర్మాణ కేంద్రం అని పిలుస్తారు. ఈ కేంద్రం సభ్యులు కలుసుకోవడానికి ఒక మిలన్ మందిర్‌ను ఏర్పాటుచేసి, యోజనలోని నిర్మాణాత్మక ప్రవృత్తులు కార్యరూపం ధరించడానికి వీలు కల్పించే ప్రాథమిక శాఖ అవుతుంది. ప్రజ్ఞామండలి – మహిళా మండలిని ఒక యూనిట్‌గా చేసి, 5–10 నుండి 20–30 మండలుల సమూహం ఏర్పాటుచేయబడుతోంది. దీనిని 'ప్రక్రియ సంఘటిత సమూహం' అని పిలుస్తారు. ఈ సమూహాలన్నిటిని కలిపి 'సమర్థ సమయదాన్ సంఘటిత సమూహం' ఏర్పాటు చేయబడుతోంది. ఈ శాఖల కార్యక్రమాల వార్తలు యుగ నిర్మాణ యోజన, ప్రజ్ఞా అభియాన్, యుగశక్తి గాయత్రి పత్రికలలో ప్రచురించబడుతూ ఉంటాయి. అందువల్ల దేశమంతటిలో ఉన్న ఈ శాఖలకు యోజన ప్రగతి గురించి తెలుస్తుంది.

ఇంత పెద్ద ప్రపంచంలో కొన్ని లక్షలమంది సంస్కరించబడడంవల్ల ఏమాత్రం ప్రయోజనం ఉంటుందని అనుకోవడం తగదు. పరివార్‌లోని ప్రతి సభ్యుడూ ఈ సిద్ధాంతాన్ని పదిమందికి అందిస్తానని ప్రతిజ్ఞ చేయాలి. అఖండజ్యోతి, యుగ నిర్మాణ యోజన, యుగశక్తి గాయత్రి మాసపత్రికలను ఈ సభ్యులు తాము చదివి మరి పదిమంది చేత చదివించాలి. వీరిలో కొందరు తప్పకుండా యోజనలో సభ్యులు అవుతారు. గాయత్రీ పరివార్‌లో చేరతారు. ఆ తర్వాత వారుకూడ మరి పదిమందిని యోజనలో చేర్చుతామని ప్రతిజ్ఞ చేస్తారు. ఈ ప్రసార ప్రక్రియ అయిదారు మార్లు అమలు జరిగితే ప్రపంచమంతటికీ దాని ప్రభావం విస్తరిస్తుంది. ఆ విధంగా యోజన వెనుక ఉన్న సిద్ధాంతం కార్యరూపం ధరిస్తుంది.

★ ★ ★

**సంప్రదాయం గతం చేసిన దానం. పరివర్తన భవిష్యత్తుకు ప్రతీక.**

## దానం ఒక ఆధ్యాత్మిక ప్రక్రియ

# సమర్పించడంలో సాత్వికానందం

భౌతిక జీవనంలో సేవా, సహాయతల మహత్తు ఎంతగా ఉంటుందో, ఆధ్యాత్మిక క్షేత్రంలో దానం అంత మహత్తు కలది. ఎప్పుడూ పుచ్చుకోవడం తప్పితే ఇవ్వడం ఎరుగని వ్యక్తి జీవితంలో చాలా కష్టాలను అనుభవించవలసి వస్తుంది. అందువల్ల ప్రపంచంలో సహకారానికి ప్రాధాన్యత ఎక్కువ. ఈ సహకారమనేది నిష్కామభావంతో చేస్తుంటే దాన్ని దానమంటారు.

దానంలో ఎప్పుడూ సమర్పించాలనే భావమే ఉంటుంది. అది శ్రమదానంగానీ, సమయదానంగానీ, జీవనదానంగానీ, అంశ దానంగానీ, భూదానం గానీ, దాని వెనకాల ఏదో పొందవలెననే ఆశ ఉండదు. శ్రమ అనే దాన్ని డబ్బుకోసం చేస్తే దాన్ని శ్రమదాన మనరు. దాన్ని పరిశ్రమ అంటారు. పరిశ్రమ కోసం పారిశ్రామిక వ్యవస్థ ఉన్నది. శ్రమదానం ప్రతిఫలాన్ని కోరదు. జీవితంలో కొంతభాగం సమాజ శ్రేయస్సు కొరకు ఖర్చు చేయాలి. జీవనదానాన్ని గురువుకోసం, ఉన్నతమైన ఆదర్శాలకోసం, ఇష్టదైవం కోసం సమర్పణభావంతో చేయాలి. అది సమర్పణ. సమర్పణ అంటే అర్థం విలయం, విసర్జన. తన ఇచ్ఛలను, కామనలను, గురువు యొక్క, ఇష్టదేవతయొక్క, ఇచ్ఛా, ఆకాంక్షలతో మిళితం చేసి సమర్పించడం నిజమైన సమర్పణ. దాని వల్ల గురువు, ఇష్టదేవత, శిష్యుని నిర్మాణం చేయటం మొదలవుతుంది. ఈ ప్రక్రియ చివరి వరకు జరుగుతూనే ఉంటుంది. ఎప్పుడైనా ప్రతిబంధకాలు ఎదురై అది ఆగిపోతే, ఆ సమర్పణలో వ్యవధానం ఏర్పడి, జీవనదానం పరిహాసాస్పదమవుతుంది. వాస్తవమైన సమర్పణ గురించి ఒక కవి వర్ణన వినండి.

**మాలిక్ తేరీ రజారహే, జాశ్ తూహీతూ రహే**
**బాకీ న మై రహూం, నమై ఆరజూ రహే**

అనగా - ప్రభూ! నీ ఇచ్ఛ ఉండాలి, నీవు మాత్రమే ఉండాలి. నేనేమీ లేను మిగిలి, నా కోరిక గూడా లేదు.

జీవనదాన ఆదర్శం ఈ విధంగా ఉండాలి. వినోబా భూదాన యజ్ఞంలో దేశమంతటా కర్షకులు వేలాది ఎకరాల భూమిని దానం చేశారు. ఇది పూర్తిగా నిస్వార్థమైనదే. దీంట్లో షరతులేవీ లేవు. ఆకారణంగా అది భూదాన యజ్ఞంగా పేరు పొందింది. నీతి పూర్వకంగా ఆర్జించిన ధనాన్ని దానమిస్తే అది అంశదాన మవుతుంది. దానిని ఉన్నతమైన ఆదర్శాల కొరకు ఖర్చు చేయాలి. ఎల్లప్పుడూ లోభం లేకుండా ఇచ్చినదానినే దానమని పిలవాలి. మహాభారత శాంతి పర్వం (33,36)లో దీని వర్ణన స్పష్టంగా ఉన్నది. "నదద్యాద్య శశే దానం'', యశస్సు కొరకు లోభంతో దానం చేయరాదు. మున్షీ ప్రేమ్‌చంద్ రచన రంగభూమి 7వ పరిచ్ఛేదంలో అటువంటి అభిప్రాయాన్నే ప్రకటిస్తారు. నిజంగా దానం చేసేవాడు ప్రసిద్ధి పొందాలని కోరడు. వివేకానందులనేవారు- దానం చేసేవాడి యోగ్యత రెండు లక్షణాలను కలిగి ఉంటుంది. మొదటిది నీతి, సదాశయం, రెండవది దరిద్రులయెడ, అభావగ్రస్తులయెడ అతడి ప్రవర్తన. ఎవరిలో నైతికత ఉన్నదో, ఎవరియందు కరుణ, ఔదార్యం ఉన్నవో, అది నిజమైన దానశీలతగా చరితార్థమవుతుంది. అనైతికంగా సంపాదించి, ఔదార్యం లేకుండా దానం చేస్తే దానివెనుక స్వార్థం ఉంటుంది.

ప్రస్తుతం దానం చేసేవారికి లోటులేదు. రోడ్లమీద, చౌరస్తాల మీద పలువురు చాలా ఖర్చు చేస్తారు. కాని నిర్లిప్తతతో కాదు. అందులో ఎంతో కొంత పొందాలనే అభిలాష కనిపిస్తుంది. ఎంత పరిహాసాస్పదం! మనం ఇస్తున్నాం. దానం చేస్తున్నాం. కాని ఎంతో కొంత పొందటానికే.దానిని సద్వినియోగం చేయటంలేదు. దాన్ని మనం సాధనంగా ఉపయోగిస్తాం. మనం శ్రద్ధ, గౌరవం, సహకారం, సానుభూతి పొందే స్వార్థసాధన ఇది. చివరికి స్నేహదానం చేసినా అది గూడా నిస్వార్థంగా ఉండటం లేదు. అక్కడ తిరిగి స్నేహం పొందాలనే ప్రచ్ఛన్న కామన ఉన్నది. గౌరవం ఇవ్వడం వెనుక గౌరవం పొందాలనే లాలస ఉన్నది. సన్మానించినా, అవమానం పొందినా ఎంతో సంతోషించడమనేది వీతరాగులైన పరమహంసలకే చెల్లుతుంది. నిజమైన దానం చేస్తుంటేనే అటువంటిది జరుగుతుంది. అలా ఇవ్వడమే ఇవ్వడం. ఏదో పొందాలనే కోరిక ఉండదు. సన్మానమైనా ఒకటే, అవమానమైనా ఒకటే. అందువల్ల దానం ఒక ఆధ్యాత్మిక ప్రక్రియ. ధర్మానుష్ఠానాలతోపాటు తప్పని సరిగా దానం చేయటం కలిసి ఉంటుంది. అది అధ్యాత్మ జగత్తు విషయం. భౌతిక జగత్తులో ఇచ్చి పుచ్చుకోవటాలు ఉంటాయి. మొదట పుచ్చుకోవాలనే ఆలోచన, తరువాత ఇవ్వడం. ఎప్పుడూ ఇచ్చిన దాని కన్న ఎక్కువ తిరిగి పొందాలని తపన. అలా కాకపోతే తాను దివాలా తీస్తాడు. ఇదీ ఆలోచన. ఇది దానమెలా అవుతుంది? బేరం చేయడమవుతుంది. మనం ఎంత ఇచ్చామో అంతకంటే ఎక్కువగాకపోయినా, కనీసం అంతైనా తిరిగిరావాలి. ఆశ్చర్యం! ఇటువంటి బేరసారాలు భగవంతుని వద్దగూడా జరుగుతున్నాయి. ఎంతోమంది దేవాలయాల్లో దేవతలవద్ద దాన, దక్షిణలు సమర్పిస్తున్నారు! వారికి అందుకుగాను ఉద్యోగాలు రావాలి. మానసిక శాంతి కావాలి. పుత్రప్రాప్తి కావాలి. దావాలు గెలవాలి. వ్యాపారంలో లాభాలు కావాలి. పరీక్షల్లో మొదటి రాంకుల్లో పాస్‌కావాలి. వ్యాధులు నయం కావాలి. ధనవంతులు బావులు, చెరువులు తవ్విస్తారు. పాఠశాలలు, ధర్మశాలలు, దేవాలయాలు, ఆస్పత్రులు కట్టిస్తున్నారు.

**చెడు అలవాట్లను మానడం కష్టం కావచ్చుకాని, అసాధ్యం కాదు.**

నిత్యాన్నదానం చేస్తున్నారు. సమాజోన్నతి కోసం, సమాజానికి సమర్పించడమనేది దానమే. కాని దీనితో పాటు దాతకు స్వార్థభావన గూడా ఉంటున్నది. అవినీతితో కూడబెట్టిన పాపం పోవాలి. దీన్ని దానమని పిలవకుండా సహకారమనడం మంచిది. కాని, ఈ దానధర్మాల వెనుక సమాజ కళ్యాణ భావన దాగి ఉంటే అందరూ సుఖంగా ఉండాలనే కోరిక ఉంటే ఈ కార్యం నిశ్చయంగా శ్రేష్ఠమైన స్థాయికి చెందిన దానమే.

ప్రపంచానికీ, ప్రకృతికీ మధ్య ఇచ్చి పుచ్చుకోవడాలు జరుగుతుంటాయి. ఎవరు ఇస్తారో, వారికి అంతకు ఎన్నోరెట్లు లాభం కలుగుతుంది. కృపణులు, ఔదార్యం లేనివారు నష్టపడతారు. రైతు విత్తనాలు చల్లి బస్తాల ధాన్యాన్ని పొందుతాడు. వృక్షాలు ప్రతి సంవత్సరం పండ్లను, పూలను అందిస్తాయి. మేఘాలు నిస్వార్థంగా వర్షిస్తాయి. అందువల్ల నదీనదాలు ప్రవహిస్తాయి. సూర్యుడు అనాదినుండీ శక్తిని, వేడిని, వెలుతురునూ ప్రసాదిస్తున్నాడు. ప్రకృతి వెనుక అక్షయ భాండాగారం ఉన్నది. ఒక్కమనిషి మాత్రమే దేన్నో పొందాలనే ఆశతో ఇస్తాడు. ఈ కాంక్షయే దుఃఖానికి కారణం. మనీషులంటారు - పొందాలనే కోరిక ఎంత ఎక్కువగా ఉంటే అంత దుఃఖపడతాడని. కోరికలు తీరక పోతేనే దుఃఖం కలుగుతుందనుకోవటం పొరపాటు. కోరికలు తీరినా దుఃఖం ఉంటుంది. అర్థశాస్త్ర సిద్ధాంతం ప్రకారం కోరికలకు అంతులేదు. ఒక కోరిక తీరితే వెంటనే రెండవ కోరిక కలుగుతుంది. అది కాగానే మరొకటి. బావిలో నీరూరినట్లే. ధనికుల వద్ద సాధన సంపత్తి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వారు ఈ చక్రంలో పడి తిరుగుతూనే ఉంటారు. బీదవారి ఆదాయం పరిమితంగా ఉంటుంది. అందువల్ల వారు పెద్ద, పెద్ద కలలు కనరు. అందువల్ల వారు సంపన్నుల కంటే సుఖంగా ఉంటారు. సంతోషంగా ఉంటారు. స్పష్టంగా చెప్పవచ్చు ధనికుల కంటే బీదవారి దుఃఖం తక్కువగానే ఉంటుందని. దీనికి కారణం ఒక్కటే. ధనికులు ఇంకా, ఇంకా పొందాలనే కోరికను అణచుకోలేరు.

అమెరికాలోని ఫోర్డు మోటార్స్ కంపెనీ అధిపతి కుమారుడు ఇల్లు వదలి ఇస్కాన్ పేరుగల ఆధ్యాత్మిక సంస్థలో చేరిపోయినాడు. ఒక కోటీశ్వరుడు ఈ విధంగా బీదవానిలా జీవనం గడపాలనుకోవడంలో రహస్యమేమిటి? దీనికి సమాధానం ఒక్కటే! ఈ దారిద్ర్యం వల్ల తాను పొందిన సుఖ, సంతోషాలను ధనికుడుగా, విలాసవంతంగా జీవించేటప్పుడు పొందలేదు. రాజకుమారుడైన సిద్ధార్థుడు ఐశ్వర్యాన్ని త్యజించి ముక్తి పథాన్ని అనుసరించాడు. రాజైన భర్తృహరి ఇటువంటి పరిస్థితిలోనే రాజ్యత్యాగం చేసి అడవులకు వెళ్లిపోయాడు.

ఈ ఉదాహరణలతో మనకు స్పష్టంగా తెలిసే విషయం, దానం చేయటం వల్ల దీనత్వం తగ్గుతుందనీ, అడుక్కోటం వల్ల నిలవచేయటం వల్ల దీనత్వం పెరుగుతుందనీ. ఈ కారణంగానే ఋషి ప్రకృతి గలవారు ఎప్పుడూ దానం చేస్తూనే ఉంటారు. అందువల్ల వారికి ఆత్మసంతోషం, ఆనందం లభిస్తూ ఉంటుంది. అంతటి ఆనందం ధనపతులకు లభించదు. దాతలకు కూడబెట్టేవారికీ మధ్య గొప్ప అంతరం ఉంటుంది. బయట నుండి చూచే వారికి దాత దీనుడుగా, హీనుడుగా కనిపించవచ్చు. కాని దివ్య దృష్టిగల వారికి చక్కగా తెలుసు- పరిగ్రహికీ, అపరిగ్రహికీ ఆంతరిక స్థితిలో భూమికీ, ఆకాశానికీ ఉన్నంత అంతరం ఉందని. నిజానికి దీనుడు, హీనుడు, దరిద్రుడు ఎవరు? ఒకప్పుడు వివేకానందస్వామి సర్వమత సమ్మేళనంలో పాల్గొనడానికి అమెరికా వెళ్లారు. ప్రజలంతా ఆయన వేషాన్ని చూచి ఎగతాళి చేశారు. అప్పుడాయన అన్నారు - మీరంతా సంపన్నతను చూచి గౌరవిస్తారు., కాని మా దేశంలో ఆంతరిక స్థితి కారణంగా సభ్యతా, సంస్కారాలను అంచనావేస్తారని. ఇది నిజం. బయటి మెరుగులు చూచి ఆంతరిక స్థితిని అంచనావేయడం అవివేకం. బయటికి సంపన్నులుగా కనిపించేవారు లోపల బిచ్చగాళ్ల కంటే హీనులు కావచ్చు. ప్రత్యక్షంగా కనిపించే దారిద్ర్యం వెనుక మహత్తరమైన విశాల హృదయం దాగి ఉండవచ్చు. నిజమైన దాతకు ఆంతరిక మహోనత అనివార్యం. ఆంతరంగికంగా సంకుచితత్వం గలవాడు దాత కాలేడు. అతడు దానం చేస్తున్నట్లు కనిపించినప్పటికీ, అది నిష్ప్రయోజనమే. కారణం, అతడు స్వార్థపరుడేగాని, పరమార్థపరుడు గాడు. ఆ దానాన్ని తామస దానమని పిలుస్తారు. ఆధ్యాత్మ విద్యాచార్యులు దేశ, కాల, పాత్రతలననుసరించి దానం చేయమంటారు. పాత్రత ఆధారం దానానికి. "అన్నదానం మహాదానం, విద్యాదానం మహత్తరం, అన్నేన క్షణికా తృప్తిర్యావజ్జీవంతు విద్యయాం''. అనగా- అన్నదానం మహాదానమేగాని అంతకంటే గొప్పది విద్యాదానం. ఇది క్షణిక తృప్తినిస్తుంటే, అది ఆజీవనం తృప్తినిస్తుంది.

ఈనాడు ప్రపంచాన్ని కలచివేస్తున్న సంకటాలు రెండున్నాయి. ఒకటి బాధ. రెండవది పతనం. బాధను అన్నదాన-అర్థదానాలతో నివారించవచ్చు. పతననివారణ అనేది మాత్రం ఒక్క విద్యాదానంతోనే సాధ్యం. పతనంతో కలిగిన పాపం చాలా అధికం. ధనికులు పతనానికి ఎక్కువగా బలవుతున్నారు. విద్యాదానంతో వారు బయటపడవచ్చు. ధనికుల వద్ద విపరీతంగా నిధులుంటున్నాయి. వారు సద్జ్ఞాన దానం అన్నిటికన్న గొప్పదని తెలుసుకోవాలి.

ప్రముఖ తత్త్వవేత్త జాన్ పాల్ అంటారు, నీ వద్ద ఉన్నదాన్ని బట్టి దానం చేయాలి, ఎంత యిస్తే అంత లాభం కలుగుతుందని. భగవంతుడిచ్చిన ఐశ్వర్యం భగవంతుని నిమిత్తం ఖర్చుచేయాలి. ఆయన ప్రసాదించిన సంపత్తి, జ్ఞానం, ప్రతిభ, కౌశలం, బలం, బుద్ధి, వివేకం, నగలు-నాణ్యాలు, తనకొరకు తక్కువగానూ తన సమాజం కొరకు ఎక్కువగానూ ఖర్చుచేయాలి. లేకపోతే అవి నిలవవు. దాన ప్రయోజనం తెలుసుకుని తన ఇష్టం వచ్చినంత దానం చేయాలి. ఇదే సమయం మన నుండి కోరుకుంటున్నది.

అనువాదం: డి.వి.ఎస్.బి.విశ్వనాథ్

**తన దృక్పథాన్ని సంస్కరించుకోలేనివాడు పరిస్థితులను ఎలా సంస్కరిస్తాడు?**

## జీవన విలువలు

# మనిషి విలువకు గీటురాయి ఏది?

ప్రమాణం తప్పుగా ఉంటే, విలువకట్టేందుకు గీటురాయి వికృతంగా ఉంటే - వాటివల్ల కలిగే ఫలితాలుకూడ అలాగే ఉంటాయి. నేడు సమాజంలో అన్యాయం, అవినీతి, లంచగొండితనం విశృంఖలంగా విహరిస్తున్నాయి. మనుషులను విలువకట్టడానికీ, వారి వ్యక్తిత్వాలను అంచనా వేయడానికి మనం వాడుతున్న కొలబద్దలూ, గీటురాళ్లూ తప్పుడువి కావడం ఈ దారుణ పరిస్థితికి ఒక ప్రముఖ కారణం.

ఈ భవనం ఎంత విశాలంగా ఉంది! బంగారంలా మెరిసిపోతోంది. తలుపులూ, కిటికీలూ, వెంటిలేటర్లూ రంగుటద్దాలతో ధగధగలాడుతున్నాయి. పట్టు పరదాలు రెపరెపలాడుతున్నాయి. మూన్‌లైట్ బల్బులు వెలుగుతున్నాయి. స్టీరియో డెక్ నుండి మృదుమధుర సంగీతం వినిపిస్తోంది. ఇవన్నీ కళ్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి. వీనులకు విందు చేస్తున్నాయి. ఇంద్ర భవనంలా ఉంది- అని మనస్సు మెచ్చుకుంటోంది. ఈ భవనం యజమాని ఎంత అదృష్టవంతుడు! ఎంత గొప్ప వ్యక్తి! అతడివద్ద లక్షలూ కోట్లూ ఉండిఉంటాయి- అని మనస్సులో పొగడ్తల పరంపర చెలరేగుతోంది. అపరిచితుడైన ఆ ధనవంతుని పట్ల శ్రద్ధా గౌరవాలు పొంగిపొరలుతున్నాయి. అతడి కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తున్నాయి. సందర్భం వచ్చినపుడు అతడికి సత్కారాలూ, సన్మానాలు జరుగుతాయి.

ధనంవల్ల పేరు ప్రఖ్యాతులు కలుగుతున్నాయి. ఎందుకంటే- అది పరిశ్రమకూ, కార్యశూరతకూ ఫలితం. ప్రాచీన కాలంలోకూడ ధనానికి గౌరవం ఇచ్చేవారు. అయితే ధనాన్ని అన్యాయంగా సంపాదించవచ్చనే ఆలోచన సైతం వచ్చేది కాదు. అక్రమ సంపాదననూ, అక్రమంగా సంపాదించేవారినీ విషసర్పాలుగా పరిగణించి ఏవగించుకునేవారు. మరొకరి అన్నం తినేముందు, సహాయం అడిగేముందు, దాన మడిగేముందు లక్షసార్లు ఆలోచించేవారు. ఒక వ్యక్తి అక్రమంగా సంపాదించలేదని ధృవపరచుకున్న తర్వాతనే ఆ వ్యక్తిని సహాయం అడిగేవారు. ఒక వ్యక్తి అక్రమంగా ఆర్జించాడనే అనుమానం కలిగితే- అతడు లక్షాధికారి అయినా, ప్రతివాడూ అతడిని అసహ్యించుకునేవాడు. ఫలితంగా సంపద ఆ ధనవంతునికి కాలపాశమై దుఃఖదాయకం అయ్యేది.

సమాజం ధనాన్ని అలా ఖచ్చితంగా, నీతి ఆధారంగా విలువకట్టేది. కనుకనే-ధనవంతులు తమ వృత్తి వ్యాపారాలను నీతిగా, న్యాయంగా పెంచుకునేవారు. పేరు ప్రతిష్ఠలు గడించేవారు. అంతే కాదు. అలా న్యాయంగా సంపాదించిన ధనం పవిత్ర కార్యాలకు వినియోగించబడినపుడే ఆ వ్యక్తికి గౌరవం లభించేది. ఆ విధంగా- ప్రజాసేవ చేసే సత్పురుషులవలె గౌరవం పొందాలంటే ధనవంతులు తమ ఆదాయ వ్యయాలలో నీతినీ, న్యాయాన్నీ, పవిత్రతనూ పాటించవలసి వచ్చేది.

ఇలా- ఎంత ధనం సంపాదించాడు అన్నది కాక ఆ ధనాన్ని ఎలా సంపాదించాడు, ఎలా ఖర్చు పెట్టాడు అన్నదే దాన్ని విలువకట్టడానికి గీటురాయిగా ఉండేది. కానీ, నేడు సంపాదన, ఖర్చుల తీరుతెన్నులు ఎవరికీ పట్టడం లేదు. వ్యక్తి వద్ద ధనం ఎంత ఉన్నదని మాత్రమే చూస్తున్నారు. ఇలా కొలబద్ద తలక్రిందులు అయింది. ఆ కొలబద్దతో కొలిచినందువల్ల కలిగే ఫలితాలూ తలక్రిందులు అయ్యాయి.

విశాలమైన భవంతి, కారు, ఎయిర్ కండిషనర్, టివి, వి.సి.ఆర్, మొబైల్ ఫోన్ మున్నగు ఖరీదైన వస్తువులు చూసి, వినోద సాధనాలు చూసి, వాటిని కలిగి ఉన్న వ్యక్తిని గౌరవించడం మొదలుపెట్టారు. త్యాగం, తపస్సు, సాధన, సేవ, శ్రమ, కార్యశూరతలు ఆధారంగా లభించే మాన మర్యాదలు ఇంత చౌకగా, ఇంత సులువుగా దొరుకుతూ ఉంటే-సంయమనం, సాధన, సేవ, త్యాగం మున్నగువాటి జోలికిపోయే అమాయకుడు ఎవడు ఉంటాడు? కనుక- డబ్బే ప్రధానమనే గ్రుడ్డితనం పెరిగిపోతోంది.

వాతావరణం ఇలా తయారుకావడంతో- ధనాన్ని దుబారా చేయడంకూడ గౌరవప్రదం అవుతోంది. భోగ విలాసాలలో మునిగిపోవడం, మద్యం సేవించడం, ఫ్యాషన్లపై విపరీతంగా మోజుపెంచుకోవడం, వివాహాలలో ఆడంబరాలు, అట్టహాసాలు, పెద్దపెద్ద విందులలో డబ్బును మంచినీళ్లలా ఖర్చుచేయడం- ఇవన్నీ గౌరవప్రదాలుగా పరిగణించబడుతున్నాయి. ఇలా గీటురాళ్ల స్థాయి, కొలబద్దల స్థాయి పడిపోవడంతో సమాజంలో విలువలు పతనం అవుతున్నాయి. ఎలాగోలా డబ్బు సంపాదించాలనే ధోరణి పెరిగిపోతోంది.

కనుక- ఒక వ్యక్తి సిరి సంపదలను, భోగ భాగ్యాలను

**సాధన అనే ఎరువు పెడితేనే ఉపాసన ఫలిస్తుంది.**

విలువ కట్టేముందు ఆ సంపద న్యాయంగా ఆర్జించిందా కాదా అని పరీక్షించడం ఆలోచనాపరుడైన ప్రతి వ్యక్తికీ నైతిక కర్తవ్యం అవుతోంది. ఆ వ్యక్తి అనుసరించే విధానాలు, అతడు వినియోగించే సాధనాలు పవిత్రంగా ఉన్నాయో లేదో పరిశోధించడం అవసరం. అలా చేస్తే, చెడ్డ పనులను విలువకట్టడంలో పొరపడే నేరం జరగకుండా నివారించగలుగుతాము.

ఒక వ్యక్తి మోసం, చీకటి బజారు, విపరీత లాభార్జన, అవినీతి ఆధారాలుగా మేడలమీద మేడలు కడుతున్నాడనీ, బ్యాంకు బ్యాలెన్స్‌లూ, వర్తక వ్యాపారాలూ పెంచుకుంటున్నాడనీ స్పష్టంగా కానవస్తే- అతడికి మన ప్రశంసలూ గౌరవాలూ పొందే అర్హత ఉన్నదా? అతడికి ప్రశంసలూ గౌరవాలూ ఇచ్చే అర్హత మనకున్నదా? ఈ పనులు రెంటిలో ఏ ఒకటి చేసినా మనం అర్హత లేని పని చేస్తున్నాం. సమాజంలో గ్రుడ్డి ఆర్థిక వాదాన్ని పెంచుతున్నాం. అవినీతిని పెంచడంలో సహకరిస్తున్నాం. ఈ పని సామాజికంగా నేరం, ఆధ్యాత్మికంగా పాపం.

నేడు ప్రజలు సంపన్నతకు విలువ ఇవ్వడం మానివేసి, సాధనాలకూ ధన సంపాదనలో పవిత్ర మార్గాలకూ విలువ ఇవ్వడం ప్రారంభిస్తే- సమాజంలో వ్యాపించి ఉన్న అవినీతి తగ్గుతుంది. అక్రమంగా సంపాదించినవారి పరువు ప్రతిష్టలు తగ్గితే, ఆ అక్రమ సంపాదన తీవ్ర నిందకు గురయితే- ప్రజలు అవసరాన్ని మించి సంపాదించే కోరికను వదులుకుంటారు. తమ గౌరవాన్ని కాపాడుకోవడం కోసం సంపాదనకు సముచితమూ, సక్రమమూ అయిన మార్గాలను అవలంబించితీరుతారు.

ఆర్థిక రంగంలో వలెనే మత-ఆధ్యాత్మిక రంగంలో కూడ విలువకట్టే గీటురాళ్లు నకిలీగా తయారయ్యాయి. నేడు రంగంలో శ్రేష్ఠ వ్యక్తిత్వంకాక వక్తృత్వ చతురత గీటురాయిగా మారుతోంది. మాటల గారడీతో జనాన్ని మైమరపించేవారికి పెద్దపీట వేస్తున్నారు. నిజమైన సంత్‌ల సూటి మాటలూ నగ్న సత్యాలూ ఉపేక్షకు గురవుతున్నాయి. సాదాతనం, నిరాడంబరత్వం ఈ రంగంలో గీటురాళ్లు కాకపోతూ ఉండడం నేటి పరమ దౌర్భాగ్యం. సాధారణంగా- భౌతికత్వపు రంగు పులుముకుంటేనే కాని సంత్‌లకు గుర్తింపు రాని ఒక విచిత్ర పరిస్థితి నేడు కానవస్తోంది. ఈ భౌతికత్వమే విలువకట్టే గీటురాయి అవుతోంది. నేటి భౌతిక యుగంలో ఎద్దుల బండి రవాణా సాధనం కాజాలదన్నమాట నిజమే. కాలగతితో పాటు మనమూ పోవాలి. లేకపోతే మనం వెనుకబడిపోతాం. అదీ నిజమే. ఇలా కారూ, కంప్యూటరూ నేడు ఆవశ్యక సాధనాలలో చేరాయి. కనుక ఇవి ఆధారంగా మతరంగాన్ని విలువకట్టకూడదు. ఎవరి వ్యక్తిత్వం ఉన్నతోన్నతంగా ఉంది, ఎవరిలో ధార్మికతపట్ల నిజమైన శ్రద్ధ ఉంది- అని మనం పరిశీలించాలి. అలా చేయకపోతే మనం మతాన్నీ అర్థం చేసుకోలేము, మత పెద్దలనూ అర్థం చేసుకోలేము.

మతానికి ప్రాణం పోసేవి వ్యక్తిత్వంలోని సదాచారం, సజ్జనత్వములే కాని వ్యవహారకుశలతా, బాహ్య ఆడంబరం కావు. అంతరంగాన్ని ఎంతగా సంస్కరించుకుంటే అంత గొప్పవాడుగా వ్యక్తి పరిగణించబడాలి. సజ్జనత్వం ఇస్తూన్న పిలుపు ఇది. మత రంగంలో సంత్‌లుగా గౌరవించబడడానికి ఇదే గీటురాయి కావాలి. ఇది ఆధారంగానే వ్యక్తిత్వాన్ని విలువకట్టాలి. కానీ, దురదృష్టమేమంటే - మూఢ విశ్వాసాలవల్ల, గ్రుడ్డి నమ్మకాలవల్ల, విలువకట్టడంలో నకిలీ గీటురాళ్లు వాడుతూ ఉండడంవల్ల ప్రజలు ఏది శ్రేయస్కరమో, ఏది కాదో గుర్తించలేకపోతున్నారు. కనుక ప్రజా జీవనంలో వివేక దృష్టి మేలుకొనాలి. విలువకట్టడంలో ప్రజలు వాడే గీటురాళ్లు సరైనవిగా ఉండాలి. అప్పుడే అవినీతి అదుపులోకి వస్తుంది. ఆర్థిక రంగంలోనూ, మత రంగంలోనూ పరీక్షించడానికి సరైన గీటురాయి వ్యక్తిత్వంలో మాటకూ చేతకూ పొంతన ఉండడం. జన మానసం ఈ వాస్తవాన్ని జీర్ణం చేసుకున్ననాడు, అందుకు అనుగుణంగా ఆచరణ జరిగిననాడు సంస్కరణ ప్రారంభంకావడం ఖాయం.

★ ★ ★

## 'నా ఆత్మే నా గురువు'

డెన్మార్క్‌కు చెందిన శిల్పకళయందు ప్రవీణుడైన యోవార్డసన్ ఆ కాలంలో అద్వితీయుడైన కళాకారుడు. ఆయనను మిత్రమండలి ఒకనాడు - నీవు ఏ గురువు వద్ద విద్య నేర్చుకొన్నావు? ఏ విద్యాలయంలో పట్టా పొందావు అని ప్రశ్నించింది. దానికి ఆయన "ఆత్మే నా గురువు, నా ఆత్మ పరిష్కారమే నా విద్యాలయము. నేను ఎల్లప్పుడూ నా కళాఖండాలలో లోట్లు, పొరపాట్లు వెదుక్కొంటూ వాటిని చక్కబరుచుకొంటూ, అంతకంటె ఎక్కువ ఉపయోగకరమైన ఆలోచనలు దృష్టిపథంలోకి రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వాటిని అమలుపరుస్తూ ఉండేవాడిని. ఈ విధంగా నేనే కాదు ఎవ్వరైనాసరే, సాఫల్య శిఖరాల చివరి అంచుల్ని అవలీలగా చేరుకోవచ్చు"నని బదులు పల్కుతాడు.

- ప్రజ్ఞాపురాణంనుండి.

**శ్రమ, ఆత్మవిశ్వాసం పరస్పర పూరకాలు.**

భాగవత బోధ

# కర్మఫల వ్యవస్థ తిరుగులేనిది - 1

మహాభారత యుద్ధంలో కృష్ణ భగవానుని మేనల్లుడూ, వీర యువకుడూ అయిన అభిమన్యుణ్ణి అన్యాయంగా వధిస్తారు. పాండవ పక్షమంతా శోక సాగరంలో మునిగిపోయింది. కృష్ణ భగవానుడూ, అర్జునుడూ సంసప్తకులతో యుద్ధం చేయడానికి వెళ్లి తిరిగివచ్చారు. అభిమన్యుని తల్లి శ్రీకృష్ణుణ్ణి ఇలా అడిగింది– నీవు స్వయంగా భగవంతుడివి. నీవు జీవించి ఉండగానే నీకు ప్రాణప్రియుడైన నీ మేనల్లుడు చంపబడ్డాడు. నీవు దాన్ని ఆపలేకపోయావు. నీవు ఎందుకిలా చేశావు?

కృష్ణ భగవానుడు సుభద్రకు ఇలా నచ్చజెప్పాడు– నేను స్వయంగా భగవంతుడినే. కాని కర్మఫల వ్యవస్థలో నేను ఎలాంటి జోక్యమూ చేయలేను.

మరి ఆ కర్మఫల వ్యవస్థ ఏమిటి?

ఈ సృష్టి చేసిన తర్వాత ఈ విశాల బ్రహ్మాండం సూత్రబద్ధంగా నడవడం కోసం భగవంతుడు కొన్ని నియమాలూ, నిబంధనలూ ఏర్పాటుచేశాడు. కర్మను అనుసరించి ఫలం లభించే శాశ్వత సిద్ధాంతాన్ని అమలు చేశాడు. ఈ వ్యవస్థ ఎంత తిరుగులేనిదంటే– భగవానుడు సైతం దీనిని స్వయంగా గౌరవిస్తాడు. ఒక నియమాన్ని ఏర్పరచినవాడే దానిని పాటిస్తే, ఆ నియమం ఆదర్శ నియమం అవుతుంది. ఈ నియమాన్ని అమలుచేయడానికై భగవానుడే స్వయంగా న్యాయమూర్తి పదవిని స్వీకరించాడు. సృష్టి అంతమయ్యేవరకూ ఇది ఖచ్చితంగా అమలు జరుగుతుంది.

భాగవతంలో కృష్ణ భగవానుడు తన ప్రియ సఖుడు ఉద్ధవునికి ఈ వ్యవస్థ గురించి ఇలా వివరించాడు– ఈ జగత్తు అంతా కర్మతోనూ, దాని సంస్కారాలతోనూ కూడి ఉంది. నేనే కాలంగా కర్మలను అనుసరించి వాటి ఫలాలు అందే ఏర్పాటు చేస్తున్నాను. ఈ గుణ ప్రవాహంలో పడి జీవుడు ఒకోసారి మునుగుతాడు. ఒకోసారి తేలుతాడు. ఒకోసారి అతడికి అధోగతి కలుగుతుంది. ఒకోసారి పుణ్యగతి, ఉచ్చగతి కలుగుతుంది.

నేనే కాలాన్ని– అని భగవానుడు ఇక్కడ చెపుతున్నాడు. కాలం అంటే సమయం. విత్తనం నాటిన వెనువెంటనే పండ్లు కాయవు. అలాగే– కర్మకు ఫలం వెనువెంటనే లభించదు. దాని అర్థం– కర్మల ఫలితం సమాప్తం అయిందని కాదు. సమయాన్ని అనుసరించి మనం మన కర్మల ఫలితాలను తప్పక అనుభవించవలసిందే. ఎందువల్ల? చిన్నచిన్న దేశాలకయినా రాజ్యాంగాలు, పాలనా వ్యవస్థలూ ఉండవలసిందేకదా. అవి లేకుంటే అరాజకమే కదా. మరి ఇంత విశాలమైన బ్రహ్మాండం నియమావళి లేకుండా అనుశాసనం లేకుండా ఎలా నడుస్తుంది? పై సందర్భంలో శ్రీకృష్ణుడు ఉద్ధవునితో ఇలా అన్నాడు– ప్రజలు కర్మలు చేసేటపుడు విచ్చలవిడిగా ప్రవర్తించకుండా ఉండేందుకే, నియమాలను అతిక్రమించకండా ఉండేందుకే నేను దేశం, కాలం, ఫలం, నిమిత్తం, అధికారి, యోగ్యుడు మున్నగువాని గుణ దోషాల ఏర్పాటు చేశాను.

ఇంతటి దృఢమైన వ్యవస్థ ఉన్నప్పటికీ, కొంత ఆలస్యంగా శిక్ష లభించడంవల్ల ఇంతటి అవ్యవస్థ వ్యాపించి ఉన్నపుడు– అసలు శిక్షయే లేకుంటే ఈ ప్రపంచం సాగనే సాగదు. కనుకనే– జీవులు ఈ సృష్టిలోని అందాన్ని ఆస్వాదించడానికై భగవంతుడు కర్మఫల వ్యవస్థను ఏర్పాటుచేశాడు. ఈ నియమాలను అర్థం చేసుకుని వీటిని సక్రమంగా పాటిస్తే మనం ఇహ పర సుఖాలను పొందవచ్చు. కానీ, తాత్కాలిక ప్రయోజనాల వ్యామోహంలో పడి తెలిసికూడా దుష్కర్మ చేసి, ఏవో చిన్నచిన్న కర్మకాండల ద్వారా ఈ శిక్షా విధానాన్ని తప్పించుకోవచ్చునని అనుకుంటాం. మరి ఇది సాధ్యమా? కానే కాదు. భగవంతుడు కరుణామయుడు మాత్రమే కాదు. కాల స్వరూపుడు. భాగవతంలో కపిల మహర్షి దేవహూతికి కాలాన్ని గురించి ఇలా చెప్పాడు– కాలానికి మిత్రులూ లేరు. శత్రువులూ లేరు. బంధువులూ లేరు. అది ఎప్పుడూ మెలకువతో ఉంటుంది. తమ భగవత్ స్వరూపాన్ని మరచి భోగంలో మునిగే పొరపాటు చేసే ప్రాణులపై దాడిచేసి వాటిని సంహరిస్తుంది.

భగవంతుని ఈ వ్యవస్థ మేలుకున్నదీ, సమర్థమైనదీ, మమకారం లేనిదీ, పక్షపాతం లేనిదీ. కనుక మనం ఈ పొరపాటు చేయకూడదు. కర్మఫలం విలువను గుర్తించాలి. దాని వెలుగులో మన కర్మలను పునర్విమర్శ చేసుకోవాలి. ఇది తప్ప మరో దారి లేదు. మన మెడమీద సన్నటి దారంనుండి మృత్యువనే కత్తి వ్రేలాడుతోంది. మన దుష్కర్మలకు పూర్తిగా మనమే బాధ్యులము. వాటికి శిక్ష మనం అనుభవించితీరాలి. సమయం ఉండగానే మనం మేలుకోవాలి. సమయం దాటిపోతే మనకు పశ్చాత్తాపం తప్ప మరేదీ మిగలదు. నీరు ప్రవహించిపోయిన తర్వాత వారధి కట్టి

ప్రశంస ఒకవిధమైన ప్రోత్సాహం.

ప్రయోజనం ఏముంది? భగవంతుడి కన్ను కప్పగలమని అనుకోవడం పొరపాటు. భాగవతంలో యమదూతలు, విష్ణుదూతల వర్ణనలో ఇలా ఉంది: జీవుడు శరీరంతో, మనః ప్రవృత్తులతో చేసే అన్ని కర్మలకూ ఆకాశం, వాయువు, ఇంద్రియాలు, చంద్రుడు, సంధ్య, రాత్రింబవళ్లు, సాక్షులు. సూర్యుడు, అగ్ని, దిక్కులు, జలము, పృథివి, కాలము, ధర్మము– ఇవి అధర్మాన్ని కనుగొంటాయి. ఎవరు శిక్షకు పాత్రులో నిర్ణయం జరుగుతుంది. పాప కర్మలు చేసేవారందరూ తమ తమ కర్మలకు అనుగుణంగా శిక్షార్హులు అవుతారు.

ఎంత బలీయమైనది ఈ వ్యవస్థ! ఇందరు సాక్షులు ఉండగా మనం నేరం చేయలేదని చెప్పగలమా? ఒక వేళ చెప్పినా– శిక్షా వ్యవస్థనుండి తప్పించుకోగలమా? మనం ఏ ఇంద్రియాలతో దుష్కర్మ చేస్తామో, అవే మనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి సిద్ధపడినప్పుడు మనం ఎలా తప్పించుకోగలుగుతాము? ఈ సాక్షులన్నిటి మీదా తమ ఆధిపత్యాన్ని స్థాపించుకున్న శక్తిమంతులు ఎందరో గతంలో ఉన్నారు. అవన్నీ వారి కనుసన్నలలో మెలిగాయి. మరి ఇంతటి శక్తిమంతులుకూడా కర్మఫల అనుభవంనుండి తప్పించుకోగలిగారా? కర్మఫల అనుభవంనుండి ఏ ఒక్కరూ తప్పించుకోలేకపోయారని చరిత్రా, శాస్త్రాలూ ఘోషిస్తున్నాయి. భవిష్య పురాణంలో మనకు తెలిసిన చరిత్రలో అందరికన్నా శక్తిమంతుడైన రావణుని గురించి శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు– రావణునికి దుర్గం త్రికూటం. అగడ్త సముద్రం. రాక్షసులు సైనికులు. కుబేరుని వైభవం అతడి ధనం. అతడి విధానం శుక్రాచార్యుడు నిర్దేశించినది. అలాంటి రావణుడు సైతం కర్మ ఫలానికి లొంగి నాశనం అయినాడు.

కాలాన్ని సైతం కట్టిపడవేసినట్లు భ్రాంతి పొందిన రావణుని వంటివాడే కర్మ ఫలంనుండి తప్పించుకోలేకపోతే– మన లాంటి వాళ్లం తప్పించుకోగలమా? తామే భగవంతులమని చెప్పుకున్న మహాబలశాలుల ఉదాహరణలు మన శాస్త్రాలలో కోకొల్లలుగా ఉన్నాయి. వేనుడు, నహుషుడు, హిరణ్యకశిపుడు, సహస్ర బాహువు వంటి ఎందరో వ్యక్తుల ఉదాహరణలు మన ముందున్నాయి. వారిలో ఏ ఒక్కరికీ కాలం మినహాయింపు ఇవ్వలేదు. పాపాల పాత్ర నిండగానే వారందరూ వడ్డీతోసహా తమ కర్మల ఫలం అనుభవించవలసివచ్చింది. మనకు శిక్ష పడినపుడు ఆ శిక్ష గ్రుడ్డిదని మనం చెపుతాం. అయితే– మన పాప కర్మయే సమయానుగుణంగా శిక్ష రూపంలో వ్యక్తం అవుతుందనీ, ఇతరులు నిమిత్తమాత్రులే అవుతారనీ మనం గుర్తించాలి.

రావణుడు యుద్ధభూమిలో గాయపడి పడి ఉన్నాడు. అతడి శరీరంలోని వేలాది రంధ్రాలనుండి రక్తం ప్రవహిస్తోంది. అప్పుడు లక్ష్మణుడు శ్రీరాముణ్ణి ఇలా అడిగాడు– ప్రభూ! మీరు రావణుని గుండెమీద ఒకే అమ్ము వదిలారు. మరి ఇన్ని వేల గాయాలు ఎలా అయ్యాయి? శ్రీరాముడు ఇలా జవాబు చెప్పాడు– లక్ష్మణా! నేను కేవలం నిమిత్తమాత్రుణ్ణి. అతడి దుష్కర్మలే అతడి శరీరాన్ని చీల్చుకుని వెలికివచ్చాయి.

భాగవతంలో కంస వధ తర్వాత ఉద్ధవుడు ప్రశ్నించినపుడు నందుడు ఇలా అన్నాడు– తన పాపాల ఫలితంగా కంసుడు తన అనుచరులతో పాటు మరణించడం మంచిదే అయింది. పరమ ధార్మిక స్వభావం కలిగిన యదువంశీయులను అతడు సదా ద్వేషిస్తూ వచ్చాడు.

శ్రీకృష్ణుడు కంసుణ్ణి వధించాడని మనం చెప్పవచ్చు. కానీ, కంసుడు తన పాపాలవల్లనే చనిపోయాడని నందునివంటి తత్వవేత్త చెపుతాడు.

ఈ సంఘటనలనుండి మనం గుణపాఠం నేర్చుకోగలమా? అసలు ఈ పాపం, దుష్కర్మ ఏమిటి? రాగ ద్వేషాలు అనే ప్రవృత్తులు రెండూ మనచేత పాపాలు చేయిస్తాయి. మన కర్మల ద్వారా ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఆటంకం ఏదీ కలుగకపోతే మనలోని ఈ ప్రవృత్తులు పెరుగుతూనే ఉంటాయి. సత్పురుషులు మనకు అవరోధాలుగా కనబడడం సహజమే. మనం వారిని నాశనం చేయడానికి ప్రయత్నించడమూ సహజమే. సత్పురుషులు రాగ ద్వేషాలవల్ల ప్రభావితులు కాకుండా మన మేలు కోరే సలహా ఇస్తూ ఉంటారు. కానీ, మన దృక్పథం దోషపూరితంగా ఉండడంవల్ల మనం వారిని శత్రువులుగా పరిగణిస్తాం.

దేవకీ వసుదేవుల వివాహం జరిగింది. ఆ తర్వాత కంసుడు దేవకిని చంపడానికి సిద్ధపడ్డాడు. అప్పుడు వసుదేవుడు కంసునితో ఇలా అన్నాడు– సోదరా! నీతిబాహ్యమైన మార్గం ఆ మార్గాన్ని అనుసరించే వ్యక్తికికూడా దుఃఖం కలిగిస్తుంది. కనుక, తన శ్రేయస్సును కోరుకునే వ్యక్తి ఎవరికీ ద్రోహం చేయకూడదు. ఎందుకంటే– జీవుడు కర్మకు అధీనం అయిపోయాడు. ఇతరులకు ద్రోహంచేసే వ్యక్తి ఈ జీవితంలో శత్రువులకూ, మరణం తర్వాత పరలోకానికీ భయపడక తప్పదు.

కంసుడు అప్పటికి దేవకిని వదిలిపెట్టాడు. మరి, అతడి పాప ప్రవృత్తి మారిందా? అతడు మరిన్ని ఘోర పాపాలు చేయసాగాడు. అతడి దుష్కర్మల వల్ల భూగోళమంతా విలవిలలాడి పోయింది. అతడు ఇతరులను బాధపెట్టాడు. తనకూ మనశ్శాంతి లేకుండా చేసుకున్నాడు. అసూయ, చింత, విద్వేషాల అగ్నిలో

**పరమాత్మను విగ్రహరూపంలోకాక జ్ఞానరూపంలో స్వీకరించాలి.**

కుతకుతలాడాడు. మనిషి హృదయంలో జనించిన ద్వేషం మొదట అతడినే కాల్చుతుంది. వసుదేవుడూ, ఇతర సత్పురుషులూ ఇచ్చిన సలహా పాటించి ఉంటే, కంసుడు తాను సుఖ శాంతులు అనుభవించి ఉండేవాడు. ఇతరులకు సుఖశాంతులు ఇవ్వగలిగేవాడు.

మనం అహంకారంతో, తాత్కాలిక లాభ వాంఛతో ఇతరులను బాధించి సుఖ శాంతులు పొందాలని కోరతాము. మరి అది సాధ్యమా? కర్మఫల సిద్ధాంతం ప్రకారం– మనం ఏ విత్తనం నాటితే మనకు ఆ పండు లభిస్తుంది. తుమ్మ విత్తనం నాటి మామిడి పండు పొందాలని ఆశించడం వ్యర్థం. అది అసాధ్యమైన విషయం. మన దుష్కర్మల ఫలితం మనల్ని సవాలు చేసినప్పుడు మనం ఇతరులమీద నింద మోపుతాం. భీముని గదవల్ల గాయపడిన దుర్యోధనుని విమర్శలకు సమాధానం చెపుతూ శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు– నీ ప్రేరణవల్ల పలువురు యోధులు కలసి యువకుడైన అభిమన్యుణ్ణి చంపారు. ఇలాంటి అనేక కారణాలవల్ల నీవు ఇప్పుడు యుద్ధభూమిలో చంపబడుతున్నావు.

మన పాపాల ఫలితం మన అనుభవంలోకి రానంతవరకూ మనం హాయిగా ఉంటాము. మనంత గొప్పవాళ్లు లేరని విర్రవీగుతాము. కర్మఫల సిద్ధాంతం పొరపాటైనదనీ, మనం వ్యవస్థ కన్నుకప్పామనీ చంకలు కొట్టుకుంటాము. కాని ఆ దర్పం ఎంతోకాలం నిలువదు. మన దుష్కర్మలకు శిక్ష లభించినపుడు మనం నీరుగారిపోతాం. ఇతరులపై నింద వేసి మనల్ని నిర్దోషులుగా నిరూపించుకోవడానికి తంటాలు పడతాము. ఈ ప్రయత్నం ఎంతటి హాస్యాస్పదం! దుర్యోధనుడుకూడా అలాగే ప్రయత్నించాడు. కానీ, శ్రీకృష్ణుడు అతడి మోసాన్ని బట్టబయలు చేశాడు. మాటల గారడీవల్ల మనల్ని మనం కాపాడుకోలేమని మనం గ్రహించాలి.

బృందావనంలో కాళియ సర్పంకూడ ఇలాగే దుర్మార్గాలు చేసింది. శ్రీకృష్ణుడు దానికి శిక్ష వేశాడు. అపుడు ఆయనను స్తుతిస్తూ దాని భార్యలు ఇలా అన్నారు– ప్రభూ! దుష్టులను శిక్షించడానికే మీరు అవతారం ధరించారు. కనుక ఈ అపరాధికి శిక్ష విధించడం పూర్తిగా సముచితం. మీ దృష్టిలో శత్రువుకూ,మిత్రునికీ తేడా లేదు. కనుక– మీరు ఒక వ్యక్తికి విధించే శిక్ష అతడి పాపాలకు ప్రాయశ్చిత్తం చేయడానికీ, అతడి శ్రేయస్సు కోసమే.

'జీవించు, జీవించనివ్వు'– అనే సిద్ధాంతాన్ని మనం అనుసరించాలని భగవంతుడు కోరతాడు. కానీ, వ్యామోహంతో ఈ వ్యవస్థను ఉల్లంఘించి మనం ఇతరులకు పతనాన్నీ, బాధనూ కలిగించినప్పుడు– ఈ సృష్టి వ్యవస్థలో సమతూకం స్థాపించడానికై భగవంతుడు అవతరిస్తాడు. ఆ అవతార కార్యాలలో దుష్టులను శిక్షించడం ఒక ప్రముఖ విషయం. దీని వెనుక భగవంతుని దురాలోచన లేదు. సదాలోచనే పని చేస్తుంది. భగవంతుని హృదయంలో తల్లి హృదయంలోని మమత ఉంది. పిల్లలంతా ఈ అందమైన సృష్టిలో సుఖ శాంతులతో ఆనందించాలని ఆయన కోరతాడు. తన పిల్లవాడి శరీరంలో పెరుగుతూన్న కురుపులను నిర్దాక్షిణ్యంగా కోయించి తల్లి అతడి భవిష్యత్తును సుఖమయం చేస్తుంది. అదే విధంగా– భగవంతుడు కూడ తన పిల్లల మంచికోసమే శిక్ష విధిస్తాడు. మనం దుష్కర్మలను వదలి సత్కర్మలను చేయాలన్నదే దాని ఉద్దేశ్యం. దుష్కర్మల ఫలితం ఎంత దారుణంగా ఉంటుందంటే, మనం ఈ జీవితంలోనే నరక యాతనలు అనుభవించవలసివస్తుంది. స్వర్గ నరకాల కోసం ఇతర లోకాలకు వెళ్లవలసిన అవసరం లేదు. సత్కర్మల ఫలితం స్వర్గంగా, దుష్కర్మల ఫలితం నరకంగా మనకు ఈ జీవితంలోనే లభిస్తుంది. కపిల మహర్షి దేవమాత దేవహూతితో ఇలా చెపుతాడు– మాతృమూర్తీ! స్వర్గ నరకాలు ఈ లోకంలోనే ఉన్నాయని చెపుతారు. ఎందుకంటే– నరక యాతనలను ఈ లోకంలోకూడ చూస్తాము.

(ముగింపు వచ్చే సంచికలో)

## కొలంబస్ సాహసం

సముద్రం ఆసియా యొక్క ఒక వేయిమైళ్ల సరిహద్దు వరకు వ్యాపించినట్లు అంచనా వేయబడింది. ఆ రోజుల్లో సముద్రం ఎల్లలు లేనిదిగా భావించబడేది. 18 సం॥ కొలంబస్ యొక్క అన్వేషణ ఆనాడు అమెరికా వరకు చేరుకొన్నది. కానీ ఒంటరిగా ఏమి చేయగలడు. ఎవరో ఒకరి సహకారం కావాలి. పోర్చుగీసువారు మంచి మాటలు చెప్పి దాని నమూనాను అపహరించారు. ఇలాంటి విపత్తులను తెలివితేటలతో పరిష్కరించుకొంటూ ఎలాగైతేనేమి కొలంబస్ అమెరికాను కనుగొన్నాడు. అక్కడకు ఏదో విధంగా చేరాలని గట్టిగా సంకల్పించుకొన్నాడు. అందువలన అడుగడుగునా విపత్తులే ఎదురైనా మహా సంకల్పం ఆగలేదు. చిట్టచివరకు ఆ మహాద్వీపాన్ని చేరటానికి, తిరిగిరావటానికి తగిన మార్గాన్ని కొలంబస్ వెదకి పట్టుకొన్నాడు. ఈవిధంగా మొట్టమొదటి అన్వేషకుడిగా కొలంబస్ శాశ్వతంగా నిలిచిపోయాడు. సాహసవంతులు, బుద్ధికుశలురు అయిన వ్యక్తుల అన్వేషణ సదా, సర్వదా కొనియాడబడేదిగానే ఉంటుంది.

\- ప్రజ్ఞాపురాణం నుండి

**తనను తాను కోపగించుకునే వ్యక్తి ఇతరుల కోపం నుండి తప్పించు కుంటాడు.**

# ఆధ్యాత్మికతకు ఆటపట్టు భారతవర్షం

ప్రారంభంనుండీ భారతవర్షపు మూల స్వరూపం సాంస్కృతికమే. దానికి ప్రేరణ కేంద్రం రాజనీతికాక, ఆధ్యాత్మికత– నైతికత. ధర్మం మన జాతి కణ కణంలో వ్యాపించి ఉన్నది. కనుకనే, భారతీయ జాతీయవాదం ఆధ్యాత్మిక జాతీయవాదమే. ఈ కారణం వల్లనే మన మహర్షులు భారతభూమిని మాతగా కీర్తించారు. నియమబద్ధంగా దానికి వందనం చేయాలనే ప్రేరణ ఇచ్చారు. "మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః"– అన్నారు మన మహర్షులు. ఆ మహర్షులు బ్రహ్మజ్ఞానాన్ని పొందారు. బ్రహ్మ సాక్షాత్కారం సాధించారు. విశ్వాన్ని కుటుంబంగా పరిగణించే మహోదాత్తమైన భావన ఈ భూమినుండే ఉదయించింది. రాష్ట్ర ప్రజలు తమ తమ సమర్పణలను, త్యాగాలను, ఆహుతులను రాష్ట్ర భూమికి అర్పిస్తారు. కనుక– రాష్ట్ర భూమి, రాష్ట్ర ప్రజలు కలిసి రాష్ట్రం ఏర్పడింది. (రాష్ట్ర అనగా ఇచ్చుట). వ్యష్టి సమష్టికి సమర్పణ కావడమే రాష్ట్రమని స్వామి వివేకానంద రాష్ట్ర శబ్దాన్ని వ్యాఖ్యానించారు. ఆధ్యాత్మిక రాష్ట్రీయతను (జాతీయతను) ప్రబోధించిన శ్రీ అరవిందులు ఇలా అన్నారు–

"రాష్ట్రం మన జన్మభూమి. అది కేవల భూభాగం కాదు. వట్టి పేరు కాదు. కపోల కల్పన కాదు. అది ఒక విరాట్ శక్తి. జాతిలోని లక్షలాది ప్రజల శక్తుల సమ్మేళనం."

శ్రీమాత మాటలలో– "వేలాది దేవతల సమ్మిళిత శక్తినుండి మహిషాసుర మర్దిని భవాని ఆవిర్భవించింది. జాతి (రాష్ట్రం) అలాగే ఆవిర్భవించింది. భవాని ఆదిశక్తి. శాశ్వతం నుండి ఉదయించి ఆ భవాని భారత్ లోపల శాశ్వతంగా నిలచి ఉంది."

మన మాతృభూమి అయిన భారతభూమి హృదయంలో సంస్కృతి సత్యం నినదిస్తోంది. అందులో పరమాత్మ నివాసం ఉన్నది. ఆధ్యాత్మికతతో నిండిన సంస్కృతికి మూలాధారం కావడంవల్ల మన మాతృభూమి అందరికీ పూజ్యురాలు. భారత వర్షమనే పవిత్రయాత్ర సరస్వతి, తృషద్వతి అనే రెండు దేవనదుల మధ్య దేవతలు నిర్మించిన బ్రహ్మావర్తం నుండి ప్రారంభమయిందని మనుస్మృతి చెపుతోంది. సదాచారం, నైతికత, దేవత్వముల వికాసంలో, ప్రసారంలో విశ్వాసం కలిగిన భారతీయ సంస్కృతి ఆధ్యాత్మికతనుండి జనించిందని కూడా మనుస్మృతి చెపుతోంది–

**తస్మిన్ దేశే య ఆధారః పారంపర్య క్రమాగతః।**
**వర్ణానాం సాంతర్కానాం స సదాచార ఉచ్యతే ॥**

బ్రహ్మావర్తం, ఆ తర్వాత కురుక్షేత్రం, మత్స్య పాంచాలాది క్షేత్రాల వరకు దేశం వ్యాపించి ఉన్నదని మనుస్మృతిలోని తర్వాతి శ్లోకం వర్ణిస్తోంది. ఆ కారణంగా ఆ క్షేత్రం బ్రహ్మర్షి దేశంగా పిలువబడింది. అది మానవాళి అంతకూ ఆదర్శంగా నిలిచింది.

మనుస్మృతి ఇలా చెపుతోంది–

**ఏతద్దేశ ప్రసూతస్య సకాశాద్ అగ్రజన్మనః ।**
**స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః ॥**

అనగా– ప్రపంచంలోని మానవులందరూ ఈ దేశంలోని అగ్రజన్ములనుండి పాఠాలు నేర్చుకుని తమ తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలి.

ఈ బ్రహ్మర్షి దేశం హిమాలయాలనుండి వింధ్య పర్వతాలవరకు వ్యాపించింది. మధ్యదేశంగా పరిచితమైన ఈ దేశం ఆ తర్వాత ఆర్యావర్తం అయింది. ఈ ఆర్యావర్తానికి ఉత్తరాన ఉత్తుంగ హిమాలయాలు, దక్షిణాన నర్మదా, కృష్ణా, కావేరీ నదులు ఉన్నాయి. తూర్పు పడమరలలో విశాల సాగరం ఉంది.

హిమాలయాలనుండి కన్యాకుమారి వరకు గల అఖండ భారత వర్ణన త్రిపిటకంలోని భాగమైన 'మహాగోవింద సుత్త'లో ఉంది. దీనిని 'పృథ్వి'గా అది పేర్కొంది. కూర్మంగానూ, ఎక్కుపెట్టిన బాణంగానూ పురాణాలు భారతవర్షాన్ని చిత్రించాయి.

భారతభూమిలోని కణ కణం దివ్యమైనది, పవిత్రమైనది. శివభక్తులు కాశీనుండి రామేశ్వరం వరకు తీర్థయాత్ర చేస్తారు. వైష్ణవులు దేశం నలుమూలలకూ తీర్థయాత్ర చేస్తారు. గోముఖంలో పుట్టిన గంగానది జలాన్ని రామేశ్వరంలోని శివునికి అభిషేకం చేయడం ఒక సంప్రదాయం. జగద్గురు శంకరాచార్యులు సాంస్కృతిక అఖండత్వాన్ని బలపరచడానికై దేశం నాలుగు సరిహద్దుల్లో నాలుగు తీర్థాలను నిర్మాణం చేశారు.

అథర్వవేదంలోని పృథ్వీసూక్తం ప్రపంచంలోని మొట్టమొదటి జాతీయగీతం. మాతృభూమి స్వరూపం, దాని వైవిధ్యంలో ఇమిడి ఉన్న ఏకత్వం ఎంతో సూక్ష్మంగా గానం చేయబడ్డాయి ఆ సూక్తంలో. విశ్వమానవ కళ్యాణానికై సమర్పితమైన ఈ సూక్తం ఒక విశ్వగీతం. వ్యక్తిని మతం, వర్గం, కులం ఆధారాలుగా కాక భూమికి పుత్రుని రూపంలో పరిచయం చేసింది ఈ సూక్తం–

**అభివ్యక్తి అంతఃకరణ స్వరూపాన్ని వెల్లడిస్తుంది.**

**సానః మాతా భూమి । భూమే మాతాః ।**
**న థోహి మా భద్రయా సుప్రతిష్ఠితమ్ ।**
**మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః ॥**

"మాతరం భూమి ధర్మాణా ధృతామ్" అనే వేద సందేశం ప్రకారం ఇది మన ధర్మభూమి. సత్కర్మలకు ప్రేరణ ఇచ్చే కర్మభూమి. మనిషికి భగవత్ దర్శనం చేయించి, అతడి జీవితాన్ని సార్థకం చేసే మోక్షభూమి. భారత భూమిలోని ఈ గొప్పతనాన్ని స్వామి వివేకానంద ఇలా ఉద్ఘాటించారు-

"ఈ పృథివిలో శుభాన్ని ప్రసాదించే పుణ్యభూమి ఏదైనా ఉంటే, పరమేశ్వర ప్రాప్తిని వాంఛించే ప్రతి ఆత్మా తన అంతిమ ఆశ్రయ స్థలాన్ని పొందదడంకోసం చేరవలసిన భూమి ఏదైనా ఉంటే- అది భారతభూమియే."

ఈ మాతృభూమి ఏడు మహాశక్తులను కలిగి ఉన్నదని వేదం చెపుతోంది- బృహత్ సత్యం, ఋతం, క్షాత్రశక్తి, దీక్ష, తపస్సు, బ్రహ్మశక్తి, యజ్ఞం.

**సత్యంబృహద్ ఋతముగ్రం దీక్షా తపో,**
**బ్రహ్మ యజ్ఞః పృథివీం ధారయంతి ।**

ఈ మహాశక్తులు ఏడింటి ఆధారంగా జాతిని నిర్మించగలుగుతాం. స్థిరంగా నిలుపగలుగుతాం. జాతిని విశ్వానికి మార్గదర్శకురాలుగా రూపొందించగలుగుతాం.

భారతభూమికి ఆధ్యాత్మికతతో విడదీయరాని సంబంధం ఉన్నది. ఇక్కడ మన పూర్వులు జీవజగత్తు యొక్క బ్రహ్మయొక్క సాక్షాత్కారాన్ని పొందారు. సృష్టిలోని రహస్యాలను వెలికితీసి, ప్రపంచమంతటికీ జ్ఞానభిక్ష పెట్టారు. ఈ తపోభూమి కణ కణం మన పూర్వుల తపోగాథలతో నిండి ఉంది. పవిత్రమైన ఈ కణం మంచి గంధం వంటిది. మన పూర్వుల ఆధ్యాత్మిక సాధన కారణంగా ఈ భూఖండం ఆకర్షణ కేంద్రం అయింది.

మహాభారతంలోని భీష్మపర్వం భారతదేశపు కీర్తి గాథను ఇలా వర్ణించింది-

"ఓ భారతా! నేను ఇపుడు నీకు భారతవర్షపు కీర్తిని వర్ణిస్తున్నాను. అది దేవరాజు ఇంద్రునికి ప్రియమైనది. వైవస్వత మనువుకు ప్రీతిపాత్రమైనది. వేన మహారాజు ప్రేమించినది. ఇక్ష్వాకు మహారాజుకు ఇష్టమైనది. నహుషుని వంటి తేజస్వి తన హృదయంలో దానికి స్థానం ఇచ్చాడు. ముచికుంద సమ్రాట్టు, అంగీరసుడు, శిబి, ఋషభుడు, నృగు మహారాజు పూజించినది. కుశిక మహారాజు, గాధి మహారాజు, దిలీప మహారాజు ప్రాణాలకన్నా మిన్నగా ఆరాధించినది. శక్తిమంతులైన క్షత్రియులు ఎందరో తమ బలిదానాలతో తడిపిన దేశం అది. ప్రజలంతా నిండు మనసుతో ఆరాధించే దేశం అది."

భారతీయ జాతీయవాదాన్ని విష్ణుపురాణం ఇలా వ్యాఖ్యానిస్తోంది-

**ఉత్తరయత్ సముద్రస్య హిమాద్రేశ్చైవ దక్షిణమ్ ।**
**వర్షంతత్ భారతం నామ భారతీ యత్ర సంతతిః ॥**

భారతవర్షం 'విశ్వధాయాః'- ప్రపంచమంతటినీ పోషించే సామర్థ్యం కలది. విష్ణుపురాణం భారతభూమి మహత్తులు ఇలా చాటుతోంది.

**గాయంతి దేవాః కిల గీతి కాని**
**ధన్యాస్తుతే భారత భూమి భాగే ।**
**స్వర్గాపవర్గాస్పదమార్గభూతే భవంతి**
**భూయః పురుషః మురత్వాత్ ॥**

అనగా- దేవతలుకూడ అంటారు: భారత భూమిలో జన్మించినవారు ధన్యులు. పుణ్యం సంపాదించడంకోసం దేవతలుకూడ ఈ పుణ్యభూమిలో జన్మ ఎత్తాలని కోరుకుంటారు.

భగద్గీత ఇలా చెపుతోంది-

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**
**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।**
**ఏం త్రయీధర్మమను ప్రపన్నా**
**గతాగతం కామకామా లభన్తే ॥**

అనగా- స్వర్గంలో పుణ్యం తగ్గిపోయిన తర్వాత మనం ఈ భారతవర్షానికి తిరిగి వస్తాము.

ఇలా ఈ చరిత్ర యాత్రకు ప్రేరణ రాజనీతి కాదనీ, ఇది విశుద్ధమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక యాత్రఅనీ స్పష్టమవుతోంది.

జాతీయత ఒక సామూహిక చేతన అనీ, ఒక భూఖండంలో జీవించిన సమాజం ఒక సుదీర్ఘమైన చారిత్రక ప్రక్రియ ఫలితంగా ఆ భూమిపట్ల మాతాపుత్ర భావనను రూపొందించుకుంటుందనీ నేడు పాశ్చాత్య విద్వాంసులు అంగీకరిస్తున్నారు.

రాష్ట్ర ధర్మం లేనిదే రాష్ట్రం ఏర్పడదనీ, జాతి ధర్మంచేత ధరింపబడుతుందనీ గత శతాబ్దంలో స్వామి రామతీర్థ ప్రవచించారు. తన జాతి అంతటితో తాదాత్మ్య భావం ప్రతి రక్త బిందువులో ప్రవహించనంతవరకు వ్యక్తి పరమాత్మతో తన ఏకత్వాన్ని అనుభూతి పొందజాలడు.

మతం లేనిదే ఒక జాతి నిజమైన ప్రగతిని సాధించజాలదని మహాత్మాగాంధీ ప్రబోధించారు. మన జాతీయతకు ఆధారం

**సరైన సమయంలో సరైన మాట చెప్పగలగడంలో ఉంది వ్యక్తిత్వం.**

సాంస్కృతికం కనుకనే అది ఎన్నెన్నో దురాక్రమణలకు తట్టుకుని అఖండంగా నిలువగలిగింది.

శ్రీ అరవిందులు తమ 'వందేమాతరం' పత్రికలో జాతీయత స్వరూపాన్ని వివరించారు. ఆయన దృష్టిలో- జాతీయత ఒక రాజకీయ కార్యక్రమం కాదు. అది పరమేశ్వర ప్రేరితమైన ధర్మం. జాతీయవాదులం కావాలంటే మనం పూర్తిగా ఆస్తికులమై ధార్మిక భావనను పరిపూర్ణంగా పాటించాలి. వారి మాటలలో- "జాతీయత ఒక ఆధ్యాత్మిక ఆదర్శం. ఒక ధర్మం. ఈ ఆధ్యాత్మిక జాతి లక్షణం- సాధన, తపస్సు, జ్ఞానం, శక్తి." "జాతీయత పరమాత్మనుండి ఉద్భవించిన ఒక ధర్మం. దానిని ఎవ్వరూ అణచి ఉంచలేరు. జాతీయత అమరం. ఎందుకంటే, అది మానవుని సృష్టి కాదు."

ఆధ్యాత్మికత భారతీయ జీవనానికి కీలకం. అనంతమైన జీవన ఆనందపు వర్ణన, ఆ ఆనందంకోసం జరిగిన బృహత్ కృషి ఈ జాతి గతంలో ప్రతిబింబిస్తాయి. ఒకే సత్యానికి అనేక స్వరూపాలను దర్శిస్తూ కూడ వానిలో ఏ స్వరూపానికీ తన ద్వారాలను మూసి ఉంచలేదు మన జాతి. ఈ జాతి తనకు ఒక పేరు పెట్టుకోలేదు. తనలోని మతాలకూ, విభాగాలకూ వేర్వేరు పేర్లు పెట్టలేదు. అది 'బ్రహ్మ' అన్వేషణను కొనసాగిస్తూవచ్చింది.

జాతి నిర్మాణానికి తొలి మంత్రద్రష్ట స్వామి వివేకానంద ఇలా అన్నారు- "మతం ఈ జాతికి శాశ్వత సత్యం. త్యాగం, సర్వస్వ త్యాగం ఈ జాతికి సర్వశ్రేష్ఠమూ, సర్వోన్నతమూ అయిన ఆదర్శం. భారతజాతి ఆధ్యాత్మికమూ, సదాచారవంతమూ, ధార్మికమూ అయిన జాతి. జీవాత్మ, పరమాత్మ, బ్రహ్మాండములపై అపూర్వమూ, అనంతమూ, ఉదాత్తమూ, విస్తృతమూ అయిన ఈ సిద్ధాంతాలలో ఇమిడి ఉన్న మహాతత్త్వం ఈ భారతభూమిలోనే ఆవిర్భవించింది."

యుగ ప్రవక్త స్వామి వివేకానంద ఈ ఆధ్యాత్మిక జాతిపట్ల తమ శ్రద్ధను ఇలా ప్రకటించారు-

ఈ పృథివిపై ధన్యమైన పుణ్యభూమి అని మనం పిలువగలిగిన జాతి ఏదైనా ఉంటే, పృథివిలోని జీవులన్నీ తమ కర్మఫలాన్ని అనుభవించడానికి రావలసిన స్థలం ఏదైనా ఉంటే, భగవంతుణ్ణి చేరుకోవాలనే కృషిలో నిమగ్నులైన జీవులు చివరికి చేరవలసిన స్థలం ఏదైనా ఉంటే, మానవ జాతిలోని క్షమ, ధృతి, దయ, విశుద్ధత మున్నగు సత్ ప్రవృత్తులు అత్యధిక వికాసం పొందిన స్థలం ఏదైనా ఉంటే, ఆధ్యాత్మికత, ఆత్మాన్వేషణ విధానాలు వికాసం పొందిన దేశం ఏదైనా ఉంటే- అది ఈ పరమపావన భారతభూమియే. ఈ జాతిలోనే మతం అక్షరాలా ఆచరణలో నిలచింది. ఈ జాతిలోనే మనిషి ఒక అవిచ్ఛిన్న ఏకత్వంగా ఈ విశ్వాన్ని అధ్యయనం చేయడం జరిగింది. ఇక్కడి ప్రతి స్పందనా పరమాత్మసత్తా యొక్క స్పందన. దర్శనం, మతం, ఆచరణ శాస్త్రం, మాధుర్యం, కోమలత్వం, ప్రేమ పొంగిపొరలిన భూమి మన మాతృభూమి. నీతిలో, ఆధ్యాత్మికతలో ఇతర జాతులకన్న మిన్న అయినది ఈ జాతి.

భారతవర్షం ఆధ్యాత్మిక జాతీయవాదానికి ఆటపట్టు. నేడుసైతం ప్రతి శుభకార్యంలో వైదిక మంత్రాలలోని ఈ సూక్తాలనే పఠిస్తున్నారు. బ్రహ్మ, కల్పం, మన్వంతరం, చతుర్యుగాల సుదీర్ఘ కాలయాత్ర ఈ ఆధ్యాత్మిక జాతీయవాదాన్నే ప్రసారం చేస్తూవచ్చింది. ఈ జాతిలోని ఆధ్యాత్మిక, ధర్మ భావన ప్రతి వ్యక్తి ఊపిరిలో వ్యక్తం కావాలి. మహర్షులు ప్రసాదించిన ఈ సిద్ధాంతాన్ని మనమంతా ఈ సంధి సమయంలో సాకారం చేయాలి.

☆ ☆ ☆

## ప్రామాణికత ఫలితం

స్వామి అయ్యర్ చాలా చిన్నవాడు. అతని తండ్రి అంధుడు. తల్లి పిండి విసరటం, దంచటం లాంటి పనులతో శ్రమించి నాల్గు పైసలు సంపాదించేది. ఆ విధంగా వారి రోజులు గడిచేవి. అయ్యర్ కాస్త పెరిగి పెద్దవాడై నెలకొక రూపాయ వేతనంతో నౌకరీ సంపాదించాడు. చదువుకూడ కొనసాగించేవాడు. 12 సం॥లు ఈ విధంగా గడిచాయి. విద్యార్హత పెరిగి ఈయనకు ఒకసారి 500 రూ॥ బహుమతి లభించింది. దానితో కష్టాలు చాలా తీరేయి. తరువాత వందరూపాయల నెలసరి వేతనంతో క్లర్కుపోస్టు లభించింది. అయినా ఈయన విద్యాధ్యయనాన్ని మానలేదు. ఈయన హైకోర్టు జడ్జిగా జీవితాన్ని సాగించాడు.

పురుషార్థం, ప్రామాణికతల ప్రతిరూపమే అయ్యరు జీవితం. ఒకటి కాదు, రెండు కాదు - ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి.

- ప్రజ్ఞాపురాణం నుండి

**తనను తాను సంస్కరించుకున్న వ్యక్తికి ఇతరులను సంస్కరించే హక్కు లభిస్తుంది.**

# కుటుంబ నిర్మాణం

# ఆస్తికతను పెంచితే భవిష్యత్తు ఉజ్వలం

ఈశ్వరోపాసన మానవజీవితపు గొప్ప ఆవశ్యకత, ఆత్మస్థాయిని సువికసితంగా, సురక్షితంగా, సువ్యవస్థితంగా ఉంచడానికి మన మనోభూమికలో ఈశ్వరునికి సముచితమైన స్థానాన్ని కల్పించాలి. వీలు కుదిరినప్పుడల్లా చింతన, మననం అధిక సామీప్య, సాన్నిధ్యాలు లభించడానికి ప్రయత్నిస్తుంటేనే అది సాధ్యపడుతుంది. భోజనం చేయకపోతే శరీరం పనిచేయదు. గాలి పీల్చకపోతే రక్త ప్రసరణం అస్తవ్యస్తమవుతుంది. అలాగే ఈశ్వరుని ఉపేక్షిస్తే ఆంతరిక స్థాయి నీరసం, చింతాగ్రస్తం, అనిశ్చితం, అనైతికం, అవ్యవస్థితం అవుతుంది. దాని వల్ల కలిగే హాని తక్కువేమీ కాదు. కనిపించే హానిని తేలికగా గుర్తుపట్టవచ్చు. కాని జీవితంలో ఆనందమంతటినీ, ప్రయోజనాన్నీ నశింపజేసే హాని కనిపించదు, అర్థం కాదు. ఎంతటి దౌర్భాగ్యం?

మానవ జీవితంలో ప్రగతి, సుఖ శాంతులు ఆంతరిక స్థాయి ఉత్కృష్టత మీద ఆధారపడి ఉంటాయి. ఈ ఉత్కృష్టతకు పుష్టి, అభివృద్ధి కలగటానికి మహర్షులు ఉపాసనా తంత్రాన్ని ఉపదేశించారు. భౌతిక సుఖ, సాధనాలను ఎక్కువగా బుద్ధిబలంతో పొందవచ్చు. కాని గుణ, కర్మ, స్వభావాల ఉత్కృష్టతపై ఆధారపడి ఉన్న సమస్త విభూతులూ మన ఆంతరిక స్థాయి మీదనే నిలిచి ఉంటాయి. ఈ స్థాయిని సుదృఢమూ, సమున్నతమూ చేసుకోటానికి ఉపాసన అద్భుతంగా ఉపకరిస్తుంది. అందువల్ల అత్యంత ఆవశ్యకమైన కార్యక్రమాలకు వలెనే ఉపాసనకు నిత్య కార్యక్రమాలలో ప్రముఖ స్థానాన్నందీయాలి. ధన సంపాదన, ఆహారం, విశ్రాంతి, స్నాన సంధ్యలు, గృహస్థపాలన, విద్యాధ్యయనం, మనోరంజనం మాదిరిగానే ఉపాసన గూడా తప్పనిసరిగా ఉండాలి.

ప్రజలను సదాచారులను, సునియంత్రితులను సామాజికోపయోగకారులుగానూ నిలిపేటందుకు ప్రభుత్వం పలు విధి నియమాలనూ, కార్యక్రమాలనూ ఏర్పాటు చేస్తుంది. ఎన్నో చట్టాలు, నిబంధనలు, నియంత్రణ తమ దృష్టి ననుసరించి వారు రూపొందిస్తున్నా ప్రయోజనం స్వల్పంగానే ఉన్నది. నియంతృత్వం ప్రజలను ఆటబొమ్మలుగా చేసి ఆడిస్తుంది. ఆయుధాలనూ, తూటాలనూ కార్ఖానాలలో తయారుచేసినట్లే మనుష్యుల ఆలోచనలనూ ప్రవృత్తులనూ తమ ఇచ్చ వచ్చిన రీతిలో మలచడానికి శాసన వ్యవస్థ ప్రయత్నిస్తున్నది. ఒక హద్దు వరకూ సాఫల్యం కలిగిందని గట్టిగా చెప్పవచ్చు. ఉన్నతమైన ఆదర్శవాదం కొరకు, ఆధ్యాత్మిక కోమల భావనలకొరకు అంతఃకరణలో కొంచెం స్థానం కల్పించకపోతే మానవునిలో ఉన్నత గుణాలు ప్రవేశించవు. ఆంతరిక ప్రేరణతో కలిగే ప్రేమ, త్యాగం, సంయమం, శ్రేష్ఠత ప్రభుత్వపు ప్రచారంతో లభించవు. చట్టాలు, ప్రభుత్వ ఒత్తిడీ ఈ విషయంలో ఎందుకూ పనికిరావు. మనిషి ఎప్పుడూ ఉన్నత భావనలను పెంపొందించుకుంటే తప్పితే ప్రపంచంలో శాంతి, సువ్యవస్థ నెలకొనడం జరగదు. ఈ భావనలు లోపలి నుండి రావాలి. బయటనుండి వెలువడవు. అంతఃకరణపై ప్రభావం చూపే శక్తి శ్రద్ధా విశ్వాసాల వల్లనే కలుగుతుంది. అందువల్ల ఈ తత్వాలను జాగృతం చేయనంతవరకూ ఈ జాగరణ జరగదు. అప్పటి వరకూ మనుష్యుడు పతనం నుండి ఉన్నతికి పయనం చేయలేడు.

మానవ జీవనం ప్రగతి సద్గుణాల మీద ఆధారపడి ఉంటుంది. గుణ, కర్మ, స్వభావాల నిర్మాణం, వికాసం సరిగా ఉన్నప్పుడే అవి మనుష్యులను అనేకమైన బాధలనుండి, కష్టాల నుండీ తరింపచేస్తాయి. ప్రగతి మార్గాన్ని అన్వేషింపజేస్తాయి. విపరీత పరిస్థితులను, చెడు స్వభావం గలిగిన వ్యక్తులను కూడా సుసంస్కారం గలిగిన మనుష్యులు తమ ప్రభావంతో, ప్రవర్తనతో మార్చగలుగుతారు. మరోప్రక్క దోష, దుర్గుణాలతో నిండిన స్వభావం గల వ్యక్తులు తమ దోషపూరితమైన దృష్టికోణంతో మంచి మనుషుల మనస్సులను పాడు చేస్తారు. దుర్గుణాల ప్రభావం ముందు గత సంస్కారం ఎక్కువ కాలం నిలవదు. దూషితమైన దృష్టికోణం ఎక్కడుంటే అక్కడ నరక సదృశమైన వాతావరణం వ్యాపిస్తుంది. అనేకమైన విపత్తులు పుట్టుకువస్తాయి.

ఈ తథ్యాన్ని మనసులో ఉంచుకుని ప్రతి ఒక్కరూ తమ, తమ కుటుంబ సభ్యుల జీవితాలలో సద్గుణాలకు తల్లియైన ఆస్తికతను ధైర్యంతో, వివేకంతో అలవరచటానికి ప్రయత్నించాలి. ఈశ్వరుని యెడ భయ భక్తులు మనుష్యుని మంచి మార్గంలో నడవాలని నియంత్రణ చేస్తాయి. రాజకీయ చట్టాలు, సామాజిక దండనలూ దుస్సాహసికులైనవారిని కట్టుబాటు చేయలేవు. అపరాధుల సంఖ్య పెచ్చుపెరిగిపోకుండా పోలీసులు, జైళ్లు ఏమీ చేయలేవు. కాని ఈశ్వరునిపై నిజమైన విశ్వాసం ఉండి, తన నలువైపులా ప్రతి ప్రాణిలోనూ, కణ కణంలోనూ ఈశ్వరుని

**విజ్ఞతనూ, స్వపర భేదాన్నీ అలవరచే కష్టాలు వరాలే.**

అస్తిత్వాన్ని గమనించగలిగితే, వ్యక్తి ఎవరినీ తన అనుచిత ప్రవర్తనతో బాధపెట్టలేడు. కర్మఫలమనే ఈశ్వరీయ వ్యవస్థపై విశ్వాసమున్నచోట ఎవరూ చెడు మార్గంలో నడిచే సాహసం చేయలేరు. మరొకరిని బాధపెట్టటమనేది ఈశ్వరుని బాధపెట్టడమే అని అర్థం.

సౌశీల్యాన్ని ఆస్తికతకు పర్యాయపదంగా గ్రహించాలి. కపట భక్తులు 23 1/2 గంటలూ పాపాలు చేస్తూ అరగంటసేపు పూజతో పాపనివృత్తి జరుగుతుందనుకుంటారు. అదంతా హాస్యాస్పదం. అదే విధంగా దేవుని దర్శనం చేసుకోటంవల్ల కోరికలు తీరిపోతాయని కొందరనుకోటం గూడా మూర్ఖత్వమే. కాని నిజమైన ఆధ్యాత్మికతకూ, ఆస్తికతకూ ఎటువంటి లోటూ కలుగదు. ఈశ్వరునిపై విశ్వాసానికీ, ఆస్తికతకూ ప్రతిఫలం ఒక్కటే. సన్మార్గావలంబన, చెడు మార్గాన్ని వదిలిపెట్టటానికీ. జీవితంలో ప్రతి క్షేత్రంలోనూ ధర్మ, కర్తవ్యాల అనుశాసనాన్ని స్థాపించటానికి ఈశ్వరునిపై విశ్వాసాన్ని కలిగించడాన్ని మించిన మరో ప్రభావ శాలియైన మాధ్యమం లేదు.

విచారశీలురైన వ్యక్తులందరి కర్తవ్యం తమ జీవితాలను సార్థకం చేసుకోటం. ఈశ్వరుని తన చెలికానిగా, సహచరునిగా భావిస్తూ ప్రతిక్షణం నిర్భయంగా ఉండాలి. సన్మార్గంతో ఈశ్వరుని కృప, దుర్మార్గంతో ఈశ్వరుని శిక్ష లభిస్తాయనే తిరుగులేని సిద్ధాంతాన్ని మననం చేసుకుంటూ తన ఆలోచనలలోనూ, ఆచరణలోనూ మంచితనాన్ని పెంచుకునేటందుకు ప్రయత్నిస్తూ ఉండాలి. నిజంగా భార్యాబిడ్డలను ప్రేమిస్తున్నామనుకునే ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులలో ఆస్తికతను ప్రవేశపెట్టాలి.

కుటుంబ సభ్యుల శారీరిక మానసిక వికాసం కొరకు విహారాలకూ, విద్యాభ్యాసానికీ ఏర్పాటు చేసినట్లుగానే ఆత్మిక దృష్టితో ఆరోగ్యవంతులను చేయడానికి ఇంటిలో ఆబాలగోపాలం అందరికీ ఉపాసనలో నిష్ఠ, అభిరుచి కలిగేలా చూడాలి. ఇందుకు బుజ్జగించి తెలియజెప్పటం మంచి పద్ధతి. కుటుంబ సభ్యులు గృహ యజమానిని అనుకరిస్తారు. అందువల్ల అతడు నిత్యమూ, నియమపూర్వకంగా ఉపాసనలో నిమగ్నుడు కావాలి. అవసరమైతే సామ, దాన, భేద, దండోపాయాల నుపయోగించి కుటుంబ సభ్యులను దారికి తేవాలి. మంచి మాటలు చేదుగా ఉండటం ఎగతాళిగా కనిపించడం సహజం. అటువంటి వాతావరణం మన ఇంట్లో వ్యాపించకుండా చూసుకోవాలి. ఉంటే దాన్ని మట్టుపెట్టాలి. ఆలస్యంగా నిద్రలేవటం, చెడు సహవాసాలు మొదలైనవి కుటుంబ సభ్యులలో ఏ ఒకరికి అలవాటుగా మారినా వాటిని వదిలించాలి.. అలాగే వదిలిపెడితే భవిష్యత్తు అంధకారమయమవుతుంది. నాస్తికత, ఉపాసనను ఉపేక్షించటం వంటి ఆధ్యాత్మిక దుర్గుణాల్ని సైతం నిలువరించాలి. మంచి ఎక్కడున్నా గ్రహించాలి.

కుటుంబానికి మనం చేసే సేవలన్నిట్లో గొప్పది ప్రతి కుటుంబ సభ్యునీ ఆస్తికునిగా, ఉపాసకునిగా తీర్చి దిద్దటం. అది వారి ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేసి తీరుతుంది.

ఆస్తికత ధర్మంపట్ల విశ్వాసం కలిగిస్తుంది. దృఢ విశ్వాసంతో నిలిచేవారు కర్తవ్యనిష్ఠులైన వీరులుగా తయారవుతారు. వారి శరీరం, మనస్సు, కుటుంబ ప్రవర్తన, ఇహ పరలోకాలు అన్నీ ఆనందమయమవుతాయి. ఆడపిల్లలకు చిన్నతనం నుండీ మనస్సులో ఆస్తికత, విశ్వాసం ఏర్పడితే, అత్తవారింటికి వెళ్లిన తరువాత వారు పతివ్రతా ధర్మాన్ని పాలిస్తారు. ఆ కుటుంబ సభ్యులందరూ మెచ్చుకునేటట్లు సత్ప్రవర్తనను కలిగి ఉంటారు. నయనతారలుగా ప్రకాశిస్తారు. అందరూ వారిని ఆదరిస్తారు. దుఃఖంలో, బాధలలో కంటికి రెప్పలవలె కాపాడుతూ గారాబం చేస్తారు. కట్నం ఎక్కువగా ఇచ్చినంత మాత్రాన ఆడపిల్లలు అత్తవారింట సుఖపడతారని గ్యారంటీ లేదు. సద్గుణాల వల్లనే సుఖం లభిస్తుంది. సద్గుణాలు దైవభక్తి వల్లనే లభిస్తాయి. ఆస్తికత వల్లనే దైవ భక్తి కలుగుతుంది. ఈ విధంగా కన్యలకు తల్లిదండ్రులు ఆస్తికత, ఉపాసన నేర్పితే వారి భవిష్యత్తును ఆనందమయం చేసినట్లే. విశృంఖలంగా, విలాసవంతంగా, నాస్తికులుగా పెరిగిన కన్యలు ఎక్కడికి వెళ్లినా, అసహనంతో నరకాన్ని సృష్టిస్తారు.వారు తగలబడుతూ, కుటుంబ సభ్యులకూ మంట పెడతారు. ఆ తప్పంతా తల్లిదండ్రులకే వర్తిస్తుంది. వారు సరిగా పెంచి ఉంటే అనిష్టం జరగదు గదా! వారెంతో ప్రేమతో పెంచినా అది శత్రుత్వమే అవుతుంది.

మగపిల్లల విషయంలోకూడా ఇది వర్తిస్తుంది. చిన్నతనం నుండీ ధర్మ, విశ్వాసాలను రంగరించి పోస్తుంటే వారు తల్లిదండ్రుల యెడ, అన్నదమ్ములయెడ, అక్క చెల్లెండ్లయెడ, చుట్ట పక్కాలయెడ తమ కర్తవ్యాన్ని చక్కగా పాలిస్తారు. వారి సంసారం స్వర్గమే అవుతుంది. స్వభావం, ఆరోగ్యం చక్కగా ఉంటాయి. కీర్తి ప్రతిష్ఠలు కలుగుతాయి. మంచితనం ఎక్కడ ఉంటుందో అక్కడ దీనత్వం, దరిద్రం ఉండవు. ఆస్తికత ద్వారా వారి తల్లిదండ్రులు సుసంస్కారాలతోపాటు ఉజ్వల భవిష్యత్తుకు బీమా చేసినట్లే. ఆ విధంగా తల్లిదండ్రులు పిల్లలను తీర్చిదిద్ది వారిని ఆస్తికులనుగా, సంస్కారవంతులనుగా తయారు చేస్తే తమ కర్తవ్యాలను చాలా చక్కగా నిర్వర్తించినట్లే. వారిని ఎంతగా పొగడినా తక్కువే అవుతుంది.

అనువాదం: డి.వి.ఎస్.బి.విశ్వనాథ్

**ప్రయోజనకరమైన సాహిత్యాన్ని చదవడాన్ని మించిన మంచి వినోదం లేదు.**

# దీర్ఘజీవన రహస్యం
# బ్రహ్మచర్యం, ప్రాణాయామం

**దీర్ఘజీవనం మన చేతిలోనే ఉంది :** సర్ హోమీ మెహతా (వయసు 105 సంవత్సరాలు) ఇలా చెబుతున్నాడు- దీర్ఘజీవనం నా ఎడమచేతి ఆట. ఎక్కువ ఆడడం. సంతోషంగా ఉండడం ఆరోగ్యకరం. నేను ఎక్కడున్నా ప్రాతఃకాలంలో 5:30 గం॥లకు తప్పకుండా నిద్రలేస్తాను. శ్రమించుటలో సుఖాన్ని అనుభవిస్తాను. ఈ శరీరం నిస్సత్తువను, వృద్ధాప్యాన్ని, పించను తీసుకోవడాన్ని కల్పనల చేయదు. నేను ఎప్పుడూ హానికరమైన రోగాల బారిన పడలేదు. నాకు ఔషధాల మీద ఏ మాత్రం విశ్వాసం లేదు. ఎప్పుడయినా శరీరంలో చెడు కనిపిస్తే భోజనం మానివేసి ఉపవాసం చేస్తాను. ఉపవాసంలో నీళ్లు ఎక్కువగా తాగుతాను.

స్నేహితులారా! రాత్రి పూట ఎక్కువగా మేలుకోవద్దు. గాలి బాగా ఉన్న ఆరుబయట ప్రదేశాలలో సాధ్యమైనంత ఎక్కువ కాలం గడపండి. అధిక భోజనం వలన ఆయుష్షు తగ్గుతుంది. పచ్చి ఆహారం, ఫలాలు, కూరగాయల వలన జీవనాన్ని పెంచుకోవచ్చు.

**నా రహస్యం కేవలం సంయమనం :** 160 సంవత్సరాల ఇస్తాంబుల్ కాజా జోర్ ఇలా అంటున్నారు- "నా దీర్ఘజీవన రహస్యం నా సంయమన జీవితమే. అన్నింటా సంయమనం పాటించడం, అతికి దూరంగా ఉండడమే నా 160 సంవత్సరముల సుదీర్ఘ జీవన రహస్యం. కేవలం కాయగూరలు, పాలు వాడడం వలన ఇంత సుదీర్ఘ ఆయుష్షు లభించింది."

**మహాశక్తిపై దృఢ విశ్వాసం :** 115 సంవత్సరాల వయసుగల ఒక యునాని మందిర పూజారి ఇలా వ్రాస్తున్నాడు- "ఈ నిఖిల విశ్వంలో ఒక మహాశక్తి వ్యాపించి ఉన్నది. దీనితోనే సృష్టిలోని సమస్త జీవాలు అభేద్యమైన సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ఈ మహాశక్తి అమరమైనది. నశింపులేనిది. ఈ మహాశక్తిపై నీ మనసు ఎంత తాదాత్మ్యం చెందుతుందో అంత అధిక ఆయుష్షు నీకు లభిస్తుంది.

ఎక్కడెక్కడో గతి తప్పి తిరుగుతున్న ఆలోచనలను మనసులోని ఆంతరంగిక కేంద్రంలో ఉన్న మహాశక్తిపై కేంద్రీకరించండి. ఆ శక్తి మీద భరోసా ఉంచండి. అది అవ్యక్తంగా మీ వైపు ప్రవహిస్తున్నట్లు తెలుసుకోండి. ఆ మహాశక్తి యొక్క అత్యంత బలమైన ఒక అంశానివి నీవు. జ్ఞానం, బుద్ధి, ఆనందం నీ అధికారాలు. అవే నీకు దీర్ఘజీవనాన్ని ప్రసాదిస్తాయి.

**పనిచేయాలి – సంతృప్తిగా ఉండాలి:** 112 సం॥ల మిసెస్ ఎల్. స్టన్సన్ ఇలా చెబుతోంది - 'నా దీర్ఘజీవన రహస్యం పని చేయడం. మనస్ఫూర్తిగా ఎంత నేర్పుగా చేయగలనో అంత సుందరంగా పని చేయడం. సంతృప్తిగా, సంతోషంగా ఉండడం. చింత అనేది ఏదయినా కీటకం పేరేమో నాకు తెలియదు.'

**ఖచ్చితమైన శాకాహారిగా మారండి :** 87 సం॥ల ప్రసిద్ధ ఇంగ్లీషు రచయిత జార్జ్ బెర్నాడ్ షా: "ధూమపానం, మద్యపానం చేయకపోవడం వలన నాలో యువకుని బలం ఉన్నది. నేను శాకాహారిని. అన్నము, నెయ్యి, పాలు, ఫలాలు, కాయగూరలు మొదలయినవి స్వాభావిక ఆహార పదార్థాలు. స్వాభావిక ఆహార పదార్థాల వలనే దీర్ఘజీవనం పొందవచ్చు. ఈ స్వాభావిక ఆహారంలో శరీర రక్షణకు కావలసిన అన్ని తత్వాలు ఉన్నాయి. ఈ కారణంగానే నేను భయంకర రోగాల పంజాకు దక్కలేదు.

**మితాచారం వలన దీర్ఘాయువు :** 80 సంవత్సరాల అడాల్ఫ్ లోరెజ్ అనే ప్రసిద్ధ వృద్ధ సర్జన్ ఇలా చెబుతున్నారు- "అన్ని విషయాలలోను మితంగా ఉండాలి. మితాచారం వల్లనే దీర్ఘాయువు లభిస్తుంది అనేది నా అభిమతం."

**జీవన రక్షణకు సరళ ఉపాయం :** 105 సం॥ల యోగి సర్వేశ్వరానంద్ ఇలా అన్నారు, "ప్రాణ నిగ్రహం అంటే శ్వాసలను ఆపే ప్రాణాయామమే దీర్ఘాయువును ప్రసాదిస్తుంది. శ్వాసను ఎంత ఎక్కువ భర్తీ చేసుకోగలిగితే అంత ఎక్కువ భర్తీ చేసుకోవాలి. ఎంతసేపు లోపల ఆపగలిగితే అంతసేపు ఆపాలి. తరువాత నెమ్మది నెమ్మదిగా బయటకు వదిలివేయాలి. ఈ ప్రకారం ప్రాణాయామ శక్తిని ప్రతిదినం అభ్యాసం ద్వారా పెంచుకోవాలి. ఎప్పుడూ రమ్యమైన ఏకాంత ప్రదేశంలో ప్రాతః, సంధ్యా సమయంలో శ్రద్ధగా ఈశ్వరుని స్తుతి, ప్రార్థన, భక్తి, మంగళమయ పవిత్ర గ్రంథాల స్వర్ణిమ సూత్రాలను మననం చేస్తూ ఉండాలి. మీకు తప్పకుండా దీర్ఘాయుష్షు లభిస్తుంది. జీవన రక్షణ చేసే ప్రాణాయామాన్ని మించిన సరళమైన ఉపాయం మరొకటి లేదు."

**బాధ్యతను నిర్వహించడంవల్ల మనిషిలోని శౌర్యం వెలికివస్తుంది.**

**లంగోటా మీద అదుపు :** గామాగారు దీర్ఘ జీవనం గురించి ఇలా అన్నారు - "లంగోటాను దృఢంగా ఉంచుకోండి. అంతే. ఎంతకాలం కావాలంటే అంతకాలం ఆనందంగా జీవించవచ్చు. వ్యాయామము సదాచారాల వలన నీచ విచారాలు తొలగిపోతాయి. కనుక అస్థిపంజరాలు మారుతున్న వ్యసనగ్రస్త మిత్రులారా! మీ లంగోటాను మీ వశంలో ఉంచుకోండి. ఇదే శాంతిపూర్వకమైన, నిర్వికారమైన బ్రహ్మచర్యము. దీర్ఘజీవనాన్ని ప్రసాదించే వాస్తవిక రహస్యం. ఇష్టం ఉన్నా లేకపోయినా కసరత్తు మాత్రం చేసి తీరాలి. చేయకపోతే రోగిగా మారాలి. అంతేగాక ఈ జీవన యాత్రను అర్ధంతరంగా ముగించవలసి ఉంటుంది. వ్యాయామంవలన ఆయువు ప్రచండంగా వృద్ధి చెందుతుంది. స్వామి శివానందజీ 1926లో నాగ్‌పూర్‌లో స్వయంగా 155 సంవత్సరాల వయసు గల ఒక పహిల్వానును చూశారుట. అతనికి ఒక్క దంతం కూడ ఊడలేదు. ఆ పహిల్వాను గొప్ప సదాచారి, బ్రహ్మచారి. బ్రహ్మచర్యం వలన తనువు, మనసు రోగరహితంగా, నిర్వికారంగా, పుష్టిగా తయారవుతాయి. దీర్ఘాయుష్షు లభిస్తుంది.

**దీర్ఘజీవనం కోసం నడక :** సోమరిపోతులు, వ్యాధిగ్రస్తులు, భయస్తులు అధికంగా వైద్యులవద్ద చూర్ణాలు, మందులు తింటూ కనిపిస్తారు. కాని ఎక్కువ నడిచేవారు, పరిగెత్తేవారు ఇతరత్రా క్రియాశీలంగా జీవించే అభ్యాసం చేసే వారు ఎక్కువ రోజులు జీవిస్తారు. మనుషులు తిరగడానికి, వేటాడడానికి, చెట్లు ఎక్కడానికి, దుమకడానికి, గెంతడానికి సృష్టించబడ్డారు. సోమరితనం కోసం కాదు. సోమరితనం వలన సమస్తశక్తులు నశించిపోతాయి. జీవితం కుంచించుకుపోతుంది. పొట్ట బయటకు వస్తుంది.

ప్రాతఃకాలంలో పచార్లు చేయడం. చెప్పులు లేకుండా పచ్చికబయలుపై పరిగెత్తడం అన్ని అవయవాలలో విచిత్రమైన స్ఫూర్తిని, ఉల్లాసాన్ని నింపుతాయి. కసరత్తు ఏ రూపంలో చేసినా అది అమృత తుల్యమే. తిరగడం, పచార్లు చేయడం అన్నిటికంటే ఉత్తమమైన వ్యాయామం.

దీర్ఘజీవనం పొందాలనుకునేవారు పచార్లు ప్రారంభించాలి. కావాలంటే యితర వ్యాయామాలు వదిలివేయండి. కాని తిరగడం- పచార్లు చేయడం అనేది ఎప్పుడూ వదలవద్దు. శరీరంలోని అంగాల విశేష వికాసం కోసం ఏ యితర కసరత్తులు, వ్యాయామాలు చేసినా ప్రతిదినం కనీసం రెండు గంటలు పచార్లు చేసే నియమాన్ని అవశ్యం పాటించండి.

ఆరోగ్యం కోసం అత్యంత లాభదాయకమైన ఇతర వ్యాయామాలు ఎన్నో ఉండవచ్చు. కాని ఈ జాగింగ్, పచార్లుకొట్టడం, పరిగెత్తడం, నీళ్లుతోడడం అనేవి అపూర్వమైనవి. స్త్రీ, పురుషులు ఎవరయినా సరే 24 గంటలలో కనీసం రెండుగంటలు పచార్లు చేయకపోతే వారు దీర్ఘజీవులు కాజాలరు. కావాలంటే ఇతర వ్యాయామాలు కూడ చేయవచ్చు.

చిన్న వయస్కులు ఉపవాస సమయంలో శవాల్లాగా పడి ఉంటారు. ఉపవాస దినాలలో నాలుగునుండి ఆరుగంటలపాటు బయట తిరగడం అత్యంత అవసరం. పూర్తి ఉపవాస లాభాన్ని పొందాలంటే కాలి నడక అవసరం ఎంతయినా ఉంది. ప్రపంచంలో ఉన్న రోగాలలో 95 శాతం రోగాలు ఇలా నియమిత రూపంలో సంచరించడం వలన దూరమవుతాయి. ఇదే ప్రకారం పర్వతాలు ఎక్కడం, ఈదడం, సూర్య నమస్కారాలు అమృతతుల్యమైనవి. సోమరితనం అనేది ఎంతో తీయగా ఉంటుంది. కాని అది విషపూరితమైన మత్తు పదార్థము లాంటిది.

**బ్రహ్మచర్యం వలన ఆయుర్వృద్ధి :** బ్రహ్మచర్యాన్ని పాటించడం వలన వంద సంవత్సరాలేమిటి అంతకంటే అధికంగా జీవించవచ్చు. మన ఋషులు, మునులు ఆత్మబలం, బ్రహ్మచర్య బలంతో దీర్ఘజీవన ఆనందాన్ని అనుభవించారు.

### శంకర భగవానుడి నిర్దేశం

"మరణం బిందుపాతేన జీవనం బిందు ధారణాత్ ।"

అంటే - వీర్య బిందువు నష్టం కావడం మరణం - దానిని ధారణ చేయడం జీవనం. వీర్యం పురుషార్థాన్ని, ముక్తిని, ఆయుష్షుని, సామర్థ్యాన్ని ప్రసాదిస్తుంది. ధన్వంతరి మహారాజుని శిష్యులు ఒకసారి ఒక ప్రశ్న అడిగారు- "భగవాన్! దేనిని ఒకసారి సేవించడంతో మనిషి రోగాలనుండి విముక్తుడై దీర్ఘజీవనాన్ని పొందుతాడో చెప్పండి."

దానికి ధన్వంతరి జవాబు-

"నేను నిజం చెబుతున్నాను. మృత్యువు, రోగాలు, వృద్ధావస్థని నాశనం చేసే అమృతతుల్యమైన ఔషధం బ్రహ్మచర్య పాలన. ఎవరయితే శాంతిని, సౌందర్యాన్ని, స్మృతిని, జ్ఞానాన్ని, ఆరోగ్యాన్ని ఆకాంక్షిస్తారో వారు ఈ సంసారంలో సర్వోత్తమమైన బ్రహ్మచర్యపాలన చేయాలి. బ్రహ్మచర్యమే పరమ జ్ఞానము. పరమ ఔషధము. ఈ ఆత్మ నిశ్చయంగా బ్రహ్మచర్యమయమే. శరీరంలో దీని స్థితి బ్రహ్మచర్యం మీదే ఆధారపడి ఉంది. బ్రహ్మచర్యమయుడైన పరమాత్మకు నమస్కరించి అసాధ్యమైన రోగాలనుండి రోగులను రక్షిస్తాను. కనుక జిజ్ఞాసువులారా!

**మనస్సు ఆవాల మూట వంటిది. చెల్లాచెదరు అయితే మళ్లీ మూటకట్టలేము.**

దీర్ఘజీవన ప్రాప్తికోసం బ్రహ్మచర్య సాధన సర్వోత్తమ ఉపాయము.

**సంజీవని విద్య:** శుక్రాచార్యుల వద్ద 'సంజీవని' అనే పేరుగల అద్భుత విద్య ఉన్నది. దీని ద్వారా చనిపోయిన వారిని బ్రతికించేవారు. ఆ సంజీవనీ విద్య అమృతరూపమైన వీర్య రక్షణ తప్ప వేరేదీ కాదు. ఈ సంజీవనీ విద్య మనిషిని ఖచ్చితంగా మృత్యుముఖం నుండి రక్షిస్తుంది.

బ్రహ్మచర్య సాధన కోసం ఈ క్రింది నియమాలను పాటించడం శ్రేయస్కరం-

(1) సాధకుడు 8 రకాల మైథునాలకు దూరంగా ఉండాలి. అంటే స్త్రీని ఏ రూపంగానేనా స్మరించవద్దు. ఏ స్థానంలోనైనా పడిఉన్న, విన్న లేదా చిత్రపటాలలో ఉన్న స్త్రీ రూపాన్ని స్మరించడం, ధ్యానించడం చేయకూడదు. స్త్రీ రూపం, గుణం, అంగాలగురించి చర్చించకూడదు. వారితో ఆడకూడదు. ఏ స్త్రీని చెడు దృష్టితో చూడకూడదు. శృంగార రస సాహిత్యాలను చదువకూడదు. సంకల్పం, ప్రయత్న కామక్రీడ, ప్రత్యక్ష సంభోగం - వీటన్నిటికి దూరంగా ఉండాలి. పవిత్ర మాతృభావనతో స్త్రీని చూడండి.

(2) సాదా నడవడిక, సత్సంగం, సత్ గ్రంథావలోకన, ఘర్షణ స్నానం, సాదా తాజా అల్పాహారము. నిర్వ్యసనపరత్వం. రెండుసార్లు మల-మూత్ర విసర్జన. ఇంద్రియ స్నానం. నియమిత వ్యాయామం, త్వరగా నిద్రపోవడం, త్వరగా నిద్రలేవడం, ప్రాణాయామం, ఉపవాసం, దృఢత్వం, డైరీలో పాపపుణ్యాలను వ్రాసిపెట్టుకోవడం, ఎల్లప్పుడూ శ్రమించడం, సర్వధర్మానుష్ఠానం, లంగోటా ధరించడం యమ నియమాలను పాటించడం - వీటి వలన వీర్య రక్షణ జరుగుతుంది.

**ఊపిరితిత్తుల సహాయంతో దీర్ఘ ఆయుష్షు** : వాయువు ద్వారా ప్రాణశక్తి లభిస్తుంది. కాబట్టి ప్రాణాలను రక్షించుకోవాలంటే దీర్ఘమైన శ్వాస- ప్రశ్వాసల ద్వారా ప్రాణశక్తిని కూడబెట్టుకోండి. సమస్త జీవన వ్యాపారం ఊపిరితిత్తుల మీదే ఆధారపడి ఉంది. దీర్ఘ శ్వాస మనిషికి సంపూర్ణ జీవన తత్వాన్ని ఇస్తుంది. ఆరోగ్యాన్ని ఆయుష్షును ప్రసాదిస్తుంది. మానసిక, ఆధ్యాత్మిక ఉన్నతికి సహాయం చేస్తుంది. దుఃఖాన్ని, శోకాన్ని నివారిస్తుంది.

శ్వాసక్రియ కేవలం ఆయుర్వృద్ధికి సహాయపడడమే గాక అన్య సూక్ష్మ, స్థూల ఇంద్రియాలను కూడ పరిపుష్టం చేసి సక్రమంగా వికసింపజేస్తుంది.

శ్వాస తీసుకోవడంలో ముఖ్య విషయం- శ్వాస తీసుకునే సమయంలో కడుపును ఉబ్బించాలి. వదిలేటపుడు కడుపును సమాంతరంగా ఉంచాలి. శ్వాస సంపూర్ణంగా శరీరంలోకి వెళ్లినపుడు అది అన్ని స్థానాలలో ఉన్న మురికిని పరిష్కరించి ప్రక్షాళన చేస్తుంది. దీర్ఘశ్వాసలో తల నుండి పాదాల వరకు ఉన్న రోగాలను దూరం చేసే సామర్థ్యం ఉన్నది. ఎందుకంటే దాని ప్రభావం సమస్త శరీరం మీద ఉంటుంది. ఎక్కడెక్కడికి రక్తం వెళుతుందో అక్కడ చురుకుదనం వస్తుంది.

**సూర్య తత్వ శ్వాసయోగం** : ప్రతి మనిషి నాభి సూర్య స్థానం. ఆ స్థలంలో సూర్యునితో మిశ్రితమైన వాయువు యొక్క సూక్ష్మశక్తి ప్రవేశిస్తుంది. ఈ ప్రకారం మానవ శరీరంలో ఉన్న సూర్యుని, బ్రహ్మాండంలోని సూర్యుని యోగం (కలయిక) జరుగుతుంది. అపుడు మన ఆరోగ్యం ఉత్తరోత్తరా ఉన్నత స్థితిని చేరుకుంటుంది.

కనుక ప్రతి ఒక్క శ్వాసనీ కూడ నాభిలో ఉన్న సూర్య తత్వంతో తాదాత్మ్యం స్థాపించగలిగే విధంగా ప్రాణాయామం చేయగోరేవారు సర్వప్రథమంగా దీర్ఘశ్వాసను తీసుకోవడం, వదలడం అభ్యసించాలి. ఎంతవరకు సంభవమైతే అంత అధికంగా గాలిని ఊపిరితిత్తులలో నింపాలి. మళ్ళీ నెమ్మది, నెమ్మదిగా దానిని బయటకు వదలాలి.

**ధారావాహిక సమాప్తం**

అనువాదం : డి.వి.ఆర్.మూర్తి

## నటుని సాహసం

అమెరికా చిత్రాలలో చాలాసార్లు సాహసోపేతమైన దృశ్యాలు చిత్రీకరించబడేవి. అక్కడి చిత్రాలకు ఎక్కువ ఆదాయం, ఎక్కువ ఖ్యాతి ఇటువంటి సాహసాల కారణంగానే లభించేవి. వావ్ మార్గన్‌కు కర్రలతో నిండిన రైలుబండి నుండి క్రిందకు దూకే పని అప్పగించబడింది. వాస్తవానికి ఇలాంటి సందర్భాలలో డూప్ క్రిందకు త్రోయబడతాడు. కాని ఆరోజున పొరపాటున అసలు నటుడు క్రిందపడటం అతని మీద టన్నులకొద్ది కర్రల బరువు పడటం సంభవించింది. చాలా అవస్థపడితేగాని ఆయన్ని బయటకు తీయలేక పోయారు. ఎముకలు నుగ్గునుగ్గైపోయి మూడు రోజుల తర్వాత అతనికి స్పృహ వచ్చింది. ఆయన జీవిస్తాడనే ఆశ ఎవరికీ లేదు. కానీ రక్షించేవాని కృప అపారమైనపుడు ఇలాంటి సాహస పాత్రలే అనేకం చక్కగా పోషించబడతాయి.

– ప్రజ్ఞాపురాణం నుండి

**మనస్సును పాపాలనుండి తప్పించి పుణ్య కార్యాలలో వినియోగించడమే గొప్ప పురుషార్థం.**

## బోధకథ

# వజ్జీ పుత్త పశ్చాత్తాపం

వసంత శోభ ప్రకృతిని అన్నివైపులా ఆవరించింది. రంగు రంగుల పువ్వులూ, లేత చిగుళ్లూ భూమిని దేవతలకు సైతం ఆకర్షకంగా రూపుదిద్దాయి. మావి కొమ్మలపై విహరించే తుమ్మెదలు క్రొత్త క్రొత్త గీతాలను వినిపిస్తున్నాయి.కోయిలల కుహూరావాలు దేవలోకవాసులను భూమికి రమ్మని మృదు మధురంగా ఆహ్వానిస్తున్నాయి. ప్రకృతిలోని ఈ ఆకర్షణకు మరో అలౌకిక తత్వం తోడయింది. బుద్ధ భగవానుని పావన స్పర్శతో వైశాలీ నగరంలోని ఆ మామిడితోపు మాత్రమేకాక, ప్రకృతి అంతా ఆధ్యాత్మికమైన వెలుగుతో కలకలలాడుతోంది.

వజ్జి సంఘం రాజధాని వైశాలీ నగరం ఆనాడు సమృద్ధికీ, వైభవానికీ, శోభకూ భారతవర్షమంతటా ప్రసిద్ధి పొందింది. భగవానుని పాద ధూళి ఈ సమృద్ధికి పవిత్రతను సంతరించింది. ఆధ్యాత్మిక భావ బీజాలు అంతరంగాలలో నింపుకున్నవారికి భగవానుని రాక సంజీవనిగా పనిచేస్తోంది. ఆయన వ్యక్తిత్వం, ఆయన ప్రబోధం ప్రజల హృదయాలను పావనం చేస్తున్నాయి.

మనుషులేకాక పశు పక్షులు, జడ ప్రకృతికూడా ఒక అలౌకిక పరివర్తనను అనుభూతి పొందుతోంది. ఎండిన మోడులు చిగురిస్తున్నాయి. జీవన వీణలలో సంగీతం ప్రతిధ్వనిస్తోంది. సెలయేళ్లలో వేగం ఇబ్బడిముబ్బడి అవుతోంది. బీడు భూములు నందనవనాలుగా మారుతున్నాయి. అయితే, లోచూపు ఉన్నవారికే ఈ మార్పులు గోచరిస్తున్నాయి.

భగవానుని దివ్య స్వరూపం మామూలు కళ్లకు కనపడేది కాదు. ఆ దివ్య సంగీతం బయటి చెవులకు వినపడేది కాదు. ప్రభు సన్నిధిలో ప్రకృతి పొందుతున్న ఆ పులకింత ఒక పరమ యోగం. సమాధి స్థితిలోనే దాన్ని దర్శించడం సాధ్యమవుతుంది.

చూడగలిగినవారు ఆనందిస్తున్నారు. వినగలిగినవారు సంతోషిస్తున్నారు. అలా ఆనందిస్తున్నవారికి భగవానుని సన్నిధి ప్రతిరోజూ నూతన ద్వారాలను తెరుస్తోంది. అయితే అందరూ ఆ అదృష్టానికి నోచుకోలేదు. వారికి ఏమీ వినబడడం లేదు, కనపడడం లేదు. వారు దాహంతో వచ్చారు. ప్రభు చేతన అనే క్షీరసాగరంలో సైతం దాహంతోనే ఉండిపోయారు. వారు వచ్చినా రానట్లే. భగవానుని కలుసుకున్నా కలుసుకోనట్లే.

భగవంతుడు వస్తాడు. ప్రతి యుగంలో వస్తాడు. తన భక్తుల భావ చైతన్యాన్ని ఉన్నత శిఖరాలకు కొనిపోవడానికి వస్తాడు. ఆయన తన ప్రేమామృతాన్ని వర్షిస్తాడు. అయితే, తమ అస్తిత్వాన్ని ప్రభువులో విలీనం చేసుకున్నవారు మాత్రమే ఆ వర్షంలో తడుస్తారు. అహం అనే దుప్పటి కప్పుకున్నవారు, తమ వాసనల బురదను తొలగించుకోవడానికి ఇష్టపడనివారు ఎలా ఉన్నారో అలాగే ఉండిపోతారు. ముడి సరకుగా మిగిలిపోతారు. వజ్జీపుత్త భిక్షువు ఇలాంటి దురదృష్టవంతులలో ఒకడు. భగవానుని మహాబోధి సాగర తీరానికి వచ్చినా అతనికి ఆయన భావ చేతన అంటలేదు. అతడి కళ్లు చూస్తున్నాయి. అతడి చెవులు వింటున్నాయి. అయినా, అమృతమూర్తి అతడికి కనబడడం లేదు, వినబడడం లేదు.

అతడి చెవులలో ఆ మామిడి తోపుకు ఆవల వైశాలీ నగరంలో సాగుతున్న భోగ విలాసాల ధ్వనులు మారుమ్రోగుతున్నాయి. అతడి కళ్లు వైశాలిలోని నాట్యకత్తెల సౌందర్యాన్ని చూడడానికి ఉబలాటపడుతున్నాయి. వైశాలిలో అప్పుడు మదనోత్సవం జరుగుతోంది. ఆ నాట్య వినోదాల సంరంభం నలుగడలా వ్యాపిస్తోంది. వాసనల రంగులు, రూపాలు ఎన్నెన్నో ఆ నగర పరిసరాలలో నాట్యం చేస్తున్నాయి. యువతీ యువకుల విశృంఖల విహారాలు రోజురోజుకు కొత్త పుంతలు త్రొక్కుతున్నాయి.

భిక్షు వజ్జీపుత్త కళ్లు దాన్ని చూడాలని ఉవ్విళ్లూరుతున్నాయి. ఆ విలాస సంగీతాన్ని వినాలని అతడి చెవులు ఆతురత చెందుతున్నాయి. ఆ భోగ విలాసాలలో విశృంఖలంగా విహరించాలని అతడి మనస్సు తహతహలాడుతోంది. ఆ రోజు రాత్రి అతడిలోని ఈ వ్యాకులత తారస్థాయికి చేరుకున్నది. అది మదనోత్సవం చివరి రాత్రి. విలాస రాత్రి. ఆ ఫాల్గుణ మాసపు చందమామ ప్రజల మనసులలో రకరకాల ఆలోచనా ప్రవాహాలను ఉప్పొంగింపచేస్తోంది.

బుద్ధ భగవానుని సన్నిధిలో ఉన్నప్పటికీ వజ్జీపుత్త ఆందోళనగా ఉన్నాడు. నగరంనుండి వస్తున్న సంగీత నృత్యాల స్వర లహరులు అతడిలో అశాంతిని రగుల్కొల్పుతున్నాయి. దురదృష్టవంతుడైన ఆ భిక్షువు ఇంతవరకు భగవానుని పావన సంగీతాన్ని విననేలేదు. అతడి కన్నులు భగవానుని అంతరంగంనుండి వెలువడుతూన్న వెలుగుల వెల్లువను చూడనేలేదు. కానీ, వైశాలీ నగరంనుండి వెలువడుతూన్న దీపాల

**గొడ్డలితో నరికిన వనం మళ్లీ చిగుర్చుతుంది. కటువైన మాటలతో చేసిన గాయం ఎన్నటికీ మానదు.**

మిణుకు మిణుకులు అతడికి కనిపిస్తున్నాయి. అక్కడినుండి వస్తూన్న స్వర లహరులు అతడికి వినిపిస్తున్నాయి. ఆ గానా బజానాలు అతడిని చిత్తు చేస్తున్నాయి. అతడు దుఃఖంతో ఇలా ఆలోచిస్తున్నాడు – నేను భిక్షువుగా మారి నా జీవితాన్ని వృధా చేసుకుంటున్నాను. సుఖం ప్రపంచంలోని భోగ విలాసాలలో ఉంది. జనం ఎలా మజా చేస్తున్నారో. వైశాలీ నగరమంతా ఉత్సవం జరుపుతోంది. నేనిక్కడ కూర్చుని బాధపడుతున్నాను. సన్యాసం తీసుకుని నేను దుఃఖాన్నే ఆహ్వానిస్తున్నాను.

మరునాటి ఉదయం అతడు రహస్యంగా పారిపోయేలోగా భగవానుడు అతడిని పిలిపించారు. భగవానుని పిలుపు విని అతడు నివ్వెరపోయాడు. భగవానుడు అతడిని పిలిపించడం ఇదే మొదటిసారి. అతడు కొద్దిగా భయపడ్డాడు. మనసులో అనుమానం తలెత్తింది. నేను నా మనసులోని విషయం ఎవరికీ చెప్పలేదు కదా, ఆయన ఊరికే పిలిపించారు– అని కూడ అనుకున్నాడు.

భగవానుడు అతడి మనసులోని కథంతా అతడికి వినిపించారు. అతడు నీరుగారిపోయాడు. మన్మథుడు అతడిలో రగిలించిన ప్రతి కోర్కె, క్రితం రాత్రి అతడు కన్న ప్రతి కల, పారిపోవాలని అతడు తీసుకున్న నిర్ణయం– అన్నీ ఆయన వివరంగా వినిపించారు. భగవానుని కరుణ క్షణంలో అతని మనసులోని కల్మషాన్ని కడిగివేసింది. మనసు నిర్మలం కాగానే తన ఆలోచనకు తీవ్రంగా పశ్చాత్తాపపడ్డాడు. భగవానుని సన్నిధిలో అతడు ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్నాడు. అయితే ఈనాడే అతడికి నిజమైన సత్సంగం లభించింది. ఈ రోజే అతడు బుద్ధ భగవానుని వీణా నాదాన్ని విన్నాడు.

భగవానుడు అతడికి ఈ ధర్మ పద్యాలు వినిపించారు–

**దుప్పబ్బజం దురభిరమం దురావాసా ధరా దుఖా ।**
**దుక్ఖో సమానసంవాసో దుక్ఖానుపతి తద్ధగూ ।**
**తస్మా న చద్ధగూ సియ న చ దుక్ఖానుపతితో సియా॥**
**సద్ధో సీలేన సంపన్నే యసోభోగ సమప్పితో ।**
**యం యం పదేసం భజతి తత్వ తత్థేవ పూజితో ॥**

అనగా –

*చెడు బ్రతుకులో మునిగిఉండడం దుఃఖదాయకం. వాసయోగ్యం కాని ఇంటిలో ఉండడం దుఃఖదాయకం. అసమానులు ప్రతికూలురు అయినవారితో ఉండడం దుఃఖదాయకం. కనుక సంసారంలో చిక్కుకోకు. దుఃఖంలో మునిగిపోకు.*

*శ్రద్ధ, శీలం కలిగిఉన్న వ్యక్తి, కీర్తి భోగములనుండి విముక్తి పొందిన వ్యక్తి సర్వతా పూజింపబడతాడు.*

భగవానుడు ఇచ్చిన ఈ సందేశాన్ని జీర్ణం చేసుకున్న భిక్షు వజ్జీపుత్తకు ఆ రోజున సంసారం అసత్యం అయింది. పరివ్రాజిక జీవనం నిజం అయింది.

☆ ☆ ☆

## నెల్సన్ సాహసయాత్ర

నార్వేకు చెందిన నెల్సన్ విపత్కరమైన పనులు చేయటంలో ఖ్యాతి చెందినవాడు. మొదట్లో ఈయన ఓడమీద సాధారణమైన నౌకరీ చేసేవాడు. తరువాత ఉత్తర ధ్రువానికి చెందిన అజ్ఞాత క్షేత్రాన్ని వెదకి పట్టుకోవటానికి కొందర్ని వెంటబెట్టుకొని బయలుదేరాడు. అడుగడుగునా మృత్యుభయమే. అయినా ఆ అన్వేషణ యాత్రను నెల్సన్ దిగ్విజయంగా ముగించాడు. అందరికంటే ముందుగా ఆ క్షేత్రంలో నార్వే జెండాను ఎగురవేశాడు.

తరువాత అనేక సవాళ్లు ఈయన ముందుకు వచ్చిపడ్డాయి. స్వీడన్ నుండి నార్వేకు స్వాతంత్ర్యం లభించింది. సైబీరియాకు చెందిన లక్షలాది మంది బందీలకు ఈయన విముక్తిని లభింపజేశాడు. ఆ రోజుల్లో రష్యాలో పెద్ద క్షామం ఏర్పడింది. లక్షలాది మంది ఆకలి చావులకు గురి అవుతుంటే ప్రపంచం మొత్తం నుండి సహాయాన్ని సేకరించి వారి ప్రాణాలు కాపాడటానికి ఈయన చేసిన కృషి అపారమైనది. ఈయనను నోబుల్ బహుమతితో సత్కరిస్తే ఈయన ఆ డబ్బును తక్షణం క్షామ పీడితుల సహాయార్థం ఖర్చుచేశాడు.

అతి సాహసోపేతమైన పనులు ఎవరు చేయగలరు అన్న ప్రశ్న ఉద్భవించినప్పుడు ఆలోచించకుండా వెంటనే నెల్సన్ పేరు చెప్పబడేది. ఇటువంటి మహా పురుషుల జీవితాలు విపత్తులు, కష్టాలమయము. అయినా అవి వీరిని ఏమీ చేయలేవు. ప్రగతి పథంలో వీరి పయనానికి ఏ మాత్రం ఆటంకాన్ని కలిగించలేవు. వీరి సాహసానికి పరాక్రమానికి భయపడి అవి ప్రక్కకు పారిపోతూ ఉంటాయి.

- ప్రజ్ఞాపురాణం నుండి

**అసత్యంతో డబ్బు సంపాదించవచ్చు. ఆనందాన్నీ, పవిత్రతనూ, లక్ష్యాన్నీ పొందలేము.**

# సాంఘిక సంస్కరణ తప్పనిసరి

మన సమాజంలో ఎన్నో మంచి లక్షణాలతోపాటు మరెన్నో చెడు లక్షణాలు కూడా ఉన్నాయి. మంచి లక్షణాలను దృఢంగా అవలంబించాలి. అనుచితములు, హానికరములు అయిన దురాచారాలను నిర్మూలించే సాహసం కూడ మనం చూపాలి. కాలంతో పాటు ఆచార వ్యవహారాలూ, కట్టుబాట్లూ మారడం అవసరం. ఈ మార్పు, ఈ సంస్కరణ ఆగిపోతే సమాజం క్రమంగా కుళ్లిపోతుంది. కాలం చెల్లిన ఆచారాలను వదులుకోవడం కాని, సంస్కరించడం కాని తప్పనిసరి.

**కాలానుగుణంగా మార్పులు తేవడం విజ్ఞత**

చలికాలంలో ఉన్ని బట్టలు వాడతాం. వేసవి రాగానే సన్నని బట్టలు ధరిస్తాం. అపుడు ఉన్ని బట్టలు పనికిరావు. వాటిని అలమారులలో పడవేస్తాం. వానా కాలంలో గొడుగు అవసరం. చలికాలంలో అవసరం లేదు. ఆరోగ్యంగా ఉన్నపుడు తీసుకునే ఆహారం జబ్బు చేసినపుడు పనికిరాదు. పంటలు బాగా పండిన రోజులలో పెట్టే ఖర్చును కరువుకాలంలో బాగా తగ్గించుకోవలసివస్తుంది. కాలానుగుణంగా మార్పులు జరగాలని అందరూ ఒప్పుకుంటారు. అందులోనే విజ్ఞత ఉంది. వేదకాలంలో యజ్ఞాన్ని ధార్మిక చర్యగా పరిగణించారు. తర్వాతి కాలంలో అందులో వికృతి ఏర్పడింది. జనం యజ్ఞాల పేరిట జంతుబలి సాగించారు. దేవతలకు కూడ బలులు ఇచ్చారు. యజ్ఞంలో మన చెడుగులూ, దుష్టప్రవృత్తులూ అనే పశుత్వాన్ని బలిఇస్తారు. ఇది మంచి సంప్రదాయం. కనుక, కాలంతో పాటు ఆచారాలూ మారతాయి. మంచి ఆచారాలుసైతం కొంతకాలం తర్వాత మూఢాచారాలుగా మారతాయి. జనం తమ చెడుగులను కలిపి మంచి లక్షణాలను సైతం వికృతం చేస్తారు. అపుడు ఆ ఆచారాలను సంస్కరించడం అవసరం అవుతుంది.

**అవసరాలకు అనుగుణంగా ఆలోచనలో మార్పు**

బుద్ధుడు ప్రబోధించిన అహింసా సిద్ధాంతం ఎంతో గొప్పది. కానీ, తర్వాతి కాలంలో ఆ సిద్ధాంతం కారణంగా పిరికితనం, అకర్మణ్యత ప్రబలాయి. ఆత్మరక్షణకు అవసరమైన పౌరుషం క్రమంగా క్షీణించింది. అపుడు ఆదిశంకరులు దానిని సంస్కరించే ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆయన అహింస యొక్క వికృత స్వరూపాన్ని ఖండించారు. కర్మణ్యతను పెంపొందించే అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

చాలా కాలం గడచిన తర్వాత వేదాంతం సైతం మిథ్యా అహంకారంగా మారసాగింది. జనం సమాజం పట్ల విరక్తి చెంది, వ్యక్తివాదులుగా తయారుకాసాగారు. స్వార్థపరులుగా తయారు కాసాగారు. ఈ చెడుగులను తొలగించడానికై సంత్‌లు భక్తి మార్గాన్ని ప్రచారం చేశారు. సామూహికతగా, సంఘటనగా మలచారు. ఫలితంగా హిందూ సమాజం కలసిమెలసి జీవించడం అవసరమని గుర్తించింది. విదేశీ దురాక్రణదారులను సంఘటితంగా ప్రతిఘటించడానికి ప్రయత్నించింది.

**సిక్కుమతంలో భక్తివాదం**

గ్రంథ సాహిబ్‌లోని గురునానక్ వాణి భక్తివాదంతో నిండి ఉంది. అయితే వాస్తవానికి సిక్కులు హిందూ సమాజంపై జరుగుతూన్న విధర్మీయుల దురాక్రమణలకు అడ్డుకట్ట వేయడంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆనాడు రాజకీయ, సామాజిక సంస్థలను నిర్మాణం చేయడం సాధ్యం కాని పరిస్థితి ఉన్నది. ప్రజలను మత జెండా క్రింద మాత్రమే సమీకరించే అవకాశం ఉన్నది. భక్తివాదంలో ఈ ప్రయత్నమే జరుగుతూ వచ్చింది. అయితే కాలక్రమంలో ఈ భక్తివాదం దంబాచారానికి కేంద్రంగా మారిపోయింది. ఎందుకూ పనికిరానివాళ్లు, బద్ధకస్థులు, మోసగాళ్లు ఈ ముసుగులో ప్రజల శ్రద్ధను వాడుకుని వారిని దోపిడీ చేయసాగారు. కనుక దాన్ని సంస్కరించే అవసరం ఏర్పడింది. అప్పుడు స్వామి దయానంద ఆర్యసమాజ్ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఎన్నెన్నో దురాచారాలను నిర్మూలించారు. ఒక మహత్తరమైన సంస్కరణ ధారను ప్రవహింపజేశారు.

ఈ సంస్కరణ కార్యం ఎల్లప్పుడూ జరుగుతూనే వచ్చింది. మహర్షులు ఆయా కాలాలలోని పరిస్థితులను గమనించి వివిధ స్మృతులను రచించారు. నేటి హిందూ చట్టం యాజ్ఞవల్క్య స్మృతి ఆధారంగా రూపొందించబడింది. కాలం మారడంతో స్మృతులనుకూడా మార్చడం అవసరమని మహర్షులు గుర్తించారు. ఆ ప్రకారం సమకాలీన విధి విధానాలను మార్చడానికి వారు సంకోచించలేదు.

మానవత్వంలోని నైతిక గుణాలను ప్రతిపాదించే ఆధ్యాత్మిక ధర్మం శాశ్వతమైనది, మారనిది. సత్యం, అహింస, బ్రహ్మచర్యం, అస్తేయం, దానం, పరోపకారం, తపస్సు, సంయమనం మున్నగు ఆధ్యాత్మిక నియమాలు అన్ని యుగాలలో

**దేశ కాల పాత్ర పరిస్థితులవల్ల ప్రభావితంకాని ఆధ్యాత్మిక వస్తువు 'సత్యం'.**

ఒకే విధంగా ఉంటాయి. అయితే ఆహార విహారాలు, వేష భూషలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు మున్నగు వ్యావహారిక ధర్మాలలో సమకాలీన పరిస్థితికి అనుగుణంగా మార్పులూ చేర్పులూ వస్తూ ఉంటాయి. ఒక కాలంలో ఎంతో మంచి వస్తువు కాలక్రమంలో పాడయితే, అలా శిథిలమైన దానిని వదులుకుని, దాని స్థానంలో కొత్త వస్తువును తెచ్చుకుంటాం. ముసలి ఎడ్లకు విశ్రాంతి ఇచ్చి కొత్త గిత్తలను కొనుక్కోవడం రైతులు మామూలుగా చేసే పనే. మన శరీరం బాగా ముసలిది అయిపోయినా మనం దానిని వదలకపోతే, ఈ ప్రపంచం ముసలివారితో రోగులతో నిండిపోతుంది. వీధివీధినా ఆసుపత్రులు వెలుస్తాయి.

ప్రతి మార్పూ అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కాని మార్పు జరగనిదే పని జరగదు. ప్రభుత్వోద్యోగులకు బదిలీలు అవుతూ ఉంటాయి. అందువల్ల ఉద్యోగులకు ఇబ్బందులు కలుగుతాయి. అయినా అవి తప్పనిసరి. ప్రభుత్వోద్యోగులు ఒకే స్థలంలో ఉండిపోతే వారి రాగ ద్వేషాల దుష్ప్రభావం ప్రజలమీద పడుతుంది. కనుకనే, ఎంతో ఖర్చయినా, ఉద్యోగులకు ఇబ్బంది కలిగినా బదిలీలు జరగడం అవసరం అవుతోంది. మార్పును వ్యతిరేకించేవారికి మార్పులో ఎన్నో ఇబ్బందులు కనిపిస్తాయి. వారి వ్యతిరేకతను సహిస్తూ సమాజం ముందుకుపోవలసి ఉంటుంది. ఇందుకు మరో దారి లేదు.

### దురాచారాల నిర్మూలన అవసరం

మన సమాజంలో ఎన్నో దురాచారాలూ, గడ్డి నమ్మకాలూ వ్యాపించి ఉన్నాయి. అవి సమాజాన్ని దొలిచివేస్తున్నాయి. ఇవి నిర్మూలం కావాలి. విజ్ఞతతో కూడిన దృక్పథాన్ని అవలంబించి, సంస్కృతీ విలసితం చేయడానికి అవసరమైన మార్పులకు సమాజాన్ని సన్నద్ధం చేయాలి. యుగం యొక్క పిలుపు ఇది.

మన సమాజం శ్రేష్ఠమైనది, ప్రాచీనమైనది. అయితే ఎన్నో దురాచారాలూ, వికృతులూ అందులో ప్రవేశించాయి. తలకు పట్టిన పేలను ఒక్కొక్కటిగా తీసి పారవేసినట్లు ఆయా కట్టుబాట్లనూ, ఆచారాలనూ వివేకమనే గీటురాయిపై గీసి సముచితమైనవాటిని ప్రోత్సహించాలి. అనుచితమైనవాటిని ఏరి పారవేయాలి. దూరదృష్టి కలిగిన రైతు తన పంటను కాపాడుకుంటూనే కలుపు మొక్కలను ఏరిపారవేస్తాడు. ఈ రెండో పని విషయంలో మనం అశ్రద్ధ చూపకూడదు.

పాతవాటిపై లేనిపోని మమకారం ప్రజలలో ఉన్న ఒక మానసిక దౌర్బల్యం. కొత్త దారిలో నడవాలంటే వారికి బెరుకూ, సంకోచమూ కలుగుతాయి. మంచిదాన్ని మంచిదని ఒప్పుకుంటూనే సంకోచంవల్ల దాన్ని స్వీకరించలేరు. చెడ్డదాన్ని చెడ్డదని ఒప్పుకుంటూనే దాన్ని వదులుకోవడానికి సాహసించరు. ఈ మార్పును పలువురు ఎగతాళి చేస్తారనీ, వ్యతిరేకిస్తారనీ వారు అనుకుంటారు. జనం రకరకాల మాటలు అంటారు, రకరకాల ప్రశ్నలు వేస్తారు, వాటికి సమాధానం చెప్పలేక మనం తికమకపడతాం, మన పరువు పోతుంది– అన్న ఆలోచన పసలేనిది, నిరర్థకమైనది. నిరుపయోగమైన ఆచారాలను వదులుకుని ఉపయోగకరమైన ఆచారాలను స్థాపన చేసే వీరులూ, సాహసికులూ ప్రజానాయకులు అవుతారు. మహాపురుషులు అవుతారు. యుగ ప్రవర్తకులు అవుతారు.

☆ ☆ ☆

### విల్సన్ దీక్ష

ఈస్టిండియా కంపెనీ విలియమ్ విల్సన్‌కు టంకశాల అధ్యక్షపదవి ఇచ్చింది. పదవి గొప్పది, పని తక్కువ కావటంవలన ఖాళీ సమయంలో ఈయన భారతీయ సంస్కృతిని లోతుగా అధ్యయనం చేశాడు. సమస్త మానవులకు అందుబాటులోనికి తేవాలన్న పరమోత్కృష్టమైన సంకల్పంతో వాటిని అనువదించే మహత్కార్యానికై అనేక మంది మహాపండితుల్ని సలహా, సంప్రదింపుల కోసం పదే పదే కలవవలసివచ్చేది. ఈయన వేదానికి భాష్యం వ్రాసేడు. ఇది ఈయన శిష్యుడైన మేక్స్ ముల్లర్ పేరుతో అచ్చువేయబడింది. జన మానస స్థాయికి దిగి వచ్చిన ఈ మహా గ్రంథం యూరప్ మొత్తంలో మహా సంచలనాన్ని గొనివచ్చింది. జీవితం తుదిఘడియ వరకు ఈయన భారతీయ ప్రాచీన సాహిత్యాన్ని అనువదిస్తూ, ప్రచురిస్తూ లభించిన జీవితకాలాన్ని ధన్యం గావించాడు. ఖాళీ సమయం దొరికితే చాలు. దాన్ని శ్రేష్ఠ కార్యాలతో సద్వినియోగం చేయటంలో విల్సన్‌కు సాటి మరెవ్వరూ ఉండరని చెప్పవచ్చు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**తన దృష్టిలో దిగజారిపోయిన వ్యక్తిని ఎవ్వరూ లేవదీయలేరు.**

యుగగీత

# యజ్ఞకర్మయే నిజమైన సన్యాసం

నాల్గవ అధ్యాయం 23వ శ్లోకంలో దివ్యకర్మలు చేసే వ్యక్తిని గురించి వ్యాఖ్య కొనసాగుతోంది.

**గత సంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః ।**
**యజ్ఞా యాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥**

అనగా - ఎవరి ఆసక్తి పూర్తిగా నశించిపోయిందో, ఎవరు దేహాభిమానంనుండి మమకారంనుండి విముక్తి పొందారో, ఎవరి చిత్తం ఎల్లప్పుడూ పరమాత్మయొక్క జ్ఞానంలో స్థిరపడి ఉన్నదో - యజ్ఞ భావంతో ఆచరణ చేసే అలాంటి వ్యక్తి జరిపే కర్మలన్నీ నశించిపోతాయి.

11వ శ్లోకంలో 'జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం' అని ఉన్నది. ఏ జ్ఞానం అది? నేను, భగవానుడూ ఒకటే అనే జ్ఞానం. మనం భగవత్ చేతనలోని ఒక కణం అనే జ్ఞానం. ఆ దశలో మనిషి బ్రహ్మీ స్థితిని చేరుకుంటాడు.

ఏసుక్రీస్తును శిలువ వేస్తున్న సమయంలో ఆయన తనను రక్షించమని కోరలేదు. ఆయన ఇలా అన్నారు- "నేనూ, నా తండ్రీ ఒక్కరమే. దాన్ని తెలుసుకోలేనివారిని రక్షించు." మనం రాముని వాళ్లం, రాముడు మనవాడు- అన్న తులసీదాసు సూక్తిలోని అంతరార్థం ఇదే. ఆ స్థితిలో పనులన్నీ భగవానునికోసం జరుగుతాయి. ఆ పనులు ప్రారబ్ధాన్ని నిర్మాణం చేయవు.

ఈ కర్మలో వ్యక్తికి పరమానందం, శాంతి కలుగుతాయి. మామూలు మనిషి తన సుఖంకోసం బాహ్య వస్తువులపై ఆధారపడతాడు. అందువల్ల అతడిలో కామనలూ, వాసనలూ కలుగుతాయి. ఆ కారణం వల్ల అతనిలో క్రోధం, దుఃఖం, శోకం, ఉద్వేగం, మనస్తాపం, అసూయ మున్నగునవి జనిస్తాయి. కనుకనే అతడు అన్ని వస్తువులనూ శుభం, అశుభం అనే తక్కెళ్లతో తూచుతాడు. కానీ, దివ్య ఆత్మపై వీటి ప్రభావం కలుగదు. అతడు దేనిమీదా ఆధారపడడు. సదా సంతృప్తిగా ఉంటాడు. (నిత్యతృప్తో నిరాశ్రయః- 4/20). అతడి అణువణువులో పరమాత్మయొక్క జ్యోతి వెలుగుతూ ఉంటుంది. అతడు బాహ్య సుఖాలలో సుఖం పొందినప్పటికీ, దానికి కారణం అతడికి వానిలో అభిరుచి ఉండడం కాదు. అతడు వాటిలో మునిగి దారి తప్పడు. తనలో ఉన్న ఆత్మకోసం, తన ద్వారా భగవానుణ్ణి వ్యక్తపరచడం కోసం, తనలోని శాశ్వత సత్యంకోసం ఆ సుఖం. ఆ వస్తువుల బాహ్యస్పర్శలో అతడికి ఆసక్తి ఉండదు. తనలోపల లభించే ఆనందమే అంతటా అతడికి కనిపిస్తుంది. ఆ ఆనందాన్నే అతడు అనుభూతి పొందుతాడు. అతడికి నచ్చిన వస్తువుల స్పర్శవల్ల సంతోషం కలుగదు. నచ్చని వస్తువుల స్పర్శవల్ల శోకమూ కలుగదు. అతడు అన్ని వస్తువులలోనూ అక్షయమైన ఆనందాన్ని పొందుతాడు.

వ్యక్తి అంధకారమయ జీవితాన్ని వదులుకున్నపుడు, కామోద్వేగాల బంధనాల నుండి విముక్తి పొందినపుడు (గత సంగస్య ముక్తస్య) అతడు జ్ఞానంలో స్థిరపడతాడు. అలాంటి ఆధ్యాత్మిక పురుషుడు తన పనులన్నింటినీ పరమేశ్వరునికి, పరమపిత పరమాత్మకు భక్తిమయ సమర్పణ భావంతో, యజ్ఞభావనతో చేస్తాడు. ప్రభువు కృపనూ, ప్రేమనూ ఆహ్వానించేందుకే అతడు కర్మలు చేస్తాడు. అతడికి కర్మమే పూజ.

రైదాస్ కర్మల వలె అతడి ప్రతి కర్మా పూజ అవుతుంది. ప్రగాఢమైన భావనతో చేసే కర్మ యజ్ఞకర్మ అవుతుంది. అతడికి అలౌకికమైన శక్తులు ప్రత్యక్షం అవుతాయి. అతడిలో శ్రద్ధతో కూడిన జ్ఞానం వ్యక్తమవుతుంది. 'శ్రద్ధ' అంటే శిశిరంలో సైతం వసంతాన్ని చూడడం. 'వసంతం' పట్ల విశ్వాసం. లేనిదాన్ని అంతర్ దృష్టిద్వారా చూడడం. అనంతత్వంపట్ల లోతయిన శ్రద్ధ. అంధకారంలో సైతం వెలుగును చూడడం. మన గురుదేవులు 21 శతాబ్దాన్ని ఉజ్వల భవిష్యత్తుగా చూపించిన విధంగా.

దివ్యకర్మలు చేసే వ్యక్తి ఒక పని చిన్నదా పెద్దదా అని చూడడు. భగవానుని పట్ల ప్రేమలో మునిగి కర్మ చేస్తాడు.

ఆదిశంకరులు ఈ భావనతోనే కర్మ చేశారు. సన్యాసి కర్మలను త్యాగం చేసిన వాడని మామూలుగా అనుకుంటారు. ఆదిశంకరులు సన్యాసానికి కొత్త భాష్యం చెప్పారు. తమ పరిధిలోనుండి బయటికి రాలేకపోయిన వ్యక్తులను ఆయన తమ ప్రభావంతో జాతికోసం సర్వస్వాన్నీ సమర్పించే కార్యశూరులుగా మార్చారు. అరబ్బులు జాతిపై దురాక్రమణ జరుపుతున్నారు. ఆదిశంకరులు ఆ దురవస్థను చూడలేకపోయారు. కర్మనుండి సన్యాసం పుచ్చుకోమని ఆయన చెప్పలేదు. విశ్వాత్మకు సమర్పితమైన కర్మ చేయమని, యజ్ఞ భావనతో కర్మ చేయమని ఆయన చెప్పారు. "కర్మణా న్యాసః ఇతి కర్మ సన్యాసః" - అని ఆయన వ్యాఖ్యానించారు. కర్మను సమర్పణ చేయడం కర్మసన్యాసమన్నది దానిలోని భావం. కానీ, ఈ వ్యాఖ్య తర్వాతి కాలంలో తారుమారు అయింది. "సంగం త్యక్త్వా" అనే ఆయన ప్రబోధం ప్రక్కకు తొలగిపోయింది. ఆసక్తిమఠం ఆస్థి మున్నగునవి ప్రతీకలుగా మిగిలిపోయాయి.

పరమపూజ్య గురుదేవులు ఇలాంటి పరిస్థితులలో వానప్రస్థంలోని పరివ్రాజక ధర్మానికి ప్రాణం పోశారు. దానికి 'నవసన్యాసం' అని పేరుపెట్టారు. వంద సంవత్సరాల పూర్వం స్వామి వివేకానంద దాని గొప్పతనాన్నే గానంచేశారు. యజ్ఞభావనతో చేసే కర్మయే నిజమైన సన్యాసం. అలాంటి వ్యక్తి చేసే మొత్తం కర్మ నశించిపోతుంది. యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే-అనే సూక్తియొక్క గొప్పతనాన్ని ఆయన నొక్కివక్కాణించారు.

★ ★ ★

**తాత్వికంగా - కష్టం సుఖానికి పూర్వ సంకేతం.**

బోధకథ

# ప్రార్థన చూపిన మహిమ

"భగవంతుడు ఇక్కడే ఉన్నాడా. దక్షిణ ధృవంలో లేడా"– అని అతడు నిండుగా నవ్వుతూ అన్నాడు. ఆయన ఎక్కడ ఉన్నా ఎల్లప్పుడూ మనను రక్షిస్తూనే ఉంటాడు. దీనికి ఎదురు మాట్లాడే అవకాశం ఎవరికైనా, ఎప్పుడైనా ఉన్నదా? శ్రీమతి విల్సన్‌కు తెలుసు, తన భర్త ఏమి చేయాలని నిశ్చయించినా, ఆయనను ఆపడం అసంభవమని.

మంచి ఎత్తరి. నిడుపైన దుర్బల శరీరం. నీలి కన్నులు. బంగారు వన్నె గలిగిన కేశసంపద. విల్సన్ అభిరుచి అద్భుతమైనది. ప్రతికూల పరిస్థితులలో చెక్కుచెదరని ధైర్య సాహసాలు. రోజంతా చురుకుగా పని చేస్తుంటాడు. ఎట్టి పరిస్థితులలోనూ ఉపాసనను విడువడు. ఎట్టి పరిస్థితులలోనూ శాకాహారాన్నే తీసుకుంటాడు. అన్నం, పప్పు, రొట్టె, ఉడికించిన ఆలుగడ్డలు, ఆకుకూరలు, కొద్దిగా అంజీరా పండ్లు అంతే.

దక్షిణ అమెరికానుండి ఒక బృందం దక్షిణ ధృవానికి అన్వేషణకు బయలు దేరారు. పేపర్లలో వార్తను చూడగానే తానుకూడా వస్తానని అతడు దరఖాస్తు చేశాడు. అనుమతి లభించింది. శ్రీమతి విల్సన్ వీడ్కోలు ఇవ్వడానికి వచ్చింది. భోజన విషయంలో తన పద్ధతులను సవరించుకోమని వేడుకున్నది. ఆ ప్రార్థన సహజమైనదే. మంచు కప్పబడిన ప్రదేశాలలో శాకాహారం దొరకదు. మద్యం సేవించనిదే మనుగడ కష్టం. ఇక జీవించేదెలా? ఆయనలో మార్పు లేదు. నా యోగ క్షేమాలను ఎవరు చూస్తారో ఆయన ప్రపంచంలో అందరి యోగ క్షేమాలనూ చూస్తారు గదా! ఇంక చింత ఎందుకు? భయమెందుకు? నేను స్పృహలో ఉన్నంతవరకూ ఆయనకు ప్రార్థన చేస్తూనే ఉంటాను. దాన్ని మర్చిపోను– అన్నాడు.

కాని భోజన సమస్య అంతటితో తీరిపోలేదు. యాత్ర మొదటి రోజున బృందంలో ఇతర సభ్యులు ఆయనతో ఖచ్చితంగా చెప్పారు– నీవు మాంసం తినవు. బ్రాందీ త్రాగవు. నీవు ఎక్కడికి పోతున్నావో తెలుసా? దక్షిణ ధృవ యాత్రకి! విల్సన్ చలించనేలేదు. నిన్ను సమీపంలో ఉన్న ద్వీపంలో వదిలివేస్తాము. అమెరికా పోవటానికి వారం రోజుల్లో నీకు సౌకర్యం దొరుకుతుంది– అని బృందం నాయకుడన్నాడు. నేను తిరిగిపోవటానికి రాలేదని మొరాయించాడు విల్సన్. వచ్చిన వారందరూ ఎవరి బాధ్యత మీద వారు వచ్చారు. ఎవరు చనిపోయినా, మరొకరి బాధ్యత లేదన్నాడు విల్సన్.

" మిత్రమా! అర్థం చేసుకోటానికి ప్రయత్నించు. చిక్కటి బ్రాందీ త్రాగనిదే శరీరంలో వేడి కలగదు. అక్కడ నీవు బ్రాందీ త్రాగనని వ్రతం తీసుకున్నావు. ఎలా జీవించగలుగుతావు? మన ఓడ ఎక్కువ దూరం వెళ్లదు. అక్కడి నించి స్లెడ్జి బండి మీదనే ప్రయాణం చేయాలి. భోజనం మనతోపాటు ప్రయాణం చేసే దుప్పుల మాంసం మాత్రమే. మరే ఆహార పదార్థమూ అక్కడ దొరకదు. పొందే సాధనాలు కూడా లేవు" అని విల్సన్ చేతులు పట్టుకుని నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు హెర్బర్ట్.

"నేను నీ సలహాకు, సానుభూతికి కృతజ్ఞుడిని. ఈ కష్టాలన్నిటి గురించీ నేను ఆలోచించాను. కాని భగవంతుడు సర్వ సమర్థుడని నీకెందుకు తెలియదు? ఆయన సర్వ వ్యాపకుడు. మనమెందుకు భయపడాలి? ఎందుకు చింతించాలి? అసలు నేను ఈ యాత్రకు బయలుదేరిందే నిర్జనమైన మంచు ప్రదేశంలో గూడా పరమాత్మ ఉన్నాడనీ, అక్కడ గూడా ప్రార్థన చేస్తే ఆయన వింటాడనీ విశ్వాసంతోనే" అని విల్సన్ ప్రేమపూర్వకంగా అన్నాడు.

"నేనూ నాస్తికుడిని కాను. కాని అంతటి ఆశావాదినయే సాహసం చేయలేను"– అన్నాడు హెర్బర్ట్. ఒక సామాన్య మానవుడు అంతకంటే ఎక్కువగా ఆలోచించలేడుగదా!

మనం ముందు ప్రార్థన చేద్దామని విల్సన్ ప్రస్తావించాడు. ప్రార్థనానంతరం భోజనం చేసి ఈ విషయాన్ని చర్చిద్దామన్నాడు. "పరమాత్మా! మా పరమపితా! నీవు సర్వవ్యాపకుడవు. నీవు ఈ హిమ ప్రదేశంలో కూడా ఉన్నావు. నేను ఇక్కడ ప్రణామం చేయటానికి వచ్చాను"– విల్సన్ కంఠం గద్గదమైంది. కనులనుండి అశ్రువులు జాలువారుతున్నాయి. "జగదీశ్వరా! నీ వొక్కడవే మా అందరకూ రక్షకుడవు, పాలకుడవు. నీవు ఇక్కడా ఉన్నావు. అన్ని చోట్లా ఉన్నావు. మేమెందుకు భయపడాలి? ఎందుకు చింతించాలి? మాకు శక్తినిచ్చేది నీవే గదా! మేము నీ మీదనే భరోసా కలిగి ఉన్నాము గదా! నీకే సమర్పణ చేసుకుంటున్నాము."

ఆ భయంకర యాత్రలో విల్సన్ అవసరం తమకెంతో ఉందని అందరికీ అర్థమైంది.

విల్సన్ అంటే అందరికీ ఆదరం కలిగింది. ఇక వెనుకకు పంపే విషయమే ఎత్తలేదు హెర్బర్ట్. ఆయన ఆలోచించాడు, "పరిస్థితులు విషమిస్తే ఆహార నియమాలు అప్పుడే నశించిపోతాయిలే. ఇప్పుడు దాన్ని గురించి మాట్లాడటం అనవసరం" అని.

అందరూ విల్సన్‌తోపాటు ప్రార్థన చేయటం మొదలుపెట్టారు. అందరికీ ప్రార్థనలో గల అద్భుతమైన ప్రభావం అనుభవంలోకి వచ్చింది. నౌకను వదిలిపెట్టి అందరూ స్లెడ్జి బండ్లమీద ప్రయాణం సాగించారు. మంచు తుఫానులు. మంచు కురవడం. 30, 50 గజాల ఎత్తున పేరుకుని దారి మూసుకుపోవటం. నిజానికి మార్గమే లేకుండా

**జ్ఞాన యజ్ఞాన్ని మించిన శుభకార్యం లేదు.**

పోయింది. దిక్సూచి విపత్తు ముంచుకువచ్చినట్లు చూపింది. దారుణ విపత్తు వచ్చినప్పుడు అందరూ ఒక చోట చేరారు. ప్రార్థన చేశారు. ప్రార్థన వల్ల ఆపద తొలగిపోతుంది, మార్గం సుగమమవుతుందని నమ్మేరు.

మంచు. ఎక్కడ చూచినా మంచు. నలు వైపులా మంచు. పచ్చదనమనేది ఎక్కడా లేదు. దుప్పులు, స్లెడ్జి బళ్లు లాగే కుక్కలు తప్పితే మరే జంతువులూ లేవు. హిమప్రాంతంలో కుక్కలు కూడా భయంకరంగా ఉంటాయి. దుప్పులను చంపి తింటుంటాయి. కుక్కలు మనుష్యులవలె ఆలోచించలేవు. ఆకలిని నియంత్రించలేవు. స్లెడ్జిని ఈడ్చి ఈడ్చి అలసి పోతాయి. ఆకలయితే దుప్పులు తప్పితే వాటికి వేరే ఆహారం మాత్రం ఏమి దొరుకుతుంది? అటువంటప్పుడు వాటిని అదుపుచేయటం చాలా కష్టం. తడవ తడవకూ మంచు పొరలలో పెరిగే నాచును తినడంకోసం దుప్పులను మేతకు వదలవలసి వస్తుంది.

అటువంటి సమయాలలో విల్సన్ అందరికీ ఆసరా. అతడొక్కడే బృందానికి భారంకాకుండా మిగిలాడు. మిగిలినవారు బ్రాందీ, విస్కీలు త్రాగుతుంటే, ఈయన మంచును కరిగించి, వేడి చేసి నీటిని త్రాగి సరిపెట్టుకునేవాడు.

'నేను మేతకు పోతున్నాను' అని అతడంటే అందరికీ నవ్వు వచ్చేది. ఆ ఆంగ్ల యువకుడు విచిత్రమైన మనిషి. దుప్పులతోపాటు మంచుక్రింద పెరిగే నాచును ఏరుకు తినేవాడు.

"మనమింక వెనుదిరిగి పోదాం" అనుకున్నారందరూ. కుక్కలు స్లెడ్జి బళ్లను ముందుకు లాగలేకపోతున్నాయి. దుప్పులు ఎటో పారిపోయాయి. లక్షణాలు సరిగా లేవని విల్సన్ సలహా ఇచ్చాడు. మంచు తుఫాను కొద్దిరోజుల్లో తగ్గిపోతుంది, మనం నౌక వద్దకు తిరిగి పోవచ్చునన్నాడు.

వెనుదిరిగి నప్పుడు కుక్కలు స్లెడ్జి బండ్లను జోరుగానే ఈడుస్తున్నాయి. మంచు ప్రాంతాన్ని ఎంత త్వరగా వదిలిపెడితే అంత మంచిదని అవి భావించి ఉండవచ్చు.

యాత్రికులందరూ నౌకమీదికి చేరుకున్నారు. సముద్రయానం ప్రారంభమైంది. కొంతదూరం వెళ్లిన తరువాత నౌక ఆగిపోయింది. నేలకు నీటికి అంతరం తగ్గిపోయింది. తెల్లని గొడుగు లాంటిది ఆవరించింది. భూమి ముసలిదై చనిపోతే తెల్లని వస్త్రం కప్పినట్లుగా వారికి కనిపించింది. కేవలం మృత్యువు మాత్రమే వారి ఎదుట కనిపిస్తున్నది. మృత్యుచ్ఛాయ నల్లగా ఉంటుంది కాని ఇక్కడ శుభ్రమైన తెల్లని అంతుగనలేని కోమల, శీతల శుభ్రవర్ణం ధరించి మృత్యువు వస్తున్నదా! అన్నట్లున్నది. నౌక మంచులో కూరుకు పోయింది. బయటికి ఏమీ కనిపించటం లేదు. యాత్రికులు నౌక నుండి బయటికి వచ్చే సాహసం చేయలేక పోయినారు. కుక్కలు పాపం చచ్చిపోయినాయి. స్లెడ్జిలాగడానికే వాటి శక్తంతా ఖర్చయిపోయింది. మార్గంలోనే హిమపాతం ప్రారంభమైంది. యాత్రికులందరూ పరుగులు పెట్టుకుంటూ నావలో చేరడమే గగనం. ఇంక వాటి సంరక్షణ ఎక్కడ? ఋతువు మారిన తర్వాత వారి శవాలు మాత్రమే కష్టం మీద దొరకవచ్చునంతే. వారు కేవలం నీరు త్రాగి జీవిస్తున్నారు. చివరికి ఆ మంచి నీరు కూడా ఐపోయింది. బ్రాందీ ఎప్పుడో ఐపోయింది. స్పిరిట్ దీపం మీద మంచు కరిగించి కొన్నాళ్లు త్రాగారు. స్పిరిట్ కూడా ఐపోయింది.

ఆహారం లేదు. చావు ముంచుకు వస్తున్నది. ఎవరికీ ఆశ లేదు. ప్రార్థన చేసినా ఇప్పుడు ఉపయోగం లేదు. ఎవరికీ అసలు మెదడు పని చేయటం లేదు. మరణం కోసం ఎదురు చూస్తున్నారంతే. కేవలం విల్సన్ మాత్రమే ప్రతి నిత్యం ప్రార్థన చేస్తున్నాడు. కాలం గడియారం చూస్తేనే తెలుస్తున్నది. మోకాళ్ల మీద కూర్చుని ఎలుగెత్తి ప్రార్థన చేస్తున్నాడు. "హే ప్రభూ! నాకేం వద్దు. నా కోరిక నన్ను మరచిపోవద్దని మాత్రమే."

ప్రార్థన చేసిన అద్భుతం. స్పిరిటు అయిపోయింది. ఐసుముక్కలు నోటబెట్టుకుని చప్పరించాడు. బ్రాందీ త్రాగేవారంతా పడిపోయారు. శాకాహారి విల్సన్ మాత్రం నిలబడి ఉన్నాడు.

అరవై రోజులు గడిచిపోయాయి. నిత్య ప్రార్థన చేస్తున్నాడు విల్సన్. తలకాయ తిరిగి పోతోంది, శరీరం అదుపు తప్పింది. కళ్లు మూసుకుపోతున్నాయి. పరమాత్మా! అని ఒక శబ్దం మాత్రమే పలుకగలిగాడు. ఎవరొస్తారు? అంతా భ్రమ. కాని తలుపు తెరిచే చప్పుడు. నిజమే, ఎవరో వచ్చారు. నాకు నీరు చాలంటే విల్సన్ నోరు తెరిచి బాటిల్ పెట్టారు. నాతోపాటు అరవైమంది మృత్యువుతో పోరాడుతున్నారని వారికి చెప్పాడు విల్సన్. అసలు సంగతి - వారి అంతిమ సందేశం అమెరికాకు అందింది. అయినా చలికాలంలో అంటార్టికా ఎవరు పోతారు?

పేపర్లో చూచి వీరిని రక్షించాలని ఒక యువకుడు సంకల్పించాడు. ఏంతో కష్టపడి యాత్ర చేశాడు. ప్రాణమైనా ఇచ్చి పరోపకారం చేయాలనుకునేవారికి సహకారం లభిస్తుంది.

కుక్కలు, స్లెడ్జిబళ్లు, దుప్పులు అన్నీ దొరికాయి అక్కడి అమాయిక అంటార్టికా వాసులవద్ద. సరైన సమయానికి గమ్యం చేరుకున్నాడు. మధ్యలో దుప్పులు కొన్ని ఈనాయి, వాటి పోషణే ఇప్పుడు విల్సన్‌కు పట్టింది.

ముందు ప్రార్థన చేయాలి, తరువాతనే పాలు త్రాగడం అన్నాడు విల్సన్. అందరూ అతనితోపాటు మోకరిల్లారు. అతని ప్రార్థనా ప్రభావం అందర్నీ ముంచెత్తింది. అందరూ కలసి ప్రార్థన చేశారు. ప్రార్థనకు ముందే తెలిసింది, ఒక ఓడ పూర్తి సామగ్రితో వారిని తీసుకుపోవడానికి వస్తున్నదని. విల్సన్ ప్రార్థనే వారందరినీ కాపాడిందని నిర్ణయించుకున్నారు. తిరిగి పెళ్లాం, పిల్లలను చూచుకునే భాగ్యం విల్సన్ వల్లనే లభించిందని వారి భావన. అదంతా ప్రార్థన మహిమ. ఇచ్ఛాశక్తి, పరమాత్మ అనుగ్రహం - ఈ రెంటిపైనే సమస్త సృష్టి ఆధారపడి ఉన్నది.

అనువాదం : డి.వి.ఎన్.బి.విశ్వనాథ్

**అందరి శ్రేయస్సులో తన హితాన్ని చూచే వ్యక్తి విజ్ఞుడు.**

## కృష్ణావతారం - 11
# కంస వధ

**తయోస్తదద్భుతం వీర్యం నిశామ్య పురవాసినః ।**
**తేజః ప్రాగల్భ్యం రూపంచ మేనిరే విభుధోత్తమౌ ॥**

నగరవాసులు ఆ సోదరులిరువురి అద్భుత పరాక్రమమును గూర్చి విని, వారి తేజస్సును, సాహసమును, సాటిలేని రూపమును చూచి వీరు ఇరువురు ఎవరో దేవతా శ్రేష్ఠులని భావించిరి.

(1) సత్కర్మ పరాయణులగు వ్యక్తులు జనుల శ్రద్ధకు అధికారులగుదురు.
(2) మానవుని గుణములు వానికి దేవతలవంటి శ్రద్ధను కలిగించును.

ఇట్లు ఒకనాడు నగరమునంతటిని చూచి, దుష్టుల మనోబలమును అణచి, జనుల మనస్సులను తమవైపు త్రిప్పుకొని సోదరులిరువురు తమ మకామునకు తిరిగి వచ్చిరి.

**అవనిక్తాంఘ్రియుగళౌ భుక్త్వా క్షీరోపసేచనమ్।**
**ఊషతుస్తాం సుఖం రాత్రిం జ్ఞాత్వా కంస చికీర్షితమ్ ॥**

కాలుసేతులు కడిగి శ్రీకృష్ణ బలరాములు పాయసము మున్నగు పదార్థములను సేవించి, కంసుడు ముందు ఏమి చేయబోవు చున్నది తెలిసికొని ఆరాత్రి అక్కడే సుఖముగ నిద్రించిరి.

(1) నిర్మలము సాత్త్వికము పౌష్టికమునగు ఆహారమును స్వీకరింపవలెను.
(2) శత్రువుయొక్క పోకడలను తెలిసికొని ముందుగనే ప్రణాళికను ఏర్పరచుకొని సిద్ధముగా ఉండవలెను.
(3) జటిలమైన స్థితిలో గూడ ఎట్టి చింతయులేక తప్పక విశ్రాంతిని పొందవలెను.

కంసుడు రాత్రి అంతయు కలవరపాటుతో ఉండెను. వాని మనస్సులో వివిధములగు అశుభ సంకల్పములు కలిగెను. అదేవిధములగు దృశ్యములు కనబడసాగెను. సూర్యోదయముతో పాటు విశేషమగు ఉత్సవము ఆరంభమయ్యెను. రంగస్థలమున జనులందరు తమతమ స్థానములో వెళ్లి కూర్చుండిరి. కంసుడు సింహాసమున కూర్చుండినంతనె మల్లవీరులు చేతులు చరిచిరి, నగారాలు మ్రోగెను. స్నానసంధ్యాదులు పూర్తిచేసి సోదరులిరువురు నగారాల ధ్వనులు విని రంగస్థలమును చూచుటకు వెడలిరి.

రంగస్థల ప్రధాన ద్వారమునందే కువలయాపీడమను ఏనుగు త్రోవను అడ్డగించి నిలుచుండెను. మావటివాడు వెళ్లుటకు వారికి త్రోవ ఈయవలసినది పోయి వారిపైకి ఏనుగును పురికొల్పెను. శ్రీకృష్ణుడు కొద్దిసేపు దానితో ఆడెను. దానిని బాగా ఇబ్బందిపెట్టి తొండము పట్టుకొని గిరగిరత్రిప్పి మావటివానితో పాటు దానిని సంహరించెను. సోదరులిరువురు దానిదంతములను చేతబట్టుకొని మిత్రులతో గూడ రంగస్థలమును ప్రవేశించిరి.

**మల్లానామశునిర్నృణాం నరవరః స్త్రీణాం స్మరో మూర్తిమాన్**
**గోపానాం స్వజనోఽసతాం క్షితిభుజాం శాస్తా స్వపిత్రోః శిశుః ।**
**మృత్యుర్భోజపతే ర్విరా డవిదుషాం తత్త్వం పరం యోగినామ్**
**వృష్ణీనాం పరదేవతేతి విదితో రంగం గతః సాగ్రజః ॥**

శ్రీకృష్ణభగవానుడు బలరామునితో రంగస్థలమున ప్రవేశించగానే ఆయన మల్లయోధులకు వజ్రకఠోరమైన శరీరముకలవాడుగను, సామాన్య మనుష్యులకు నరోత్తముడుగను, స్త్రీలకు మూర్తీభవించిన మన్మథునిగను, గోపాలురకు ఆత్మీయుడుగను, దుష్టులకు శిక్షించు శాసకుడుగను, తల్లిదండ్రులకు శిశువుగను, కంసునకు మృత్యువుగను, అజ్ఞానులకు విరాట్పురుషుడుగను, యోగులకు పరమ తత్త్వముగను, వృష్ణి వంశీయులకు పరదేవతగను కనబడెను.

(1) భగవంతునిలో అన్ని గుణములు ఉన్నవి. ఆయనను ఎవడు ఏ దృష్టితో చూచునో వానికి ఆయన ఆ విధముగా కనబడును.

ఇట్లు కువలయాపీడ మను ఏనుగు నుండి తప్పించుకొని వచ్చుచున్న కృష్ణుని చూచి చాణూరుడు కపటముతో గూడిన శబ్దముల నిట్లు పలికెను- "రమ్ము, మహారాజగు కంసుని సంతోషపెట్టుటకై మనము మల్ల యుద్ధము చేయుదము. అడవిలో గొల్లవారు ప్రేమతో మల్లయుద్ధము చేయుచుందురు." కృష్ణుడు పలికెను – "మంచిది, రాజు సంతోషమునకే మనము ప్రయత్నింపవలెను. కాని

**బాలా వయం తుల్యబలైః క్రీడిష్యామో యథో ఉచితమ్ ।**
**భవేన్ని యుద్ధం మా ఉధర్మః స్పృశేన్మల్ల సభాసదః ॥**

చాణూరా! మేము ఇంకను బాలురమే, అందువలన మేము మాతో సమానబలము కల బాలురతోనే ఆడగలము. మల్లయుద్ధము సమానబలము కలవారితోనే జరుపవలెను. దానివలన చూచువారికి అన్యాయమును సమర్థించు పాపము కలుగకుండుగాక!

(1) అన్యాయముగ ప్రవర్తించు వారికేకాక ఆ అన్యాయమును చూచియు దానిని నిరోధించని వారికి గూడ ఆ పాపము కలుగును.

**స్వార్థానికికన్నా పరమార్థానికి ఎక్కువ విలువ ఇచ్చేవాడు ధన్యుడు.**

చాణూరుడు కృష్ణుని మాట విని ఇట్లు పలికెను. మీరు ఇద్దరు సోదరులు బాలురశ్రేణికిగాని కిశోరుల శ్రేణికిగాని కాక ఉత్తమ మల్లయోధుల శ్రేణికి చెందినవారు. నీవు వేయియేనుగులతో సమానమైన బలము గలిగిన కువలయాపీడమును తేలికగా చంపితివి. అందువలన నీవు నాతోను, బలరాముడు ముష్టికునితోను యుద్ధము చేయుడు. దీనిలో ఎట్టి అన్యాయము లేదు.

భగవానుడు ఏమాత్రము చలించలేదు. పూల గుత్తితో కొట్టినచో గజరాజు చలింపనట్లు ఆయన ఉండెను. అయన చాణూరుని రెండు భుజములను పట్టుకొని అంతరిక్షములో మిగులవేగముగ చాలామారులు త్రిప్పెను.

**భూపృష్ఠే పోథయామమాస తరసా క్షీణ జీవితమ్ ।**
**విస్రస్తా కల్పకేశస్రగిన్ద్రధ్వజ ఇవా పతత్ ॥**

శుకుడు పలికెను– పరీక్షిన్మహారాజా! పైన త్రిప్పునప్పుడే చాణూరుని ప్రాణములు ఎగిరిపోయెను. కృష్ణుడు వానిని నేలపై గొట్టెను. వాని అలంకారములు అస్తవ్యస్తములయ్యెను. కేశములు మాలలు చెదరెను. వాడు ఇంద్రధ్వజమువలె నేలపై బడిపోయెను.

ముష్టికుడు గూడ బలరాముని గ్రుద్దెను. దానికి బదులుగా బలరాముడు వానిని చెంపపై గొట్టెను.

**ప్రవేపితః స రుధిరముద్వమన్ ముఖతో ఒర్దితః ।**
**వ్యసుః పపాతో ర్వ్యుపతస్థే వాతాహత ఇవాంఘ్రిపః ॥**

ఆ దెబ్బకు వాడు కంపించెను. తుఫాను చేత కొట్టబడిన వృక్షమువలె మిగుల వ్యథితుడై, చివరకు ప్రాణహీనుడై నెత్తురు గ్రక్కుకొనుచు నేలపైబడెను.

(1) ఇరువురు సోదరులు మొదట విలాసముగ క్రీడింపసాగిరి. దుష్టులగు ఆ మల్ల యోధులు వారిని గట్టిగా కొట్టగా వారు గూడ వారికట్లే సమాధానము చెప్పి వారిని సంహరించిరి.

చాణూర ముష్టికులు నేలపై బడిపోవుట చూచి కూటుడు, శలుడు, తోశలుడు అను మల్లవీరులు ఒక్క మారుగ ఇరువురు సోదరులపై విరిచుకు పడిరి. ఆ యిరువురు వీరులు ఒక్కొక్క దెబ్బతో వారిని హతమార్చిరి.

ఈ అద్భుత పరాక్రమమును చూచి జనులు భేష్ భేష్ అని పలికిరి. కాని కంసుడు మిగుల కుపితుడయ్యెను. తన సేవకులతో "ఈ బాలురను నగరమునుండి వెళ్లగొట్టి గోపాలుర సంపదనంతటిని స్వాధీనముచేసికొనుడు, వసుదేవుని ఉగ్రసేనుని సంహరించుడు." అని పలికెను. ఇది విని కృష్ణుడు ఎగిరి వాని సింహాసనముపైకి చేరెను. కంసుడు కత్తి డాలు తీసికొని వానిని కొట్టసాగెను. కాని కృష్ణుడు వేగముగ వాని దెబ్బలు తప్పించుకొని వానిని పట్టుకొనెను.

**ప్రగృహ్యా కేశేషు చలత్కిరీటం**
**నిపాత్య రంగోపరి తుందమంచాత్ ।**
**తస్యోపరిష్టాత్ స్వయమబ్జనాభః**
**పపాత విశ్వాశ్రయ ఆత్మతన్త్రః ॥**

ఇంతలో కంసుని కిరీటము క్రిందపడెను. భగవానుడు వాని జుట్టుపట్టుకొని వానిని గూడ ఆ ఉన్నతమైన సింహాసనమునుండి రంగస్థలములో బడవేసెను. ఆత్మనియంత్రితుడు, విశ్వమునకంతటికి ఆశ్రయుడునగు శ్రీకృష్ణ భగవానుడు వానిపైకి దుమికెను.

(1) తన్నుతాను నిగ్రహించుకొనినవాడు ఎవనికైన ఆశ్రయ మీయగలడు.

శ్రీకృష్ణుడు కంసునిపైకి దుమికి నంతనె వాని ప్రాణములు ఎగిరిపోయెను. ఇది చూచి న్యగ్రోధుడు మున్నగు కంససోదరులు ఎనమండుగురు బదులుతీర్చుకొనుటకై ఒక్కమారు పరుగిడిరి.

**తథాతది రభసాంస్తాంస్తు సంయత్తాన్ రోహిణీసుతః ।**
**అహన్ పరిఘముద్యమ్య పశూనివ మృగాధిపః ॥**

భగవానుడు బలరాముడు– వారు యుద్ధమునకు సిద్ధమై వేగముగ పరుగిడి వచ్చుచుండుట చూచి తన పరిఘ అను ఆయుధమును తీసికొని సింహము పశువును చంపునట్లు దానితో వారిని చంపివేసెను.

(1) ఇరువురు సోదరులు ఒకరికొకరు పూరకులుగా ఉండిరి. శత్రువుల సంకల్పమును తెలిసికొని దానికి ప్రతీకారము చేయుటయే యుద్ధకౌశలము.

కంస వధకు దేవతలు సజ్జనులు ప్రసన్నులైరి. వాని సోదరుల భార్యలు విలపింపసాగిరి. పశ్చాత్తాపము చెందుచు వారిట్లు పలుకసాగిరి.

**అనాగసాం త్వం భూతానాం కృతవాన్ ద్రోహముల్బణమ్ ।**
**తేనేమాం భో దశాం నీతో భూతధ్రుక్కో లభేత శమ్ ॥**

స్వామీ! నీవు నిరపరాధులగు పెక్కు ప్రాణులను బాధించితివి. వారికి చాలా ద్రోహము చేసితివి. కనుకనే నేడు నీ కీదశ సంభవించినది. జగత్తులో ప్రాణులను హింసించువాడు ఎవ్వడైనను శుభమును పొందగలడా?

(1) తన స్వార్థము వలన లేదా అహంకారము వలన అమాయకులగు ప్రాణులను బాధించినచో వానికి తప్పక దుర్గతి కలుగును.

(2) తన వారిని అవినితి నుండి తప్పింపనిచో వారు ఈ విధముగనే పశ్చాత్తాపము చెందవలెను.

**అజ్ఞానం ఒక విషవృక్షం; ఆపదలకూ, దుఃఖాలకూ జనని.**

అటు తరువాత శ్రీకృష్ణుడు తల్లి దండ్రుల దగ్గరకు వెళ్లి వారికి నమస్కరించి వారిని కారాగార విముక్తులను చేసెను. అందరు ప్రేమ విహ్వలురై కలసికొనిరి. వసుదేవుడు వారిని ప్రశంసించెను. కాని కృష్ణుడు – మేము ఇంతవరకు మీకు సంతోషమును కలిగింపలేక పోయితిమి, మిమ్ము సేవింపలేకపోయితిమి. ఇది మా దురదృష్టము" అని పలికెను.

**సర్వార్థ సంభవో దేహో జనితః పోషితో యతః ।**
**న తయోర్యాతి నిర్వేశం పిత్రోర్మర్త్యః శతాయుషా ॥**

తల్లి తండ్రులే ఈ శరీరమునకు జన్మనిత్తురు. దీనిని పెంచిపోషింతురు. అప్పుడు ఎక్కడైనను ఈ శరీరము ధర్మమును, అర్థమును, కామమును లేదా మోక్షమును పొందుటకు సాధకమగును. ఎవ్వడైనను నూరు సంవత్సరములు జీవించి తల్లిదండ్రులను సేవించుచున్నచో అప్పటికిని వారి యుపకారమును తీర్చికొనలేడు.

తల్లి తండ్రులు ఎప్పుడైనను తప్పు చేయవచ్చును. పిల్లలు దానిని వ్యతిరేకించినను వారికి యుపకారమునకు కృతజ్ఞతను వ్యక్తము చేయుచు వారిని సేవింపవలెను.

**మాతరం పితరం వృద్ధం భార్యాం సాధ్వీం సుతం శిశుమ్ ।**
**గురుం విప్రం ప్రసన్నం చ కల్పోఽబిభ్రచ్ఛ్వసన్మృతః ॥**

సమర్థుడైయుండియు పురుషుడు తల్లిని, తండ్రిని, కుల వృద్ధులను, సాధ్వియగు భార్యను, శిశువైన పుత్రుని, గురువును, బ్రాహ్మణుని, ఆశ్రితులను పోషించకపోయినచో వాడు జీవించి యుండగనే మరణించిన వాడగును.

(1) శవము ఎవరిదైనను దానిని జనులు అసహ్యించుకొందురు. దానిని త్వరగనే నశింపచేయుట మంచిది. తన బాధ్యతలను ఉపేక్షించు వ్యక్తి పట్లగూడా ఇట్లే జరుగును.

**ఏవమా శ్వాస్య పితరౌ భగవాన్ దేవకీసుతః ।**
**మాతామహం తూగ్రసేనం యదూనా మకరోన్నృపమ్ ॥**

దేవకీ నందనుడగు శ్రీకృష్ణ భగవానుడు ఇట్లు తన తల్లి తండ్రులను ఓదార్చి తన తాతయగు ఉగ్రసేనుని యాదవులకు రాజుగ చేసెను.

ఉగ్రసేనుని సింహాసనముపై కూర్చుండ బెట్టినపుడు ఆయన శ్రీకృష్ణుని 'నీవు నీ పరాక్రమముతో కంసుని సంహరించితివి. అందువలన నీవే రాజ్యమునకు అధికారివి" అని పలికెను. అపుడు శ్రీకృష్ణుడిట్లు పలికెను.

**న హి రాజ్యే న మే కార్యం నావ్యహం నృపకాంక్షితః ।**
**నచాపి రాజ్యలుబ్ధేన మయా కంసో నిపాతితః ॥**
**కిం తు లోక హితార్థాయ కీర్త్యర్థం చ సుతస్తవ ।**
**వ్యంగ భూతః కులస్యాస్య సానుజో వినిపాతతః ॥**

మహారాజా! నాకు రాజ్యము వలన ఎట్టి ప్రయోజనము లేదు. నేను రాజ్యమును గూడా కోరుట లేదు. రాజ్యకాంక్షతో నేను కంసుని సంహరించలేదు. నేను లోకహితముకై దుష్టులను అణచితిని, నా సనాతన ప్రతిష్ఠను రక్షించుటకై సోదరులతో గూడా నీ పుత్రుని సంహరించితిని. అతడు వంశమునకు కుళ్లిపోయిన అవయువము వంటివాడు.

(1) ఉత్తమ పురుషుడు వ్యక్తి గతమగు కాంక్షకొరకు లేదా కీర్తి కొరకు కాక జనహితమునకై కష్టపడుచు ప్రమాదములను ఎదుర్కొనును.

(2) తన శరీరములో ఏ అవయవమైనను చెడిపోయినచో దానిని ఖండించివేయుట జరుగును. అట్లే స్వజనులు వికృతులైనచో వారితో సంబంధమును త్రెంచుకొనవలెను.

కంసుని దుర్మార్గమునకు దుఃఖితులై ఎందరో ఉత్తములు ఇండ్లను వదిలి ఇతర ప్రదేశములకు వెళ్లిపోయిరి. శ్రీకృష్ణుడు యదు–వృష్ణి– అంధక– మధు – దాశార్హ – కుకుర వంశీయులైన తన వారినందరిని వెదకి వెదకి పిలిచి వారిని ఓదార్చి తమతమ స్థానములయందు నిలిపెను. వారి యధికారము వెనుకకు లాగి వేయబడెను. వారికి మరల అధికారమిప్పించుట న్యాయమైయున్నది.

శ్రీకృష్ణ బలరాములు రాజ్యములో ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పిరి. తాము ఏపదవిని కోరక అందరి రక్షణ బాధ్యతను, మార్గదర్శన బాధ్యతను స్వీకరించిరి.

**కృష్ణ సంకర్షణ భుజైర్గుప్తా లబ్ధమనోరథాః ।**
**గృహేషు రేమిరే సిద్ధాః కృష్ణరామగతజ్వరాః ॥**

యదువంశీయులందరు శ్రీకృష్ణ బలరాముల బలముచే సురక్షితులుగా నుండిరి. వారి దయ వలన వారికెట్టి వ్యథగాని దుఃఖముగాని కలుగలేదు. వారు ధన్యులైరి. నేడువారు తమతమ గృహములలో ఆనందముతో సంచరింపసాగిరి.

* * *

## పట్టుదలకు ప్రతిరూపం

ఒక నాల్గు సంవత్సరాల పాప కాలికి పోలియో వచ్చి, ఇతరుల సహాయంతో అతి కష్టం మీద నడిచేది. కానీ అంతరంగంలోని సాహసం ఆమెను అడుగడుగునా నడవమని, పరుగుపెట్టమని ప్రోత్సహిస్తూ ఆమె చేత అభ్యాసం చేయించింది. చివరకు ఆపాప ఒలింపిక్ గేమ్స్‌లో మూడవ స్థానాన్ని గెల్చుకొన్నది. అంతరంగంలో నిండియున్న సాహసం శక్తిహీనమైన అవయువాన్ని కూడ సునాయాసంగా ఆరోగ్యవంతంగా మార్చి వేయగలదు అని ఋజువు చేసిన ఈ పాప పేరు గోల్డెన్ రులాఫ్. దీక్షకు, పట్టుదలకు ప్రతిరూపమైన రులాఫ్ అమెరికాలోని టెన్నిసీ ప్రాంతంలో ఉండేది.

-ప్రజ్ఞాపురాణం నుండి

**జిహ్వాచాపల్యం ఆరోగ్యానికి గొడ్డలిపెట్టు.**

## నావారితో నామాట

# గురు సత్తా దివ్య స్వరూపం

167 సంవత్సరాల క్రితం 1836లో ఒక మహాపురుషుడు భారతవర్షానికి దిగివచ్చారు. బెంగాలులోని బాంకురా జిల్లా కామార్పుకుర్‌లో 1836 ఫిబ్రవరి 18న ఒక బాలుడు జన్మించాడు. ఆయన ఎన్నో దివ్యలీలలు ప్రదర్శించి కలకత్తాలోని దక్షిణేశ్వరంలో స్థిరపడ్డారు. లౌకిక దృష్టిలో ఆయన కాళికాలయ పూజారి. క్రమ క్రమంగా ఆయన ఖ్యాతి నలుగడలా వ్యాపించింది. రామకృష్ణ పరమహంసగా పేరుపొందిన ఆ మహాపురుషుని చుట్టూ పరమేశ్వర ప్రాప్తిలో, బ్రహ్మ సాక్షాత్కారంలో అభిరుచి కలిగిన పలువురు చేరసాగారు. జాతీయవాద దృక్పథం కలిగిన పలువురు కూడ అక్కడికి చేరసాగారు. ఆయన సాధక వ్యక్తిత్వం, సరళ హృదయం, అమృతవాణి పలువురిని ఆకర్షించాయి. ఆ అమృతవాణి ఆతర్వాత శ్రీరామకృష్ణ వచనామృతం అనే మూడు భాగాల గ్రంథంగా ప్రచురితం అయింది. 1880 నుండి 1886 ఆగస్టు 16వరకు సుమారు 16మంది ఆయనను గురువుగా స్వీకరించి, ఆయన జీవన యాత్రలో భాగస్వాములు అయినారు. ఆయన మానసపుత్రులు అయినారు.

పరమహంస మహాప్రయాణం తర్వాత వారి మానసపుత్రులు లౌకిక జగత్తును వదిలి సన్యాసులు అయినారు. తేజస్వి, యుగ నాయకుడు అయిన వివేకానంద వారికి నాయకత్వం వహించారు. పరమహంస వివేకానందకు తన శక్తి అంతనూ ధారపోశారు. పరమహంస సహధర్మచారిణి అయిన శ్రీశారదామాత ఈ సన్యాసులందరికీ మార్గదర్శనం చేస్తూ వచ్చారు. మమతను పంచుతూ వచ్చారు. క్రమంగా శ్రీరామకృష్ణ మిషన్ రూపుదిద్దుకున్నది. పరమేశ్వర ప్రాప్తి జరగాలనే తీవ్ర ఆకాంక్ష కలిగిన వివేకానంద మిషన్ నాయకత్వాన్ని స్వీకరించారు. వయస్సులో తనకన్న చిన్నవారు, పెద్దవారు, సమానులు అయిన తన సహచరులందరికీ ఆ క్లిష్ట సమయంలో అండగా నిలిచారు. వారికి ధైర్యం చెప్పారు. 20వ శతాబ్దపు భారత్‌కు పునాది వేసిన వ్యవస్థను నిర్మాణం చేశారు. ఈ 16మంది, వీరితోపాటు వికాసం పొంది పరమహంస స్పర్శను అనుభూతి పొందిన మరి 28మంది - మొత్తం 44మందితో కూడిన శిష్యగణం సామూహిక క్రమబద్ధ కృషికి విలక్షణ ఉదాహరణగా నిలిచింది. విశ్వ సాంస్కృతిక చరిత్రలో అలాంటి ఉదాహరణ మరొకటి కనిపించదు.

ఈ 16మంది సన్యాసులు 1886 నుండి 1900 వరకు వారాహనగర్ మఠం నుండి బేలూరు మఠం భూమివరకు జరిపిన జీవనయాత్ర ఒక అద్భుత ఘట్టం. బానిస భారతంలో సంకుచిత మనస్తత్వం కలిగిన ప్రజల మధ్య వారు కఠోరమైన తపస్సు చేశారు. పరివ్రాజక జీవనం, మధుకర వృత్తి, ప్రజల ఉపేక్ష, కఠోర సాధన, వ్యాధులు శరీరానికి పెట్టే పరీక్షలు - వీటిమధ్య తపస్వులు జన్మించారు. రామకృష్ణ మిషన్‌కు, వివిధ స్థలాలలో స్థాపించబడిన మఠాలకు, దేశ విదేశాలలో ప్రచారానికీ వీరు పునాదులు వేశారు. 1893 సెప్టెంబరులో షికాగోలో జరిగిన విశ్వమత మహాసభలో స్వామి వివేకానంద సింహగర్జన నుండి విదేశీ శిష్యులు భారతీయ శిష్యులు ఆయనవద్దకు చేరేవరకు మిషన్‌కు పునాదులు వేయడంలో జరిగిన కృషిలో సాధనాలు కొద్దిపాటివి. సాధన మహత్తరమైనది. ఆ 16గురు సన్యాసులలో అయిదుగురు పట్టభద్రులు, పదిమంది కొద్దిగా చదువుకున్నారు. ఒకరు నిరక్షరాస్యుడు. ఈ 16మందీ కలిసికట్టుగా పనిచేశారు. తమ గురువుగారి కలను నిజం చేయడానికై కఠోర తపస్సు చేశారు. నేటి విరాట్ శ్రీరామకృష్ణ మిషన్‌కు పునాదిరాళ్లుగా నిలిచారు.

స్వామి వివేకానందతోపాటు ఈ బృందంలో స్వామి బ్రహ్మానంద, స్వామి శివానంద, స్వామి ప్రేమానంద, స్వామి యోగానంద, స్వామి నిరంజనానంద, స్వామి రామకృష్ణానంద, స్వామి సారదానంద, స్వామి తురీయానంద, స్వామి అద్భుతానంద, స్వామి అభేదానంద, స్వామి త్రిగుణాతీతానంద, స్వామి అద్వైతానంద, స్వామి సుబోధానంద, స్వామి అఖండానంద, స్వామి విజ్ఞానానంద ఉన్నారు.

125 సంవత్సరాల క్రితం వచ్చిన అవతార చేతన తుపాను ఎంత లోతుగా వివిధ వ్యక్తులను ప్రభావితం చేసిందో 21వ శతాబ్దపు తరంవారు తెలుసుకోవడానికై పై వివరం ఇవ్వబడింది. ఈ సన్యాసు లందరూ తపస్వులుగా జీవించారు. లౌకిక సుఖాలను త్యాగం చేశారు. తమ గురువు శ్రీరామకృష్ణ పరమహంసపట్ల పూర్తినిష్ఠతో జీవించారు. వీరి జీవితాలు సమర్పణ భావనకు సముజ్వల ప్రతీకలు. పరిజనులకు స్వామి వివేకానంద గురించే తెలిసి ఉంటుంది. మిగతా 15మందీ స్వామి వివేకానందలోని అలౌకిక శక్తినీ, ప్రచండ పురుషార్థాన్నీ, విద్వత్తునూ ఎంతగానో గౌరవించేవారు. ఆయనను తమ అగ్రజునిగా పరిగణించేవారు. వీరి జీవన గాథలు నేటికీ ఆధ్యాత్మిక మార్గంలో పయనించే లక్షలాది యాత్రికులకు మార్గదర్శనం చేస్తున్నాయి. వీరందరిపై రామకృష్ణ పరమహంస, ఆతర్వాత శ్రీశారదా మాత తమ దయా దాక్షిణ్యాలను, ప్రేమామృతాన్నీ వర్షించారు. వారు చూపిన బాటలో నడిచి, ఈ సన్యాసులు బానిస భారత ఆధ్యాత్మిక పునర్ జాగరణ చరిత్రలో నూతన అధ్యాయాన్ని రచించారు.

ఇక్కడ ఒక ప్రత్యేక విషయాన్ని ప్రస్తావించాలని అనిపిస్తోంది. శ్రీరామకృష్ణ వచనామృతం మూడవ ఖండంలో ఒక

**మనిషి వికాసానికి మాధ్యమం సాహిత్యం.**

మహత్తర విషయంపై చర్చ ఉంది. రామకృష్ణ పరమహంస తమ పరిజనులతో జరిపిన చర్చలను, వారి ఉపదేశాలను, వారి అమృతవాణిని, ఆ మహత్తర క్షణాలను మాస్టర్ మహాశయులు (శ్రీమహేంద్రనాథ్) ఎంతో నైపుణ్యంతో అక్షరబద్ధం చేశారు. ఈ బెంగాలీ గ్రంథాన్ని ప్రసిద్ధ కవి శ్రీ సూర్యకాంత త్రిపాఠీ 'నిరాలా' హిందీలోకి అనువాదం చేశారు. ఈ హిందీ గ్రంథం మూడవ భాగంలోని 267-268 పుటలలో 1885 ఆగస్టు 9 ప్రాంతంలో జరిగిన ఒక సంభాషణ వర్ణించబడింది. **నా అంతరంగానికి ముక్తి లభించదు. వాయువ్య దిశలో నేను మరోమారు శరీరాన్ని ధరించవలసివస్తుంది** - అని శ్రీరామకృష్ణ పరమహంస ఆ సంభాషణలో అన్నారు.

శ్రీరామకృష్ణ పరమహంస తమ ఆధ్యాత్మిక అనుభావాలను వర్ణిస్తూ సహజంగా చెప్పిన ఈ మాటలలో అర్థం ఇమిడి ఉంది - రామకృష్ణ మిషన్ తర్వాత మరో సంస్థ నిర్మాణం అవుతుంది. 20వ శతాబ్దంలోకాని 21వ శతాబ్దం తొలి సగంలోకాని ఆ సంస్థ రామకృష్ణ మిషన్ కార్యాన్ని పూర్తి చేస్తుంది.

శ్రీరామకృష్ణ పరమహంస మళ్లీ జన్మ ఎత్తి ఆ కార్యాన్ని ఆ దివ్యాత్మల సహకారంతోనే పూర్తి చేస్తారు. శ్రీ అరవిందులు వచ్చారు, రమణ మహర్షి వచ్చారు. వీరిద్దరూ కూడా యుగ పరివర్తనను ఉద్ఘాటించి వెళ్లారు. గాయత్రీ పరివార్, యుగనిర్మాణ యోజనలతో ముడిపడిన పరిజనులు తమ గురుసత్తా స్వరూపాన్ని నిశితంగా దర్శిస్తే - శ్రీరామకృష్ణ పరమహంస అమృతవాణి సార్థకం అవుతున్నట్లు వారికి అవగతం అవుతుంది. తమ పూర్వపు అవతారం శ్రీరామకృష్ణ పరమహంస అని పరమపూజ్య గురుదేవులు స్వయంగా అఖండజ్యోతి 1985 ఏప్రిల్ సంచికలో వ్రాశారు. పరమహంస ప్రస్తావించిన వాయువ్యదిశ ఆగ్రా, మథురల మధ్య ఉంది. ఇద్దరి జీవితాల మధ్య ఎంతో సామ్యం ఉంది. ఒకరు గృహస్థులు అయికూడ సన్యాసి జీవితం గడిపారు. శ్రీశారదమాతను శక్తిగా పూజించారు. రెండవవారు శ్రీరామ్ పరమవందనీయ మాతాజీతో పాటు జన శిక్షణ కోసం గృహస్థ జీవితం గడిపారు. గృహస్థ ధర్మంలోనే ముక్తి మార్గాన్ని చూపారు. వారు కుటుంబ నిర్మాణమనే అద్భుత విప్లవాన్ని సాధించారు. కలియుగం శిఖరాగ్రాన్ని చేరిన ఈ యుగంలో సద్ గృహస్థులు, శ్రేష్ఠ వానప్రస్థులు తయారు కావడం కోసం వారు అలా జీవించారు. వారు నవసన్యాసం-పరివ్రాజక ధర్మాన్ని ప్రతిపాదించారు.

శ్రీరామకృష్ణ పరమహంస 1886లో గోలోకం చేరుకున్నారు. ఆతర్వాత స్వామి వివేకానంద, ఆయన తర్వాత ఆయన సహచరులు రామకృష్ణ మిషన్‌ను విశ్వవ్యాప్తం చేశారు. పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీరామశర్మ ఆచార్యజీ 1911లో జన్మించారు. వారు క్రియాశీల కర్మయోగిగా, యుగఋషిగా జీవించారు. వివేకానంద స్థాయి కలిగిన ఎందరినో వికసింపజేశారు. వారిలో పలువురికి ఇప్పుడు తమ వాస్తవిక స్వరూపం ఏమిటో తెలియదు. స్వామి వివేకానంద వంటి సత్ శిష్యులు, మహాపురుషులు వేలాది సంవత్సారాలకు ఒకసారి జన్మిస్తారు. అయితే, ఆయన కార్యాన్ని నిర్వహించడానికై నేటి విషమ పరిస్థితులలో ఆయన అంశలు అనేకం సిద్ధంగా ఉన్నాయి. ఇక జరుగవలసిందల్లా వారు తమ స్వరూపాన్ని గుర్తించడం, తమ ఆరాధ్య సత్తాను అనుభూతి పొందడం మాత్రమే. ఆనాటి చరిత్రను మరోమారు చదివితే ఈ విషయం స్పష్టమై, తగు ప్రేరణ లభిస్తుంది.

మనమంతా మేలుకోవాలి. లౌకిక మార్గాన్ని వదిలి, మనలో బ్రాహ్మణత్వాన్ని మేలుకొలపాలి. మనం మన లక్ష్యాన్ని ఎన్నడూ విస్మరించకూడదు. నిరంతర సాధనద్వారా శక్తిని పెంచుకుని ప్రజాసేవకు మనల్ని మనం అంకితం చేసుకోవాలి. పరమపూజ్య గురుదేవులు స్వయంగా 1969 ఆగస్టు అఖండజ్యోతిలో ఇలా వ్రాశారు: "యుగనిర్మాణ యోజన ఒక శంఖనాదం. అది సంస్కారవంతులైన వ్యక్తులను మేలుకొలుపుతోంది. ప్రభాతకాలపు కర్తవ్యాలలో నిమగ్నులు కండి అని వారిని ప్రబోధిస్తోంది." మనం వారి మాటలను విశ్వసించాలి. 20-11-12న వచ్చే వారి శతజయంతికి ఇక 8-9 సంవత్సరాలే ఉన్నాయి. ఈ 8-9 సంవత్సరాలూ మనం మనల్ని తపస్వులుగా మలచుకోవాలి. మనమంతా మన పూర్వజన్మలలో 100-125 సంవత్సరాలు అలాగే జీవించాం. ఆ చరిత్ర పునరావృతం కావడం తథ్యం.

## (2)

## అభినవ శిక్షణ ప్రణాళిక

గాయత్రీ పరివార్ ఒక సువ్యవస్థిత సంస్థ. దాని శాఖలు దేశమంతటా, ప్రపంచంలోని పెక్కు దేశాలలో విస్తరించి ఉన్నాయి. 1926 వసంత పంచమి రోజున అఖండ దీప ప్రజ్వలనతో జన్మించి, ఇంతటి విరాట్ వటవృక్షంగా రూపొందింది. ఈ సంస్థ మూల సూత్రాలు తపస్సు, కఠోర తపస్సు, జీవన సాధన, ఆత్మీయతా విస్తరణ.

1971 నుండి 1990 వరకు 20 సంవత్సరాలలో సంస్థ వంద సంవత్సరాల కార్యాన్ని సాధించింది. 21వ శతాబ్దంలో భారత్ ప్రపంచ నాయకత్వాన్ని వహించడానికీ, ఉజ్వల భవిష్యత్తును తెచ్చి చూపడానికీ చేసిన ఆధ్యాత్మిక పురుషార్థం అది. ఆ కార్యాన్ని పూజ్యవరులు, పరమవందనీయ మాతాజీ తమ మహాప్రయాణాల (వరుసగా 1990 జూన్ 2, 1994 సెప్టెంబరు 11) వరకు నిర్వహించారు. వంద సంవత్సరాల తర్వాత చరిత్ర తిరిగి వ్రాయబడింది.

కలి ప్రభావం ఎంతో విలక్షణమైనది. అంతా పరమహంస చేస్తున్నారు. గురుదేవులు చేస్తున్నారు. అయినా, మనం మన స్థాయిలో మన వ్యక్తిత్వాలను సంస్కరించుకోవాలి. జీవన సాధనలో ప్రగతి సాధించాలి పూజ్యవరులు ఇలా చెప్పేవారు - ఇది మనం స్వయంగా చేయవలసిన పని. ఇది దైవ సంకల్పం, ఇది భగవానుని మిషన్. ఇది సృష్టి చేసిన నిర్ణయం. యుగ నిర్మాణాన్ని ఎవ్వరూ

**వ్యక్తి ఇతరులను ఎంతగా ద్వేషిస్తే అంతగా దేవుడికి దూరమవుతాడు.**

అడ్డుకోలేరు. మీరు పని చేయకపోయినా అసంఖ్యాకులైన ఉచ్చస్థాయి ఆత్మలతో నేనే పని చేయిస్తాను. వారు పిలుపు కోసం ఎదురుచూస్తున్నారు.

పూజ్యవరుల లౌకిక లీల ముగిసిన 13 సంవత్సరాల తర్వాత నేడు మనమంతా మన జీవన సాధనలో, ఆత్మ శిక్షణలో, కార్యకర్తలుగా పరిణతి చెందడంలో ఏదైనా లోపం జరిగిందా అని పరిశీలించుకోవాలి. జరిగితే - గాయత్రీ తీర్థానికి చేరాలి. ఆ కషాయ కల్మషాలను క్షాళన చేసుకుని క్రియాశీలంగా పురోగమించాలి. వ్యవధి కొద్దిగానే ఉంది. 8-9 సంవత్సరాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ వ్యవధిలో ఎందరో ప్రశిక్షకులు, క్రియాశీల సహచరులు, సమీక్షకులు, నాయకత్వం వహించే జోనల్ అధికారులను తయారు చేసి, వారికి ఉద్యమ బాధ్యతను అప్పగించాలి. సప్త ఉద్యమాలు దేశమంతటా, సప్తసూత్ర కార్యక్రమం విదేశాలలో వేగం పుంజుకుంటే- 2011-12 తర్వాతి సమయం భారతీయ సంస్కృతి జాగరణకూ, హిందూత్వ జాగరణకూ అద్భుతమూ, అతి విలక్షణమూ అయిన తరుణం అవుతుంది. గాయత్రీ పరివార్‌కు, దానితోపాటు ఈ దిశలో పనిచేస్తున్న అనేకానేక సంస్థలకూ ఆ తరుణాన్ని తెచ్చిన ఘనత దక్కుతుంది.

ఈ సంవత్సరం 2003 నవంబర్‌నుండి 2004 జనవరి 20 వరకు తొమ్మిది రోజుల సంస్థాగత రిఫ్రెషర్ శిబిరాలు నిర్వహించే క్రొత్త వ్యూహరచనను శాంతికుంజ్-గాయత్రీ తీర్థం రూపొందించింది. అనంత సామర్థ్యం కలిగిన పరిజనులు ఎందరెందరో ఉన్నారు. ప్రచారం, శిక్షణ, ప్రౌఢుల సమస్యలను పరిష్కరించడం, యువశక్తికి మార్గదర్శనం చేయడం వంటి పనులు చేసే సామర్థ్యం వారికి ఉన్నది. కేంద్రాన్ని చేరుకోవడానికి సమయం చాలదని వారిలో పలువురికి అనిపించవచ్చు. ఇందుకు ఒక పరిష్కారం కనుగొన్నాం. సమర్థులు, ఏదైనా ప్రాజెక్టు చేపట్ట దలచినవారు అయిన పరిజనులు పరస్పరం చర్చించుకుని తమ పేర్ల జాబితాను జోనల్, సబ్ జోనల్ స్థాయిలో తయారు చేసి శాంతికుంజ్‌లో జరిగే తొమ్మిది రోజుల శిబిరంకోసం ఒకేసారి అనుమతి పొందాలి. ఒకే జోన్‌లో ఉన్న ఇలాంటి వ్యక్తులు కూడా కలసి శాంతికుంజ్ రావచ్చు. ప్రాతఃకాలం నుండి 12 గంటలవరకు వారికి అనుష్ఠానం, సాధనాత్మక కార్యక్రమాలు ఉంటాయి. ఆతర్వాత రాత్రి 9 గంటల వరకు ముమ్మరంగా రిఫ్రెషర్ శిక్షణ జరుగుతుంది. ఆరు రోజులలో జరిగే ఉపయోగకర కార్యక్రమాల ఫలితంగా వారు స్పష్టమైన కార్య ప్రణాళికను తయారు చేసుకుని వెళ్లగలుగుతారు. వక్తలు, వైద్యులు, నిర్మాణాత్మక కార్యక్రమాలలో అభిరుచి కలిగినవారు తమతమ బృందాలు ఏర్పరచుకుని రావచ్చు. ఇక్కడ నుంచి వెళ్లిన తర్వాత వారు తమ కార్యరంగానికి వెళ్లి శిక్షణ ఇవ్వగలుగుతారు. మేము వారికి ఒక సహచరుణ్ణి ఇస్తాం. పరస్పరం చర్చించుకుని బృందాలుగా ఏర్పడి రండి. కనీసం 40-45 మంది ఒక బృందంగా ఏర్పడితేనే ఇలాంటి కోర్సువల్ల పూర్తి ప్రయోజనం చేకూరుతుంది. పరిజనులు ఇప్పటినుంచే పరస్పరం చర్చించుకుని ఏ శిబిరంలో చేరాలని అనుకుంటున్నారో వ్రాయండి. అనుమతి లభించిన వెంటనే అందరూ రండి. మేము కూడ బాగా ఆలోచించిన మీదట బృందానికి అనుమతి ఇస్తాము. ఇప్పటినుంచే తగు ఏర్పాట్లు ప్రారంభిస్తే మనం రానున్న వసంత పంచమి వరకు గల సమయాన్ని సద్వినియోగం చేయగలుగుతాము.

## హెలెన్ కెల్లర్ ప్రతిభ

హెలెన్ కెల్లర్ పేరు శిక్షిత ప్రజానీకంలో వినని వారుండరు. కానీ, ప్రకృతి ఈమె పట్ల ఏమాత్రం దయ చూపించలేదు. ఈమె గ్రుడ్డి, కుంటి, చెవిటి. అయినా తన తెలివితేటలు సంకల్పబలం ఈ రెండింటినీ ఆసరాగా చేసికొని ఏదో అన్వేషిస్తూ విద్యాధ్యయనం చేసేది. బుద్ధికుశలత వల్ల ఈమె ప్రతి ప్రయత్నం సత్ఫలితాన్నిచ్చేది. లాటిన్, ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో ప్రవీణురాలై ఇంగ్లీషు ఎమ్.ఏ. పట్టాను పొందింది. వంటచేసికోవటం, బట్టలుతుక్కోవటం వంటి సాధారణమైన పనులన్నీ స్వయంగా చాలా చక్కగా చేసికొనేది. ఈమె తన కౌశల్యాన్ని కేవలం వ్యక్తిగత లాభానికే పరిమితం చేయక, అంగవిహీనుల శిక్షణకు స్వావలంబనకు వినియోగించేది. తరువాత ప్రపంచం అంతా తిరిగి, కోట్ల రూపాయలు సంపాదించి అనేక ఉపయోగకరమైన పనులు చేసింది. ఈమె ప్రతిభకు ప్రభావితమైన అనేక విశ్వవిద్యాలయాలు ఈమెను గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. ఈమెను ప్రజలు ప్రపంచంలోని 8వ వింతగా చెప్పుకొనేవారు.

సన్యాసులు, మహాత్ములు ఇటువంటి గుణాలనుండే పుట్టుకొనివస్తారు. ఇంద్రియాలను అంతర్ముఖం చేసి, ప్రజ్ఞద్వారా అనేక ఘనకార్యాలను సాధించే మహాపురుషులు ఈకోవకు చెందినవారే. ప్రేమ, సంవేదన, సౌజన్యం వంటి దివ్యగుణాల వ్యక్తీకరణకు శబ్దాలు అక్కరలేదు. ఇది ఆత్మాభివ్యక్తి. ఉద్దండులైన వ్యక్తుల్ని సైతం వీటి ఆధారంతోనే ఆదర్శవంతులను చేయటం, ప్రవీణులుగా తీర్చిదిద్దటం సాధ్యమవుతుంది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ఇతరులను మోసగించేవాడు నిజానికి తనను తాను మోసగించుకుంటాడు.**

# శాంతికుంజ్ సమాచారం

## గాయత్రీ మంత్రమే నాకు శ్రీరామరక్ష

## నొయెడా గాయత్రీ చేతనా కేంద్రంలో ఉపరాష్ట్రపతి

**శ్రీ భైరాన్‌సింగ్ శెఖావత్**

రాజ్యసభ అధ్యక్షుడుగా నేను ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తున్నదో మీ అందరికీ తెలుసు. ఆ సందర్భాలలో నాకు గాయత్రీ మహామంత్రమే శ్రీరామరక్ష అవుతోంది.

అని గౌరవనీయ ఉపరాష్ట్రపతి శ్రీ భైరాన్‌సింగ్ శెఖావత్ సెప్టెంబరు 1న నొయెడాలో గాయత్రీ చేతనా కేంద్రం ప్రారంభోత్సవంలో వెల్లడిచేశారు.

అఖిలవిశ్వ గాయత్రీ పరివార్ ప్రముఖులు డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ప్రసంగిస్తూ, కేంద్రంలో సంస్కారాలు ఇవ్వడంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. మల్టీమీడియా, వీడియో ప్రొజెక్షన్‌ల ద్వారా భారతీయ సంస్కృతి వైజ్ఞానిక స్వరూపాన్ని ఈ కేంద్రంలో ప్రదర్శిస్తారు. నిర్మాణాత్మక కార్యక్రమాల నిర్వహణలో, గ్రామాలకు స్వయంసమృద్ధి కల్పించడంలో, ఆయుర్వేద చికిత్సలో శిక్షణ ఇస్తారు. వనమూలికలతో తయారైన ఔషధాలు, యోగ శిక్షణ ఇక్కడ లభిస్తాయి.

శాంతికుంజ్ వ్యవస్థాపకులు శ్రీ గౌరీశంకర శర్మ ప్రసంగిస్తూ, కేంద్రంలో గాయత్రీ పరివార్ కార్యకలాపాలను చూపే ప్రదర్శన ఉన్నదని తెలిపారు.

ఉత్తరప్రదేశ్ గవర్నరు గౌరవనీయ శ్రీ విష్ణుకాంత్ శాస్త్రిజీ, కేంద్రమంత్రి శ్రీ అశోక్ ప్రధాన్, ఉత్తరప్రదేశ్ మంత్రులు ఇద్దరు ఉత్సవంలో పాల్గొన్నారు.

### విద్యా విధానాన్ని ఆధ్యాత్మీకరించాలి

యు.జి.సి, ఐ.సి.ఎస్.ఎస్.ఆర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం "ఉన్నత విద్యలో ప్రమాణాలు" అనే అంశంపై జూలై 28,29లలో రెండు రోజుల సదస్సు నిర్వహించింది.

విశ్వవిద్యాలయం కులాధిపతి డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ సదస్సులో ప్రసంగిస్తూ, శిక్షణకూ విద్యకూ మధ్య, విజ్ఞానానికి, ఆధ్యాత్మికతకు మధ్య సమన్వయాన్ని సాధించాలని సూచించారు. వారింకా ఇలా అన్నారు - నేటి ప్రపంచంలో భావనలకు ప్రాముఖ్యం ఉండడం లేదు. పెట్టుబడిదారీ విధానపు కాలుష్యం విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చుతోంది. విద్యను ఆధ్యాత్మీకరించాలి. రానున్న రోజులలో దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం ఉన్నత విద్యకు మార్గదర్శనం చేస్తుంది. ఫలితంగా రేపటి తరంవారు సర్వతోముఖ వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోగలుగుతారు.

పర్యావరణ ఉద్యమ ప్రముఖుడు శ్రీ సుందర్‌లాల్ బహుగుణ ప్రసంగిస్తూ, నేటి ప్రపంచ సంక్షోభానికి పరిష్కారం భారతీయ సంస్కృతి సిద్ధాంతాలలో లభిస్తుందని అన్నారు. వారింకా ఇలా అన్నారు - భారతీయ విద్య ముక్తిని ప్రసాదిస్తుంది. ప్రస్తుత విద్యా విధానం బంధనాలను సృష్టిస్తోంది.

### శాంతికుంజ్‌లో హిమాచల్ గవర్నర్

హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ గౌరవనీయ శ్రీవిష్ణు సదాశివ కోక్‌జె ఆగస్టు 17న సతీసమేతంగా శాంతికుంజ్‌కు విచ్చేశారు. శాంతికుంజ్ ప్రముఖ్ శ్రద్ధేయ శైల దీదీ, డా॥ప్రణవ్ పండ్యాజీ ఆయనకు తిలకందిద్ది స్వాగతం పలికారు. గవర్నర్ దేవసంస్కృతి విశ్వవిద్యాలయాన్ని కూడా దర్శించారు. ఆ సందర్భంగా ప్రసంగిస్తూ ఆయన, విశ్వవిద్యాలయం దేవసంస్కృతి గరిమను, మహిమను తిరిగి స్థాపిస్తుందని అన్నారు. విశ్వవిద్యాలయంలో శిక్షణ పొందిన విద్యార్థులు దేశ విదేశాలలో పర్యటించి సాంస్కృతిక జాగరణ మహోద్యమాన్ని నిర్వహిస్తారనీ, అంకితభావం కలిగిన అలాంటి వ్యక్తులు జాతిని పరమవైభవ స్థితికి కొనిపోతారనీ ఆయన వివరించారు.

### శాంతికుంజ్‌లో సుప్రీం కోర్టు న్యాయమూర్తి శ్రీ డి.రాజు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ డి.రాజు తమ 65వ జన్మదినోత్సవం జరుపుకోవడానికై సతీసమేతంగా శాంతికుంజ్ వచ్చారు. శ్రద్ధేయ శైలదీదీ ఆ సందర్భంగా ఆయనకు మంగళ తిలకం దిద్ది, యుగ సాహిత్యాన్ని బహుకరించారు.

న్యాయమూర్తి శ్రీ డి.రాజు దేవసంస్కృతి విశ్వవిద్యాలయాన్ని దర్శించి, అక్కడ ప్రజ్ఞేశ్వర మహాకాలునికి ప్రత్యేక పూజలు జరిపారు.

**ఏ రోజున స్వాధ్యాయం జరపకపోతే ఆరోజున మనిషి అపవిత్రుడు అవుతాడు**

## వార్తలు

# గోదావరి పుష్కరాల సందర్భంగా భద్రాచలంలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం

గోదావరి పుష్కరాల సందర్భంగా భద్రాచలంలో ఆగస్టు 8 సాయంత్రం కలశయాత్ర జరిగింది. ఆతర్వాత 5000 దీపాలతో దీప యజ్ఞం జరిగింది. 9,10లలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. శ్రీపరమానంద ద్వివేది, డా॥తుమ్మూరి, శ్రీప్యారేలాల్‌లు యజ్ఞ సంచాలన చేశారు. ఆ సందర్భంగా సప్త విప్లవాల కరపత్రాలను పంచిపెట్టారు.

## ఇల్లందులో 9 కుండముల గాయత్రీ మహాయజ్ఞం

శ్రావణ పూర్ణిమ సందర్భంగా ఇల్లందులో ఆగస్టు 12న 9 కుండముల గాయత్రీ మహాయజ్ఞం, పద్మశాలి సేవాసంఘ సమ్మేళనం, సామూహిక యజ్ఞోపవీత ధారణ నవీనీకరణల కార్యక్రమం జరిగాయి. 100 మంది సాధకులు పాల్గొన్నారు. ఐదుగురు యజ్ఞోపవీత ధారణ చేశారు. శ్రీ టి.నాగభూషణ్ రావు కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు. శ్రీయుతులు సతీష్ ఖండేల్‌వాల్, గడదాసు నాగేశ్వరరావు ప్రసంగించారు.

## నెల్లూరు జిల్లాలో గాయత్రీ మహాయజ్ఞాలు

జులై 10న నెల్లూరు జిల్లా బ్రాహ్మణపల్లిలో ప్రముఖ నాయకులు శ్రీమేకపాటి చంద్రశేఖర రెడ్డి నూతన గృహంలో త్రికుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 200 మంది పాల్గొన్న ఈ యజ్ఞం అందరిపైనా విశేష ప్రభావాన్ని చూపింది. జిల్లాలోని పలుగ్రామాలలో యజ్ఞాలు నిర్వహించడానికి శ్రీచంద్రశేఖర రెడ్డి ముందుకు వచ్చారు.

వింజమూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో జులై 11,12,13లలో 9కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 11న 108 కలశాలతో కలశయాత్ర, 12 ఉదయం యజ్ఞం, సాయంత్రం 1008 దీపాలతో దీపయజ్ఞం, 13న పూర్ణాహుతి జరిగాయి. 200మంది పాల్గొన్నారు.

జులై 14న దుత్తలూరులో శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయగిరి శాసనసభ్యుడు శ్రీ విజయరామిరెడ్డి ఆధ్వర్యంలో పంచకుండీ యజ్ఞం జరిగింది. 200మంది పాల్గొన్నారు. శ్రీ ఓ.సిద్దారెడ్డి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీయుతులు డి.వి.ఆర్.మూర్తి, ఎస్.ఎస్.ప్రసాద్ యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీయుతులు ఎస్.మహేష్, గోవర్ధన్ రాజపురోహిత్, కోటయ్య, ఆర్ముగం, సత్యనారాయణ, ఓబుల్‌రెడ్డి, శ్రీమతులు హైమవతి, దుర్గ సహకరించారు.

## మల్యాలలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం

కరీంనగర్ జిల్లా చందుర్తి మండలం మల్యాల గ్రామంలో జూన్ 22 ఉదయం 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 21న 251 కలశాలతో కలశయాత్ర, 22 సాయంత్రం 2400 దీపాలతో దీపయజ్ఞం జరిగాయి. 1200 మంది పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా మల్యాల గ్రామ సర్పంచ్ శ్రీదొంగరి భూమయ్య దీప ప్రజ్వలన చేశారు. 35మంది మంత్రదీక్ష తీసుకున్నారు. శ్రీఅడగట్ల సత్యహరి, వారి సతీమణి శ్రీమతి భూదేవి, డా॥ పులి సత్యనారాయణ కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు. శ్రీబాలకృష్ణ, శ్రీమతి అనసూయమ్మ యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీయుతులు బొంబొత్తుల నారాయణ, మర్రి గౌరయ్య, అర్సం రాజమల్లయ్య, కొట్టె రాజమల్లయ్య, అడగట్ల వెంకటి, చకినాల రాములు, మూడపెల్లి రాములు, ముకుందం సహకరించారు.

## విశాఖపట్నంలో గురుపూర్ణిమ ఉత్సవం

గురుపూర్ణిమ సందర్భంగా జులై 13న విశాఖలోని గాయత్రీ ప్రజ్ఞామండలి కార్యాలయంలో విశేష గాయత్రీ యజ్ఞం జరిగింది. ఆసందర్భంగా పుంసవన సంస్కారం, అక్షరాభ్యాస సంస్కారం జరిగాయి. జులై 14న రేసపువానిపాలెం, ఉక్కునగరం, కంచరపాలెంలలో గాయత్రీ యజ్ఞాలు జరిగాయి.

విశాఖ సమీపంలోని మధురవాడలో జులై 20న త్రికుండీయ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. ప్రజ్ఞామండలి ఏర్పడింది. డా.జి.చంద్రశేఖరం, బి.హెచ్.గణపతి, శ్రీపండా దంపతులు శ్రీ ఎస్. ఎన్.రావు విచ్చేశారు. శ్రీకాంచన్ ప్రవచనం ఇచ్చారు. పదిమంది గురుదీక్ష తీసుకున్నారు.

ఆగస్టు 11,12లలో విశాఖ సమీపంలోని చంద్రంపాలెంలో కలశయాత్ర, పంచకుండీయ గాయత్రీ యజ్ఞం, 2400 దీపాలతో దీపయజ్ఞం జరిగాయి.

**ప్రయాణికునివలె జీవించు. ఆనందం అనుభవించు.**

# భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష

ఋషులు, మునుల దేవభూమి భారతదేశం. పూర్వం ఈ దేశం ప్రకాశ స్తంభంలా నిలిచి విశ్వమంతటిలో తన దేవ సంస్కృతిని అవలోకిస్తూ ఉండేది. ఇందుకు ప్రమాణాలు ఇప్పటికీ ప్రపంచంలోని చాలా దేశాల్లో లభ్యమవుతున్నాయి. బుద్ధ భగవానుని ధర్మచక్ర ప్రవర్తన వరకు ఈ దేశ సంస్కృతి దిగ్దిగంతాలలో ప్రకాశిస్తూ ఉండేది. కాని కాలాంతరంలో పరాధీనత కారణంగా మన ఈ దివ్యసంస్కృతి క్షీణిస్తూ వచ్చింది.

యుగద్రష్ట పండిత శ్రీరామ శర్మగారు క్షీణిస్తున్న ఈ సంస్కృతి గురించి వ్యాకులత చెందారు. ఈ తరాల వారికి సరైన మార్గదర్శనం చేయడానికి, శిక్షణ, విద్య, సంస్కారముల సమన్వయము అవసరమని, అదే భారతీయ సంస్కృతిని పరిరక్షించునని ప్రతిపాదించారు. ఈ ఉద్దేశంతోనే విద్యార్థి స్థాయిలో భోపాల్‌లో 1999లో భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష ప్రారంభించబడింది. నెమ్మది నెమ్మదిగా ఈ పరీక్ష ఇప్పుడు ఉత్తర భారతదేశంలో 15 రాష్ట్రాలకు విస్తరించింది, దక్షిణాదిన ఈ పరీక్ష ఈ సంవత్సరము ఆంధ్రప్రదేశ్ ప్రారంభించ బడుతుంది. ఈ పరీక్ష ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో నిర్వహించ బడుతుంది.

ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశ్యాలు, విద్యార్థులలో స్కూలు విద్యతో పాటు మానవ విలువలను వికసింప చేయడం, సాంస్కృతిక చైతన్యం జాగృతపరచటం, భారతీయ సంస్కృతిని చేరువలోకి తేవటం, శ్రేష్ఠత, సంవేదన, సద్గుణాల వైపు ఆకర్షణ కలిగించడం, దైనిక జీవనంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను జోడించడం.

ఈ పరీక్ష కొరకు ఇంతవరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని వివిధ యాజమాన్యాలకు ప్రధానోపాధ్యాయులకు, ప్రిన్సిపాళ్లకు, అధ్యయన సామగ్రి (Learning Material) పంపటం జరిగింది. ఇంకా కొన్ని జిల్లాల్లోని స్కూలు యాజమాన్యాలు వీటిని తెప్పించుకోలేదు. గాయత్రి పరిజనులకు జిల్లాల్లోని కార్యకర్తలకు మనవి చేసేదేమంటే వారు వారివారి జిల్లాల్లోని స్కూలు, జూనియర్ కాలేజి యాజమాన్యాలతో సంప్రదించి వారికి కావలసిన అధ్యయన సామాగ్రిని వెంటనే తెప్పించుకోగలరు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరీక్ష తేది ఆదివారం 30.11.03గా నిర్ణయించడమైనది. సమయం ఉదయం గం॥ 10-30 నుంచి గం॥11-30 వరకు.

ఇంతవరకు అధ్యయన సామగ్రి తెప్పించుకున్న యాజమాన్యాలకు, ప్రధానోపాధ్యాయులకు మనవి. మీరు ప్రతి విద్యార్థికి ఒక సెట్ (ప్రశ్నబ్యాంక్, పుస్తకము) అందజేసి, ప్రతి విద్యార్థినుంచి రూ॥ 15 ( పదిహేను రూపాయలు) మాత్రము వసూలు చేసి అట్టి మొత్తం డబ్బును శ్రీ వేదమాత గాయత్రి ట్రస్ట్ (Sri Vedamatha Gayathri Trust) పేరున డి.డి తీసి యుగశక్తి గాయత్రి కేంద్రం, 183/బి, బి.కె.గూడా పార్కు, సంజీవరెడ్డి నగర్, హైదరాబాదు 500 038, అడ్రస్‌కు పంపగలరు.

నామినల్ రోల్స్ (Nominal Rolls) అన్ని విద్యా సంస్థలకు త్వరలోనే పంపించబడును.

పరీక్ష గురించి మరిన్ని వివరాలకు ఆగస్టు, సెప్టెంబరు యుగశక్తి గాయత్రి పత్రికలను చూడగలరు.

పరీక్ష గురించి సంప్రదించ వలసిన ఫోన్ నంబర్లు : 23818641, 23819800, 23704588.

✤ ✤ ✤

## భీమునిపట్నంలో డాక్టర్ రామకృష్ణ

జూలై 27న డాక్టర్ ఎమ్.రామకృష్ణ తమ బృందంతో భీమిలి విచ్చేశారు. శ్రీదుర్గా గాయత్రి శక్తిపీఠంలో ప్రసంగించారు. నాటి మధ్యాహ్నం కార్యకర్తల గోష్ఠిలో ప్రసంగించారు. శ్రీమతి భారతి, డా॥ చంద్రశేఖరం ఆసందర్భంగా డా॥ రామకృష్ణను సన్మానించారు.

జూలై 28 నుండి నాలుగు రోజుల పాటు డా॥ రామకృష్ణ విశాఖలోని వివిధ దేవాలయాలలో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

***

**కష్టం ఒక క్రియ. సుఖం దాని మధుర ఫలం.**